
అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★




ఎనిమిది పాక్ సైనిక స్థావరాల్ని దెబ్బతీశాం

కల్నల్ సోఫియా ఖురేషి

లోపలి పేజీల్లో


సంపుటి 27, సంచిక: 320 | ఆదివారం | 11-05-2025 | హైదరాబాద్

Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar**

పేజీలు: 12 | వెల రూ. 5.00




# కాల్పుల విరమణ

# ఉల్లంఘన

- శనివారం సాయంత్రం 5 గంటల నుండి అమలులోకి
- భూ, జల, వాయు మార్గాల్లో సైనిక చర్యలు నిలిపివేత
- పాకిస్థాన్ మిలిటరీ డైరెక్టర్ జనరల్ విజ్ఞప్తికి భారత్ అంగీకారం
- ఐనా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాం : మిస్రీ ప్రకటన
- రేపు మధ్యాహ్నం మళ్ళీ మిలిటరీ డైరెక్టర్ జనరల్స్ ఫోన్ సంభాషణ



**న్యూఢిల్లీ :** భారత్‌–పాకిస్థాన్ సైనిక చర్యలను నిలిపివేశాయి. పాకిస్థాన్ మిలిటరీ డైరెక్టర్ జనరల్ (డిజిఎంఓ) స్వయంగా భారత మిలిటరీ డైరెక్టర్ జనరల్‌కు ఫోన్‌చేశారు. భారత కాలమానం ప్రకారం శనివారం సాయంత్రం ఐదు గంటల నుండీ రెండు దేశాలు తక్షణం అన్ని రకాల కాల్పులు, సైనిక చర్యలు నిలిపివేయాలని వారిద్దరూ అంగీకరించారు. ఇరదేశాల ఉన్నతాధికారుమధ్య కుదిరిన ఈ అవగాహనమేరకు రెండు దేశాల ప్రభుత్వాల నుండి సైనికబలగాలకు ఆదేశాలు వెళ్ళాయి. ఈ అంగీకారానికి కట్టుబడి పదాతి దళాలు, వాయుసేన, నావికాదళాలు సైనిక చర్యలను నిలిపివేశాయి. ఐనప్పటికీ భారత జాతీయ భద్రతాదృష్ట్యా త్రివిధ దళాలు చాలా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయని, సర్వసన్నద్ధంగానే ఉన్నాయని విదేశాంగ శాఖకార్యదర్శి విక్రమ్ మిస్రి పత్రికాగోష్ఠిలో చెప్పారు. రెండు దేశాలూ ప్రత్యక్షంగా మాట్లాడుకోవడం ద్వారా మాత్రమే ఈ అంగీకారం కుదిరిందన్నారు. అదేవిధంగా మరోవైపు పాకిస్థాన్ విదేశాంగమంత్రి ఇషాక్ దార్ పత్రికాగోష్ఠి నిర్వహించి కాల్పుల విరమణకు తమదేశం అంగీకరించిందని ధృవీకరించారు. పాకిస్థాన్ డిజిఎంఓ శనివారం మధ్యాహ్నం 3.35 గంటలకు భారత డిజిఎంఓకు ఫోన్ చేశారు. ఈ నెల 12వ తేదీన అంటే సోమవారంనాడు మధ్యాహ్నం 12 గంటలకు రెండు దేశాల సైనిక వ్యవహారాల డైరెక్టర్ జనరల్స్ మరోసారి సంభాషణలు తరువాయి 2లో

## ప్రత్యక్షంగా మాట్లాడుకున్నాం

### బ్రిటన్‌సహా 36 దేశాల దౌత్యం:పాక్




భారత్‌–పాకిస్థాన్ రెండు దేశాలు ప్రత్యక్షంగా సంభాషణలు చేశాయని, ఈ ప్రత్యక్ష సంభాషణలలో ఎవరి ప్రమేయం లేదని పాకిస్థాన్ విదేశాంగమంత్రి ఇషాక్ దార్ జియో టీవీ ఇంటర్వ్యూలో చెప్పారు. ప్రత్యక్ష సంభాషణల ఫలితంగా ఉమ్మడి అంగీకారానికి వచ్చామని ఆయన అన్నారు. ఐతే ఈ సమస్యను పరిష్కరించడంలో ఇతర దేశాల ప్రమేయం కూడా ఉందని, ముఖ్యంగా బ్రిటన్ దేశం ఒక పరిష్కారం సాధించడానికి కృషి చేసిందని చెప్పారు. ఈ సమస్య ఒక కొలిక్కిరావడంలో బ్రిటన్ ప్రధానమంత్రి డేవిడ్ లమ్మీ కీలకపాత్ర వహించారని పేర్కొన్నారు. టర్కీ, సౌదీ అరేబియా, అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో తోపాటు మూడు డజన్ల దేశాలు తమ రెండు దేశాలమధ్యా దౌత్యవ్యవహారం నడిపించడంలో భాగస్వామ్యం వహించాయని పాకిస్థాన్ విదేశాంగమంత్రి దార్ పత్రికాగోష్ఠిలో ప్రకటించారు.

## పాక్ చర్య అత్యంత దుర్మార్గం : మిస్రీ

**న్యూఢిల్లీ :** సరిహద్దుల్లో పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. శనివారం రాత్రి ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాల్పుల విరమణ అవగాహనను పాక్ ఉల్లంఘించడం సరికాదన్నారు. డిజిఎంఒ మధ్య జరిగిన అవగాహనను ఉల్లంఘించడాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు. కొన్ని గంటలుగా పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని, ఇది అత్యంత దుర్మార్గమని ఘాటుగా స్పందించారు. కాల్పుల ఉల్లంఘనకు సంపూర్ణ బాధ్యత పాక్ దేనని స్పష్టం చేశారు. సరిహద్దుల్లో పాక్ ఉల్లంఘనలకు సైన్యం తగిన విధంగా జవాబిస్తుందన్నారు. పాక్ అతిక్రమణను నిలువరించేందుకు సైన్యానికి సంపూర్ణ అధికారాలు ఇచ్చామని తెలిపారు. ఇప్పటికైనా ఈ ఉల్లంఘనలను పాకిస్థాన్ నిలువరిస్తుందని ఆశిస్తున్నట్టు విక్రమ్ మిస్రీ చెప్పారు. 'మధ్యాహ్నం 3.35 గంటలకు ఇరుదేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డిజిఎంఒ) స్థాయిలో తరువాయి 12లో

## ఎలాంటి దాడులు చేసినా సహించం

### బదులిచ్చితీరుతాం : భారత్ కమాండర్



పాకిస్థాన్ చేసే ప్రతి దుస్సాహసానికీ భారత దేశం నిర్ణయాత్మకమైన సమాధానాన్ని ఇస్తుందని భారత సైన్యం ప్రకటించింది. ఉగ్రవాదాన్ని సహించేదిలేదని, భారత్‌పైన ఎలాంటి దాడులు చేసినా సహించబోమని భారత సైన్యం స్పష్టం చేసింది. రెండు దేశాలమధ్య కాల్పుల విరమణకు ఒక అంగీకారానికి వద్దామని పాకిస్థాన్ ప్రతిపాదించిన తర్వాత భారత సైన్యం నుండి ఈ స్పష్టమైన ప్రకటన తరువాయి 2లో

## సింధుజలాలపై మార్పు లేదు

పహల్గామ్‌లో ఉగ్రవాదులు దాడి చేసిన తర్వాత భారతదేశ జాతీయ భద్రతకు సంబంధించిన మంత్రివర్గం తీసుకున్న ఐదు కీలక నిర్ణయాలలో ఎలాంటి మార్పూ ఉండదు. భారత్‌–పాకిస్థాన్ మధ్య శనివారం సాయంత్రం నుండీ కాల్పుల విరమణ, సైనిక చర్యల నిలిపివేత అమలులోకి వచ్చినప్పటికీ సింధుజలాల ఒప్పందాన్ని రద్దుచేస్తూ జాతీయ భద్రతకు సంబంధించిన మంత్రివర్గం ఏప్రిల్ 23వ తేదీన తీసుకున్న నిర్ణయం యథాతథంగా కొనసాగుతుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి. రెండు దేశాలమధ్యా కాల్పుల విరమణకు ఫోన్ ద్వారా డిజిఎంఓలమధ్య అంగీకారం తరువాయి 2లో

## ఇది మా మధ్యవర్తిత్వమే



అమెరికా మధ్యవర్తిత్వం చేసిన తర్వాత భారత్‌–పాకిస్థాన్ దేశాలు రెండూ తక్షణం,పూర్తిస్థాయి కాల్పుల విరమణ, సైనిక చర్యల విరమణకు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన సొంత ట్రూత్ సోషల్ మీడియాలో ప్రకటన చేసిన కొద్దిసేపటికి భారత విదేశాంగకార్యదర్శి విక్రమ్ మిస్రీ నుండి కాల్పుల విరమణ అంగీకరా ప్రకటన వెలువడింది. ఐతే ఈ రెండు దేశాలమధ్యా అమెరికా ప్రభుత్వమే కీలక మధ్యవర్తిత్వం తరువాయి 2లో

## పాక్ షెల్స్ దాడిలో ఆరుగురు మృతి

### మృతులలో జమ్ము అధికారి, జెసిఒ, నలుగురు పౌరులు

### 19కి చేరిన మృతుల సంఖ్య

**జమ్ము :** జమ్ము రీజియన్‌లోని వివిధ ప్రాంతాల్లో పాకిస్తాన్ సైన్యం జరిపిన కాల్పులు, దాడుల్లో జమ్ముకశ్మీర్ ఓ ప్రభుత్వ సీనియర్ అధికారి, ఆర్మీకి చెందిన జూనియర్ కమిషన్డ్ అధికారి (జెసిఒ) మృతి చెందగా.. 20 మందికిపైగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. పూంచ్, రాజౌరి, జమ్ము, బారాముల్లా సెక్టార్లలో గత నాలుగు రోజుల్లో జిల్లా డెవలప్మెంట్ ఆఫీసర్, ఆర్మీకి చెందిన ఎసిఒ పాటు మరో 19 మంది గ్రామస్తులు మృతిచెందారు. పూంచ్ జిల్లాలో బుధవారం 12 మంది సాధారణ పౌరులు మరణించారు. శుక్రవారం తరువాయి 12లో

## ప్రధాని నేతృత్వంలో తక్షణమే అఖిలపక్షం

- ప్రత్యేక పార్లమెంట్ సమావేశం ఏర్పాటు చేయాలి
- కాల్పుల విరమణ నేపథ్యంలో కాంగ్రెస్ డిమాండ్



**న్యూఢిల్లీ :** భారతదేశం, పాకిస్తాన్ తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో మునుపెన్నడూ లేని విధంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, రాజకీయ పార్టీలను విశ్వాసంలోకి తీసుకోవాల్సిన మరింత అవసరం ఏర్పడిందని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. గడిచిన 18 రోజుల సంఘటనలపై చర్చించడానికి ప్రభుత్వం పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తరువాయి 12లో

## అమెరికా ఎలాంటి మధ్యవర్తిత్వం చేసింది? : సిపిఐ

- ప్రజలకు ప్రధాని చెప్పాలి
- పరిష్కరించుకునే పరిణతి ఇరు దేశాలకు ఉంది
- కాల్పుల విరమణను స్వాగతిస్తున్నట్లు ప్రకటన



**న్యూఢిల్లీ :** భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య కాల్పుల విరమణను సిపిఐ స్వాగతిస్తున్నదని,ఇరు దేశాలు తమ ప్రజల ప్రయోజనాల దృష్ట్యా దానిని కొనసాగిస్తాయని ఆశిస్తున్నామని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. అదే సమయంలో,ఈ ప్రక్రియలో అమెరికా పాత్రపై కొన్ని ప్రశ్నలకు కారణమవుతుందన్నారు. ఈ మేరకు రాజా తన 'ఎక్స్' సామాజిక మాధ్యమం ఖాతాలో శనివారం నాడు పోస్ట్ చేశారు. డొనాల్డ్ ట్రంప్, అమెరికా జోక్యం లేకుండానే భారతదేశం, పాకిస్థాన్ తమ తరువాయి 12లో

## ఉగ్రవాదం ఎక్కడ ఉన్నా సమూలంగా నిర్మూలించాల్సిందే

### పహల్గామ్‌లో భార్యముందే భర్తను చంపడం హేయమైన చర్య



- పాక్‌లో ఉగ్రవాద శిక్షణ కేంద్రాలను ధ్వంసం చేసి భారత్ సైనిక శక్తిని ప్రపంచానికి చాటింది
- సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా

ప్రజాపక్షం / హైదరాబాద్

మానవాళికి బద్ధ శత్రువైన ఉగ్రవాదం ఏ మతంలో ఉన్నా, ఏ కులంలో ఉన్నా, ఏ ప్రాంతంలో ఉన్నా దానిని సమూలంగా నిర్మూలించాల్సిందేనని సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. ఆడపిల్ల కన్నీరు ఊరికే పోదని, ఆపరేషన్ సిందూర్‌తో భారత సైన్యం పక్కా ప్రణాళికతో పాకిస్థాన్ కేంద్రంగా కరుడుగట్టిన ఉగ్రవాదులు శిక్షణ పొందిన పలు కీలక ఉగ్రవాదుల శిక్షణ కేంద్రాలను విజయవంతంగా ధ్వంసం చేయడం ద్వారా భారత సైనిక శక్తిని ప్రపంచానికి చాటిందని వారు ప్రశంసించారు. పహల్గామ్‌లో ముష్కరులు కాళ్ల పారాణి ఆరక ముందే భార్య ముందు భర్తను చంపడం హేయమైన చర్య అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన తరువాయి 2లో

## 27 నాటికి నైరుతి రుతుపవనాలు

**న్యూఢిల్లీ :** నైరుతి రుతుపవనాలపై భారత వాతవరణ శాఖ ఐఎండి కీలక ప్రకటన చేసింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణంగా కన్నా ముందే కేరళను తాకే అవకాశం ఉందని వెల్లడించింది. సాధారణంగా జూన్ 1వ తేదీకి రుతుపవనాలు కేరళను తాకుతాయి. కానీ ఈసారి మూడు రోజుల ముందుగానే అంటే మే 27వ తేదీన దేశంలో ప్రవేశించే అవకాశం ఉందని శనివారం ఐఎండీ ప్రకటించింది. ఐఎండి లెక్కల ప్రకారం, కేరళలోకి రుతుపవనాలు ప్రవేశించే సమయం గత 150 సంవత్సరాలుగా మారుతూనే ఉంది. అత్యంత వేగంగా 1918లో మే 11న ప్రవేశించాయి. అత్యంత ఆలస్యంగా 1972 జూన్ 18న ప్రవేశించాయి. గతేడాది మే 30న, 2023లో జూన్ 8న, 2022లో మే 29న, 2021లో జూన్ 3న, 2020లో జూన్ 1న, 2019లో జూన్ 8న, తరువాయి 2లో



## యుద్ధ ప్రాతిపదికన సీతారామ, సీతమ్మ సాగర్

### ప్రాజెక్టుల పనుల పూర్తిలో సమస్యలుంటే పరిష్కరించుకుని ముందుకు సాగాలి

### ఇంజనీర్లకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, సీతమ్మ సాగర్ బహుళార్థసాధక ప్రాజెక్టు లను త్వరితగతిన పూర్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని నీటిపారుదల మరియు పౌర సరఫరాల మంత్రి ఎన్ .ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దక్షిణ తెలంగాణ నీటిపారుదల అభివృద్ధికి కీలకమైన ఈ బహుళార్థసాధక ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని ఇందుకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే తక్షణమే పరిష్కరించుకుని ముందుకు సాగాలని ఇంజనీర్లను తరువాయి 2లో



సంస్మరణ

ఉన్నతమైన జీవిత లక్ష్యాలతో చివరి శ్వాస దాకా ఆదర్శ కమ్యూనిస్టుగా నిలిచి నడిచి నడిపించిన అమరజీవి కా॥ తూము సుశీలమ్మ గారికి సంస్మరణ వేళ అశ్రునివాళి..


అమరజీవి కా॥ తూము ప్రకాశరావు గారు

కష్టకాలంలో మొక్కవోని దీక్షతో
కుటుంబాన్ని నడిపించడమే కాక
పార్టీకి దన్నుగా నిలిచిన మీ స్ఫూర్తి
ఎందరికో ఆదర్శం.
మీ మాట బాట మాకు మార్గదర్శి
మీ ఆశయం సదా అనుసరణీయం
మీ మాటే మా మాట
మీరు చూపిన బాటలో నడుస్తూ
మీ ఆశయసాధనకు పున : రంకితమవుతూ...

అమరజీవి కా॥ తూము సుశీలమ్మ గారు
మాజీ సర్పంచ్, రాయన్నపేట
సిపిఐ సీనియర్ నాయకురాలు
బోనకల్ మం॥, ఖమ్మం జిల్లా.

కుమార్తెలు - అల్లుళ్లు :
బత్తినేని నీరజ - నాగప్రసాదరావు
పారా వనజ కుమారి - శ్రీనివాసరావు

మనుమళ్లు - మనుమరాళ్లు :
బత్తినేని ప్రకాష్ - స్వాతి
బత్తినేని రాకేష్ - డా॥ లలిత
పారా ప్రణీత్ - ప్రత్యూష
ఏనుగు డిల్లీబాబు - శ్రావ్య

కుమారుడు - కోడలు :
తూము రోషన్ కుమార్ - సుజాత

మనుమడు
తూము జయప్రకాష్

ముని మనుమడు :
బత్తినేని రేయాన్

ముని మనుమరాళ్లు :
బత్తినేని జష్వి
బత్తినేని ధాత్రి

సిపిఐ రాయన్నపేట గ్రామ శాఖ

సంస్మరణ సభ : ది.11-05-2025 ఆదివారం ఉదయం గం॥ 10-00లకు రాయన్నపేట గ్రామం, బోనకల్ మం॥లో జరుగను.



# ప్రపంచం
WORLD NEWS

## పోప్ లియో
## ప్రపంచశాంతికి కృషి చేయాలి
### ప్రపంచ నేతల అభినందనలు

**వాటికన్‌సిటీ :** రోమన్ క్యాథలిక్ మతగురువుగా ఎన్నికైన పోప్ లియో–14 ఈనె 18వ తేదీన లాంఛనపూర్వకంగా అధికారాల స్వీకణోత్సవ కార్యక్రమం జరుగుతుంది. గురువారం రాత్రి పొద్దుపోయిన తర్వాత కొత్త పోప్ లియో–14 ఎన్నిక జరిగింది. ''ప్రపంచానికి శాంతి కలుగుగాక'' అని తొలి సందేశంలో లియో–14 పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు దేశాల నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. అమెరికాకు చెందిన మొట్ట మొదటి పోప్‌గా ఆయన వాటికన్‌సిటీలో బాధ్యతలు చేపట్టారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, తైవాన్ అధ్యక్షుడు లైచింగ్ టె, సింగపూర్ అధ్యక్ష ప్రధానమంత్రులు ధర్మన్ షన్ముంగ రత్నం, లారెన్స్ వాంగ్, మలేసియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం,ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ బాంగ్ బాంగ్ మార్కోస్ తదితరులు పోప్ లియో–14కు అభినందనలు తెలిపారు. ప్రపంచశాంతికి దోహదపడాలని నాయకులు ఆకాంక్షించారు.

# కాల్పుల విరమణపై చర్చిద్దాం రండి
## ట్రంప్‌పై ఒత్తిడి పెంచిన ఇయు దేశాలు



**కీవ్ :** ముప్పైరోజులపాటు ఉక్రేన్‌లో కాల్పుల విరమణ విషయంపై సోమవారం నుండి కూలంకషంగా చర్చించేందుకు ముందుకు రావాలని యూరోపియన్ యూనియన్ దేశాలు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పై ఒత్తిడిని తీవ్రం చేశాయి. యూరప్ దేశాలు ఏర్పాటు చేసిన ''ఇష్టపడేవారికి కూటమి'' శనివారంనాడు ఉక్రేన్ రాజధాని కీవ్ కేంద్రంగా సమావేశం జరిపింది. ఫ్రాన్స్, జర్మనీ, పోలెండ్, బ్రిటన్ నాయకులు కలిసి కీవ్ ట్రైన్ స్టేషన్‌కు చేరుకుని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీని కలుసుకునానరు. కీవ్ ఇండిపెండెన్స్ స్క్వేర్ ఎదుట ప్రపంచయుద్ధం 80వ విజయోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. మరణించిన ఉక్రేన్ సైనికుల స్మృత్యర్థం కొవ్వొత్తులు వెలిగించారు. జర్మనీ కొత్త ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ మొదటిసారి ఉక్రేన్‌లో పర్యటించారు. సమావేశంలో మరొకొందరు యూరప్ నాయకులు దృశ్య మాధ్యమ విధానంలో పాల్గొన్నారు.

ఉక్రేన్ విషయంలో ఇప్పుడిప్పుడే స్వరం మారుస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను దార్లోకి తెచ్చుకోవాలని ''ఇష్టపడేవారి కూటమి'' కృత నిశ్చయంతో ఉంది. కీవ్‌లో జరిగిన సమావేశంలో అతిథేయదేశ అధ్యక్షుడు వి.జెలెన్స్కీ, బ్రిటన్ ప్రధానమంత్రి కీవ్ స్టార్‌మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల మేక్రాన్, పోలాండ్ ప్రధానమంత్రి డోనాల్డ్ టస్క్, జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్, గ్రీక్ ప్రధానమంత్రి కిరియాకోస్ మిత్సో టాకిస్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. యూరోపియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా వోండర్ లేయన్ ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెడుతూ, 30 రోజుల కాల్పుల విరమణకు బేషరతుగా తాను మద్దతు తెలియజేస్తున్నానని ప్రకటించారు. కాల్పుల విరమణ జరగడమంటే ఉక్రేన్‌లో శాంతికి ఒక అడుగు ముందుకు వేయడమేనని బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్‌మర్ అన్నారు. రుమేనియా తాత్కాలిక అధ్యక్షుడు ఇలీ బోలోజన్ మాట్లాడుతూ, 30 రోజులపాటు ఉక్రేన్‌లో కాల్పుల విరమణకు అన్ని దేశాలు బేషరతుగా అంగీకరించాయని, రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఈ విషయంలో తీవ్రమైన ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని, ఒకవేళ ఆయన లొంగకపోతే కొత్త ఆంక్షలు కూడా విధించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎస్తోనియా ప్రధానమంత్రి క్రిస్టేన్ మైఖేల్, ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్, లగ్జెంబర్గ్ ప్రధానమంత్రి లూక్ ఫ్రైడెన్, యూరోపియన్ యూనియన్ నాయకులు అందరూ బేషరతుగా ఇదే మాటమీద నిలబడ్డారు.

**ఆంక్షలు పెడదామనా? చర్చిద్దామనా?**

యూరోపియన్ యూనియన్ నాయకుల 'ఇష్టపడేవారి కూటమి' సమావేశం అంతరార్థాన్ని రష్యా నాయకులు ద్మీత్రీ పెస్కోవ్, ద్మీత్రీ మెద్వెదేవ్‌లు గట్టిగా నిలదీశారు. రష్యాపై కొత్త ఆంక్షలు విధిద్దామని అనుకుంటున్నారా? లేక శాంతి చర్చలు జరపాలనుకుంటున్నారా? అని యూరోపియన్ యూనియన్ నాయకులను వారు ప్రశ్నించారు. శాంతి చర్చలు జరపడం ఉక్రేన్‌కు అసలు ఇష్టం లేదని ద్మీత్రీ పెస్కోవ్ విమర్శించారు. కాల్పుల విరమణ ఒప్పందానికి మద్దతు ఇస్తున్న పుతిన్ అనేక ప్రశ్నలు అడుగుతున్నారనీ, అందుకు సమాధానాలు వారి దగ్గర (ఉక్రేన్) లేవని అందువల్ల వారు చర్చలకు సిద్ధంగా లేరనీ ద్మీత్రీ పెస్కోవ్ ఎబిసి న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఆంక్షలకు రష్యా అలవాటు పడిందని, దాన్నుండి తనను తాను ఎలా రక్షించుకోవాలో రష్యాకు బాగా తెలుసునని మెద్వెదేవ్ అన్నారు.

# గూగుల్ సర్వీస్‌పై కేసు పెట్టిన మెక్సికో
## గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరు మార్పుపై ఆగ్రహం



**మెక్సికోసిటీ :** గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును మార్పుచేసిన గూగుల్ సంస్థపై మెక్సికో దేశ ప్రభుత్వం దావా వేసింది. గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మారుస్తామని అమెరికా అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారానికి ముందునుండీ డోనాల్డ్ ట్రంప్ పదే పదే వాదిస్తూ వచ్చారు. ప్రమాణ స్వీకారం తర్వాత ఆ ఉత్తర్వుపై ఆయన సంతకాలు చేశారు. గల్ఫ్ పనామా ప్రాంత అభివృద్ధికి అమెరికా ఎంతో కష్టపడిందనీ, ఎంతో ఖర్చుచేసిందనీ, అందువల్ల గల్ఫ్ ఆఫ్ మెక్సికో బదులు గల్ఫ్ ఆఫ్ అమెరికా అనే పేరే సరైనదనీ ట్రంప్ చెప్పారు. పనామా కాలువను, పనామా దేశాన్ని కూడా స్వాధీనం చేసుకుంటామని, గ్రీన్స్ లాండ్ దేశాన్ని కొనుగోలు చేస్తామని, వీలైతే ఆక్రమిస్తామని....ఇలా అనేక ప్రకటనలు చేశారు. ట్రంప్ ప్రకటనలకు స్పందించిన గూగుల్‌కు మెక్సికో ప్రభుత్వం అనేకసార్లు విజ్ఞప్తులు చేసినా గానీ గూగుల్ మ్యాప్స్‌లో గల్ఫ్ ఆఫ్ మెక్సికో అనే పేరును గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్పు చేసి చూపించడంతో మెక్సికో ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. గూగుల్ మ్యాప్ సర్వీసెస్‌పై దావా వేస్తున్నట్లు మెక్సికో అధ్యక్షురాలు క్లాడా షీన్‌బామ్ శనివారంనాడు ప్రకటించారు. ఐతే దీనిపై గూగుల్ అధికారికంగా ఎలాంటి ప్రతిస్పందనా ఇవ్వలేదు. కేసు ఎక్కడ దాఖలు చేసిందీ షీన్‌బామ్ కూడా వివరణ ఇవ్వలేదు.

## అండమాన్ వద్ద సముద్రంలో
# కూలిన సోవియట్ అంతరిక్షనౌక కాస్మోస్



**మాస్కో :** అంతరిక్షంలో చిక్కుకుపోయిన సోవియట్ యూనియన్‌కు చెందిన అంతరిక్ష నౌక ''కాస్మోస్–482'' శనివారంనాడు అండమాన్ సమీపంలో హిందూ మహాసముద్రంలో కుప్పకూలిపోయింది. 53 సంత్సరాలక్రితం శుక్రగ్రహంమీదకు ప్రయోగాల నిమిత్తం దీనిని ప్రయోగించారు. హిందూమహాసముద్రంలోని మిడిల్ అండమాన్ దీవులకు పశ్చిమంగా 560 కి.మీ దూరంలో కాలం చెల్లిన ఈ అంతరిక్ష నౌక కుప్పకూలిపోయిందని రష్యా స్పేస్ ఏజన్సీ రాస్కాస్మోస్ ప్రకటించింది. కుప్పకూలిపోయేటప్పుడు చివరిసారి ఈ కాస్మోస్ నౌక జర్మనీ గగనతలం పై కనిపించిందని యూరోపియన్ యూనియన్ అంతరిక్ష సంస్థ ప్రకటించింది. 1972 మార్చి 31న కాస్మోస్–482 అంతరిక్షనౌకను ప్రయోగించారు. కానీ దీనిలో సాంకేతిక సమస్య రావడంతో నాలుగు ముక్కలుగా విడిపోయింది. 53 సంవత్సరాలుగా అంతరిక్షంలో చిక్కుకుపోయింది. దీనిలో రెండు ముక్కలు న్యూజిలాండ్ వద్ద సముద్రంలో కుప్పకూలాయి. రెండు ముక్కలు అండమాన్‌వద్ద పడ్డాయి.

## నేడు అమెరికా– ఇరాన్ మధ్య
# నాలుగోవిడత పరోక్ష అణు చర్చలు



**టెహ్రాన్ :** అమెరికా–ఇరాన్ మధ్య నాలుగో విడత అణు ఒప్పంద చర్చలు ఆదివారంనాడు జరుగుతాయి. ఈ విషయాన్ని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరఘ్చి శనివారంనాడు ధృవీకరించారు. రెండు దేశాలమధ్యా నాలుగో విడత చర్చలు ఓమన్‌లో జరుగుతాయని ఆయన చెప్పారు. ఐతే ఎన్నిగంటలకు ఏ భవంతిలో సమావేశం జరుగుతుందనే విషయాన్ని ఓమన్ ఉన్నత స్థాయీ అధికారవర్గం నిర్ణయిస్తుంది. ఏప్రిల్ 12వ తేదీన ఈ రెండు దేశాలమధ్య ఓమన్‌లో ప్రారంభమయ్యాయి. ఇప్పటికి మూడు విడతలుగా పరోక్ష చర్చలు జరిగాయి. నాలుగోసారి కూడా పరోక్ష చర్చలే జరుగుతాయి. ఈ రెండుదేశాల ఉన్నతస్థాయీ అధికారులూ చెరో గదిలోనూ కూర్చుంటారు. మధ్యవర్తిగా ఉన్న ఓమన్ దేశ ప్రతినిధి వారు చెప్పిన విషయాన్ని వీరికి, వీరు చెప్పిన విషయాన్ని వారికీ మధ్యలో అటూ ఇటూ తిరుగుతూ చేరవేస్తూ చర్చలకు ఒక దుబాసీగా వ్యవహరిస్తారు. అమెరికా తరపున ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్, ఇరాన్ తరపున అరఘ్చిలు ఈ చర్చల్లో పాల్గొంటారు. గతంకంటే మెరుగైన ఒప్పందం చేసుకోవాలని ట్రంప్ భావిస్తున్నారు. ఈ ఒప్పందానికి తలొగ్గకపోతే ఇరాన్‌పై బాంబులతో దాడులు చేస్తామని ఇప్పటికే పలుసార్లు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు.

## ఆరు బంగ్లాదేశ్ టివి ఛానల్స్‌పై
# భారత్‌లో యూట్యూబ్ నిషేధం



**ఢాకా :** బంగ్లాదేశ్‌కు చెందిన ఆరు ఛానల్స్‌ను భారత ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు దేశంలో యూట్యూబ్ నిషేధించింది. ప్రజా భద్రత, జాతీయ భద్రత ప్రాతిపదికపై భారత కేంద్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు ఈ ఛానల్స్ ప్రసారాలను యూట్యూబ్ నిలిపివేసింది. జమూనా టివీ, ఎకొత్తార్ టీవీ, డిబిసి టీవీ, సోమోయ్ టీవీ, బంగ్లా విజన్ న్యూస్, మొహోనా టీవీ చానల్స్‌ను భారత్‌లో ప్రసారాలు నిలిపివేశారు. శుక్రవారం నుండి ఈ ప్రసారాలు అందుబాటులో లేవు. నాలుగు ఛానల్స్‌పై శుక్రవారం నాడు నిషేధం విధించగా డిబిసి, సోమోయ్ ఛానల్స్‌పై శనివారం నుండి నిషేధం అమలులోకి వచ్చింది.

## సింధుజలాలపై మార్పు లేదు
(మొదటి పేజీ తరువాయి)

కుదిరిన తర్వాత, వారికి ఆ మేరకు ఆదేశాలు వెళ్ళిన తర్వాత కేంద్ర ప్రభుత్వ వర్గాలు సింధుజలాల ఒప్పందంలో మార్పులేదని ప్రకటించింది. ఉగ్రవాదాన్ని ఉపేక్షించే ప్రశ్నేలేదనీ, ఉగ్రవాదులను శిక్షించకుండా వదిలి పెట్టం, ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి భారత్ తీసుకున్న నిర్ణయం, దాని కృతనిశ్చయంలో ఎలాంటి మార్పులేదు'' అని భారత ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దక్షిణ కశ్మీరు అనంతనాగ్‌జిల్లా పహల్గామ్‌కు సమీపంలోని ప్రకృతి రమణీయ దృశ్యాలు చూసి పరవశించిపోతున్న పర్యాటకులపై ఏప్రిల్ 22వ తేదీ మధ్యాహ్నం లష్కరే తోయిబా అనుబంధ సంస్థకు చెందిన ఉగ్రవాదులు కాల్పులు జరిపి ఇద్దరు విదేశీయులు సహా దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన 26 మందిని కాల్చి చంపారు. ఈ ఘటనతో రెండు దేశాలమధ్యా ఐదోసారి నాలుగురోజులపాటు యుద్ధం (అప్రకటిత) జరిగింది.

## ఎలాంటి దాడులు చేసినా సహించం
(మొదటి పేజీ తరువాయి)

వెలువడింది. ఇప్పటికే పాకిస్థాన్‌పై భారతదేశం నాలుగు యుద్ధాలు చేసింది. పహల్గామ్ ఘటన తర్వాత ఐదోసారి అప్రకటిత యుద్ధం నాలుగురోజుల పాటు జరిగింది. ఐతే హమాస్ తరహాలో ఒప్పందం ఉల్లంఘనలు జరుగుతాయన్న సందేహాలు వ్యక్తం చేస్తున్న భారతసైన్యం సరిహద్దుల్లో ఎంతో అప్రమత్తంగా, జాగరుకతతో వ్యవహరిస్తున్నది. భారతదేశ సార్వభౌమాధికారాన్ని రక్షించడానికి భారతసైన్యం పూర్తి సన్నద్ధంగా ఉంది, ఏ క్షణంలోనైనా శత్రు దాడినికి తిప్పికొట్టేందుకు జాగరుకత వహిస్తున్నాం'' అని మీడియా సమావేశంలో కమాండర్ రఘునాయర్ చెప్పారు. పాకిస్థాన్ చేసే ప్రతి దుస్సాహసాన్నీ చాలా గట్టిగా ప్రతిఘటిస్తాం, భవిష్యత్‌లో ఎలాంటి కవ్వింపు చర్యలు చేసినా, ఉద్రిక్తతలు సృష్టించేందుకు ప్రయత్నించినా భారత సైన్యం నిర్ణయాత్మకమైన సమాధానం చెప్పితీరుతుంది'' అని రఘునాయర్ అన్నారు.
వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మాట్లాడుతూ, భారతదేశ గగనతల రక్షణ వ్యవస్థ ఎస్–400ను పూర్తిగా ధ్వంసం చేసిందని చెప్పడం పచ్చిఅబద్ధమని అన్నారు. పాకిస్థాన్ అనేకసార్లు దుష్ప్రచార దాడులు చేసిందన్నారు.

## సీతారామ, సీతమ్మ సాగర్
(మొదటి పేజీ తరువాయి)

అదేశించారు. ఖమ్మం జిల్లాలో నిర్మిస్తున్న సీతారామ సాగర్ బ్యారేజ్, ఆనకట్టు నిర్మాణ పనుల పురోగతిపై శనివారం హైదరాబాద్‌లోని జలసౌధలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్న ఈ సమావేశంలో మాజీ ఎంఎల్‌ఎ గుమ్మడి నర్సయ్యను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లోని దాదాపు 7.80 లక్షల ఎకరాలకు ప్రభుత్వం ఖచ్చితంగా సాగునీరు అందించగలదని అన్నారు. ప్రభుత్వ హయాంలో సీతారామ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులకు ఒక రోజు కూడ కృషి చేయలేదని, అదే కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన 16 నెలలలోపే నీటి కేటాయింపులను సాధించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాదేనని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు 67 టిఎంసిల గోదావరి నది నీటిని కేటాయించాలని కేంద్రాన్ని, కేంద్ర జల సంఘం (సిడబ్ల్యుసి)ను ఒప్పించి , మెప్పించి సాధించగలిగామన్నారు. అంతకు ముందు అధికారులు ఈ ప్రాజెక్టుకు పనుల స్థితి గతులు, పెండింగ్ సమస్యలపై వివరణాత్మక ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ప్రధాన కాలువ పనులు 9 7శాతం పూర్తయ్యాయని , మూడు ప్రధాన పంప్ హౌస్లు ఇప్పటికే విజయవంతంగా ట్రయల్ రన్ పూర్తి చేశామని తెలిపారు. ఇల్లెందుకు సైతం నీటి సరఫరాను నిర్ధారించాలని గుమ్మడి నర్సయ్య చేసిన విజ్ఞప్తికి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా సానుకూలంగా స్పందించారు. ఈ ప్రతిపాదనను అధ్యయనం చేసి, అంచనాను రూపొందించాలని అధికారులు అదేశించారు.ఇప్పటికే ఉన్న డిజైను మార్చకుండా లింక్ కాలువ నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు.

## ఎనిమిది పాక్
# సైనికస్థావరాల్ని దెబ్బతీశాం
### కల్నల్ సోఫియా ఖురేషి

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్‌కు చెందిన ఎనిమిది సైనిక స్థావరాలను శనివారంనాడు ధ్వంసం చేశామనిభారత సైన్యం ప్రకటించింది. గడచిన నాలుగు రోజులుగా పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతూ, తీవ్ర ఉద్రిక్తతలు సృష్టిస్తూ ఉండటంతో భారతసైన్యం దీటుగా సమాధానం చెప్పింది. భారత రక్షణ మౌలిక సదుపాయాలపైన, పౌర ప్రాంతాలపైన డ్రోన్లు, దీర్ఘశ్రేణి ఆయుధాలు, ఫైటర్ జెట్స్‌ను ఉపయోగించి పాకిస్థాన్ దాడులు చేయడంతో అందుకు ప్రతీకారంగా ఎనిమిది పాకిస్థాన్ సైనిక స్థావరాలను ధ్వంసం చేసినట్లు కల్నల్ సోఫియా ఖురేషి పత్రికాగోష్టిలో చెప్పారు. శత్రుదేశం నుండి ఎదురయ్యే ఎలాంటి దాడులనైనా తిప్పికొట్టేందుకు భారతదేశ సైన్యం అత్యున్నతస్థాయిలో సంపూర్ణ సర్వ సన్నద్ధతతో ఉందని ఆమె చెప్పారు. ఉద్రిక్తలు లేకుండా చూడటంకోసమే భారతసైన్యం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, ఐతే అది ఎప్పటికీ పాకిస్థాన్ అనుసరించే వైఖరిపై ఆధారపడి ఉంటుందని అన్నారు. వింగ్ కమాండర్ వ్యోమికాసింగ్‌తో కలిసి శనివారంనాడు ప్రత్యేక పత్రికాగోష్టిలో ఆమె మాట్లాడారు. పాకిస్థాన్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా భారతదేశంపై దుష్ప్రచారం చేస్తోందని, యుద్ధానికి సంబంధించిన లేని అసత్యాలను, జరగని వాస్తవాలను ప్రచారాలు చేస్తోందని విమర్శించారు. అమాయకులైన ప్రజలపైన, పౌర ప్రదేశాలపైన దాడులకు పాల్పడిందని, జమ్మూ,కశ్మీర్, పంజాబ్ రాష్ట్రాలలో దాడులకు పాల్పడి ఉద్రిక్తతలు సృష్టించిందన్నారు. శుక్రవారం రాత్రి నుండి రెండు వైపుల నుండి సైన్యాలమధ్య తాజా దాడులు జరిగాయని, పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరులో భారత్ మే ఏడవ తేదీన ''ఆపరేషన్ సిందూర్'' దాడులు చేసినప్పటినుండీ ఆ దేశం యుద్ధనీతి పాటించలేదని, పౌర విమానాలను అడ్డంపెట్టుకుని ముందుకు, సామాన్యపౌరులపై దాడులు చేస్తూ వచ్చిందని అన్నారు. పాకిస్థాన్ ఒక పిరికిపందలాగా గురువారం రాత్రి శ్రీనగర్, అవంతిపుర, ఉద్ధంపూర్‌లలో, ఒక వైమానిక కేంద్రంపైన,స్కూలు ప్రాంగణంపైన దాడిచేసిందని, పిల్లలను బలి తీసుకుందని, ఒక వైద్యకేంద్రంపై దాడి చేసిందన్నారు. హైస్పీడ్ క్షిపణులను ఉపయోగించిందన్నారు. పంజాబ్‌లోని వాయుసేన కేంద్రానికి కొంత నష్టం జరిగిందన్న విషయాన్ని శుక్రవారం అర్ధరాత్రి 1.40 గంటలు దాటిన తర్వాత తాము గుర్తించామని చెప్పారు. డ్రోన్లు, దీర్ఘశ్రేణి ఆయుధాలు, జెట్స్‌ను భారత సైనిక స్థావరాలపైకి పాకిస్థాన్ ప్రయోగించిందనీ, ఈ శత్రుదాడులను సమర్థవంతంగా తిప్పికొట్టామని ఖురేషి చెప్పారు. కుప్వారా, బారాముల్లా, పూంఛ్, రాజౌరీ, అఖ్నూర్ సెక్టర్‌లో ఆర్టిల్లరీ మోర్టార్స్‌ను, చిన్నపాటి ఆయుధాలను ప్రయోగించిందన్నారు.

**భారత్ రాకపోకలకు పాక్ గగనతలం పునరుద్ధరణ:** భారత్–పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం కుదిరిన తర్వాత పాకిస్థాన్ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. భారత్ విమానాలకు, రాకపోకలకు అవకాశం లేకుండా తన గగనతలాన్ని మూసివేస్తూ ఏప్రిల్ 23వ తేదీన పాకిస్థాన్ చేసిన ప్రకటనను ఉపసంహరించుకుంది. భారతదేశం నుండి అన్ని రకాలుగా రాకపోకలకు వీలుగా పాకిస్థాన్ గగనతలాన్ని తెరిచామని, ఇక వారు సాధారణ రాకపోకలు కొనసాగించవచ్చుననీ పాకిస్థాన్ ఏర్‌పోర్ట్ అథారిటీ ఒక ప్రకటన చేసింది. పాకిస్థాన్‌లో ఉన్న అన్ని విమానాశ్రయాలను భారతదేశ గగనతలం నుండి విమానాల రాకపోకల కార్యకలాపాలకు అనుమతించినట్లు ప్రకటించింది. అన్ని రకాల విమానాలు రాకపోకలు సాగించడానికి వీలుగా పాకిస్థాన్ గగనతలాన్ని పునరుద్ధరించినట్లు ప్రకటించింది.

**భారత్ తదుపరి దాడులు ఆపేస్తే సైన్యాన్ని వెనక్కు మళ్ళిస్తాం:** భారతదేశం గనుక తదుపరి దాడులను ఆపేస్తే ఉద్రిక్తలను తగ్గించి సైన్యాన్ని వెనక్కు మళ్ళించే ఆలోచన చేస్తామని పాకిస్థాన్ శనివారంనాడు ప్రకటించింది. పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ జియో న్యూస్‌తో మాట్లాడుతూ, అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియోతో తాను సంప్రదింపులు చేశానన్నారు. గడచిన పన్నెండు గంటలుగా రెండు దేశాలమధ్యా క్షిపణి దాడులు జరిగాయని, సైనిక కేంద్రాలే లక్ష్యంగా ఈ దాడులు కొనసాగాయని పాకిస్థాన్ సమాచారశాఖామంత్రి అట్టా తరార్ చెప్పిన అభిప్రాయాలనే పునరుద్ఘాటించారు. ప్రస్తుత పరిస్థితులలో ఉద్రిక్తతలను ఎలా తగ్గించాలన్న విషయాన్ని రెండు దేశాలూ ఆలోచించాలన్నారు. మార్కో రుబియో కూడా పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునిర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి నిర్మాణాత్మకమైన సంభాషణలకు ఒక ఆరంభాన్ని సృష్టిస్తామని చెప్పారన్నారు. చైనాదేశం కూడా ఒక ప్రకటన చేస్తూ భారత్,పాకిస్థాన్ దేశాలు సహనం పాటించాలని, యుద్ధానికి దూరంగా ఉండి నిశ్శబ్దం పాటించాలన కోరింది. రెండు దేశాలమధ్యా పరిస్థితులను తమ దేశం చాలా సన్నిహితంగా గమనిస్తోందని చైనా విదేశాంగమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. రెండు దేశాల ప్రయోజనాలకు మౌనం పాటించడం చాలా అవసరమన్నారు. అదేవిధంగా జి–7 దేశాలు కూడా ఒక విజ్ఞప్తి చేస్తూ రెండు దేశాలు గరిష్ఠస్థాయిలో సహనం పాటించాలని కోరాయి. భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్‌తో మార్కో రుబియో కూడా ఫోన్ సంభాషణ చేశారు.

## మధ్యవర్తిత్వమే (మొదటి పేజీ తరువాయి)

చేసిందని ఆ దేశ మీడియా విస్తారంగా ప్రచారం చేసింది. ''రాత్రంతా అమెరికా సంప్రదింపులు, సంభాషణలు చేసిన తర్వాత భారత్–పాకిస్థాన్ రెండు దేశాలూ పూర్తిస్థాయీ, తక్షన కాల్పుల విరమణకు అంగీకరించాయని చెప్పడానికి నేను ఎంతో సంతోషిస్తున్నాను, సాధారణ విజ్ఞత, విచక్షణ, వివేకాలు ప్రదర్శించి నిర్ణయిం తీసుకున్న రెండు దేశాల తెలివితేటలకు నా అభినందనలు, ఈ విషయంలో మీరు (భారత్–పాకిస్థాన్) ప్రదర్శించిన అప్రమత్తత,జాగరుకతలకు నా కృతజ్ఞతలు'' అని ట్రూత్ సోషల్ మీడియా వేదికగా డోనాల్డ్ ట్రంప్ పోస్టింగ్ చేశారు. అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్‌తో, పాకిస్థాన్ విదేశాంగమంత్రి ఇషాక్ దార్‌తో, పాకిస్థాన్ సైనికదళాల ప్రధానాధిపతి జనరల్ అసిమ్ మునిర్‌తో సంభాషణలు చేసిన తర్వాత డోనాల్డ్ ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో ప్రకటన చేశారు. ''గడచిన 48 గంటలుగా అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, నేనూ కలిసి ప్రధానమంత్రి నరేంద్రమోదీ (భారత్), ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ (పాకిస్థాన్)లతోపాటు భారత్,పాకిస్థాన్ దేశాలకు చెందిన సీనియర్ అధికారులతో సంప్రదింపులు జరిపాం, భారత విదేశీ వ్యవహారాల మంత్రి సుబ్రమణియం జైశంకర్‌తోపాటు పాకిస్థాన్‌కు చెందిన ఆసిమ్ మునిర్, భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, పాకిస్థాన్ జాతీయ భద్రతా సలహాదారు అసిమ్ మాలిక్‌లతో ఎడతెగని సంప్రదింపులు జరిపాం'' అని ట్రంప్ తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. ''ఎట్టకేలకు రెండు దక్షిణాసియా ప్రత్యర్థి దేశాలమధ్య తాత్కాలికంగానైనా యుద్ధ ఉపశమనం కలిగింది, ఈ కాల్పుల విరమణ ఒప్పందంలో అమెరికా మరోసారి మధ్యవర్తిత్వం చేసింది'' అని ఢిల్లీలో ఉన్న బిబిసి దక్షిణాసియా ప్రాంతీయ డైరెక్టర్ అన్బరసన్ ఎథిరాజన్ వార్తాకథనం రాశారు.

## నిర్మూలించాల్సిందే
(మొదటి పేజీ తరువాయి)

మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సరిహద్దుల్లో ప్రాణాలు కొల్పోయిన ఎపికి చెందిన అగ్నివీర్ మురళి నాయక్‌కు వారు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

**ఉగ్రవాద శిక్షణ కేంద్రాలే లక్ష్యంగా దాడులు : అజీజ్ పాషా**

భారత్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి పాకిస్తాన్ దాడులకు తెగబడడంతో పాటు సుమారు 400 వరకు డ్రోన్లను ప్రయోగించగా, వాటిని భారత సైన్యాలు విజయవంతంగా తిప్పికొట్టడం అభినందనీయమని సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. సాధారణ పౌరులకు ఎలాంటి ప్రాణ నష్టం జరగకూడదనే లక్ష్యంతో భారత సైన్యాలు అర్ధరాత్రి తర్వాత కేవలం ఉగ్రవాదుల శిక్షణ కేంద్రాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని వాటిని విజయవంతంగా పూర్తి చేయడం పట్ల ప్రపంచ దేశాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు. కసబ్ లాంటి ఉగ్రవాదులు శిక్షణ పొందిన లష్కరే తైబా, జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిద్దీన్ అనే ప్రధానమైన ఉగ్రవాద శిక్షణ కేంద్రాలను పాకిస్థాన్‌లోకి చొచ్చుకుని వెళ్లి భారత సైన్యం పూర్తిగా ధ్వసం చేయడం మన దేశ సైనిక శక్తి పాటవానికి నిదర్శమన్నారు. పాక్తిస్థాన్ మాత్రం జమ్ములోని చర్చిలు, గురుద్వారాలు, ఆలయాలపై దాడులు చేసి మత కల్లోలాలను సృష్టించడం ద్వారా అంతర్గత భద్రతను దెబ్బతీయాలనే కుట్ర చేస్తుండగా భారత పౌరులందరూ ఐక్యంగా ఉన్నామని సైన్యానికి బాసటగా నిలవడం ద్వారా పాక్తిస్థాన్ కుట్రలను తిప్పికొట్టారన్నారు. పాక్తిస్థాన్ అంతర్జాతీయ విమానాలను అడ్డంపెట్టుకొని దాడులకు తెగబడేందుకు యత్నించడం సిగ్గుచేటన్నారు. పాకిస్తాన్ చర్యలను ప్రపంచ దేశాలు నిశ్చితంగా గమనిస్తున్నాయని, కేవలం టర్కీ తప్ప అన్ని దేశాలు భారత్‌కు మద్దతుగా నిలిచాయని ఆయన తెలిపారు.

**ఉగ్రవాదులను మట్టు పెట్టాల్సిందే : నారాయణ**

ఉగ్రవాదులు ఏ మూలన ఉన్నా మట్టు పెట్టాల్సిందేనని, ఇందుకు వేరే అలోచనే అవసరంలేదని డాక్టర్ కె.నారాయణ స్పష్టం చేశారు. ఇందుకు భారత సైన్యం అదే దిశగా చర్యలు తీసుకుంటుందని అభినందించారు. ఉగ్రవాదుల క్యాంపులపై దాడి క్రమంలో పాక్తిస్థాన్‌లోని సామాన్య జనాలకు ఇబ్బందులు కలిగించ వద్దని మాత్రమే తాను మాట్లాడానని, తన వ్యాఖ్యలు వక్రీకరించారని, ఇది సరైంది కాదన్నారు. పాక్తిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో దౌత్యపరంగా ప్రపంచ దేశాలతోమరింత మెరుగైన సంబంధాలను ఏర్పాటు చేసుకుని వాటిని ఏకం చేయాల్సిన అవసరముందన్నారు. తద్వారా అంతర్జాతీయ ఉగ్రవాది అయిన మసుద్ అజర్‌ను భారత్‌కు రప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాక్తిస్థాన్‌కు చైనా మద్దతు ఇస్తుందనేది అపోహ మాత్రమేనని, ఇందుకు సంబంధించి చైనా అధికారికంగా సైతం స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు ఆయన చేశారు.

**కులగణన పూర్తి చేసేందకు కాలపరిమితిని నిర్ధేశించాలి :** కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణనను సిపిఐ పూర్తిగా స్వాగతిస్తుందని, అయితే ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఖచ్చితమైన కాలపరిమితిని నిర్ణయించాలని డాక్టర్ నారాయణ కోరారు. తద్వారా రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి కుల గణన ప్రక్రియను పూర్తి చేసి చట్ట సభల్లో బిసిలకు రిజర్వేషన్లు కల్పించి వారు పోటీ చేసేందుకు అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించాలని నారాయణ డిమాండ్ చేశారు.

**అందాల పోటీలు సిగ్గుచేటు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించడం సిగ్గుచేటని డాక్టర్ కె.నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను అడ్డంపెట్టుకుని వ్యాపారం చేస్తారా, ఇది హీనాతి హీనమైందని పేర్కొన్నారు. మహిళలను పూజించే ఈ దేశంలో మహిళల అంగాంగ ప్రదర్శనతో నిర్వహించే ఈ పోటీల ద్వారా ప్రజలకు ప్రభుత్వం ఏమి సందేశం ఇవ్వాలకుంటుందని నిలదీశారు. ఈ చర్య దేశ రాజకీయాలు పూర్తిగా భ్రష్టుపట్టిపోయాయనడానికి నిదర్శనమన్నారు. యుద్ధ కథనరంగంలో దూసుకుపోతున్న కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు మనకు ఆదర్శమన్నారు. ఎండల తీవ్రతతో 500లకు పైగా గుడిసెలు తగలబడి నిలువ నీడలేక, తాగేందుకు మంచి నీరు కూడా లేక పేద ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వారిని ఆదుకునేందుకు పైసా ఖర్చు చేయని ప్రభుత్వం అందాల పోటీలకు మాత్రం కోట్లాది రూపాయలను ఖర్చు చేయడం సిగ్గుచేటన్నారు. ఇందు కోసమేనా ప్రభుత్వం లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టింది, పేదలను ఆదుకోవడానికి కాదా అని నిలదీశారు.

## కాల్పుల విరమణ
(మొదటి పేజీ తరువాయి)

జరుపుతారు.

**పాకిస్థాన్‌తో చర్చలకు నిర్ణయం తీసుకోలేదు**

పాకిస్థాన్‌లో చర్చలకు భారత్ అంగీకరించిందన్న వార్తలను భారత కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. భారత్–పాకిస్థాన్ మధ్య తలెత్తిన సమస్యపై రెండు దేశాలు ఒక తటస్థప్రాంతంలో చర్చలు జరపడానికి భారత్ అంగీకరించిందనడాన్ని భారత్ తిరస్కరించింది. అలాంటి నిర్ణయం ఏదీ భారతదేశం తీసుకోలేదని ప్రకటించింది. అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ద్వారా ఈ సమాచారం బయటకు వచ్చింది. పాకిస్థాన్ డిజిఎంఓ మొదట చొరవచేసి భారత్ డిజిఎంఓకు ఫోన్ చేశారు. ఆయన కాల్పుల విరమణకు, సైనిక చర్యల విరమణకు ప్రతిపాదించారు, భారత్ అంగీకరించింది'' అని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి.

## రుతుపవనాలు
(మొదటి పేజీ తరువాయి)

2018లో మే 29న నైరుతి రుతుపవనాలు కేరళ తీరానికి తాకాయి.

**2009 కన్నా అత్యంత వేగంగా:** అయితే 2009లో మే 23న కేరళలోకి ప్రవేశించాయి. ఇప్పుడు ఈ ఏడాది ఐఎండీ ఊహించిన విధంగా నైరుతి రుతుపవనాలు తాకితే, 2009 తర్వాత అతిత్వరగా నైరుతి రుతుపవనాలు ప్రవేశించినట్లు అవుతుంది. అయితే రుతుపవనాల కేరళన తాకిన తేదీకి, దేశవ్యాప్త వర్షపాత శాతానికి ఎలాంటి సంబంధం లేదని ఐఎండీ అధికారి వెల్లడించారు.

**ఈ ఏడాది వానలే వానలు!**

అయితే ఈ ఏడాది వర్షాకాలంలో సాధారణం కంటే ఎక్కువే వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ కొద్ది రోజుల క్రితమే ప్రకటించి గుడ్ న్యూస్ చెప్పింది. మొత్తం వర్షాకాలం సీజన్లో ఎల్ నినో తరహా వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం లేదని వెల్లడించింది. అందుకే సాధారణం కంటే ఎక్కువే వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ చీఫ్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. ఎల్ నినో తరహా వాతావరణ పరిస్థితులు ఏర్పడితే వర్షాకాలంలో సాధారణం కంటే తక్కువ స్థాయిలో వర్షాలు పడతాయని, ఈసారి భారత్‌లో ఆ తరహా వాతావరణ పరిస్థితులు ఉండవని అన్నారు. కాగా, మన దేశ వ్యవసాయ రంగానికి నైరుతి రుతుపవనాలు చాలా కీలకమైనవి. జనాభాలో దాదాపు 42.3 శాతం మంది ప్రధాన జీవనాధారం వ్యవసాయమే. దేశ జిడిపికి 18.2 శాతం వాటా వ్యవసాయ రంగం నుంచే సమకూరుతోంది. మరోవైపు, దేశవ్యాప్తంగా తాగునీరు అందాలన్నా, విద్యుత్ ఉత్పత్తికి కీలకమైన జలాశయాలను తిరిగి నిండాలన్నా రుతుపవనాలు ముఖ్యమనే చెప్పాలి.



# జనరల్
STATE & REGIONAL NEWS

## యువ జవాన్ మురళి నాయక్ తెలుగుజాతి గర్వించే యువకిశోరం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా జమ్మూ కశ్మీర్ అమరుడైన యువ జవాన్ మురళినాయక్ తెలుగుజాతి గర్వించే వీర కిశోరమని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కొనియడారు. యువ జవాన్ మురళి నాయక్‌కు నివాళ్లు అర్పించిన కూనంనేని ఆ వీర సైనికుడి తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. దేశ రక్షణలో భాగంగా అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించి 5 మంది ఉగ్ర ముష్కరులను మట్టుబెట్టి మరీ వీరమరణం పొందారని పేర్కొన్నారు. భారతదేశాన్ని ఉగ్రదాడులతో దొంగదెబ్బ తీస్తున్న ఉగ్రవాదులు, పాకిస్థాన్ ఉగ్రవాద శిబిరాలపై విరుచుకుపడుతున్న భారత సైన్యానికీ అభినందనలు తెలిపారు. పార్టీలు, ప్రాంతాలు, మతాలకు అతీతంగా దేశభక్తి వెల్లివిరిసి, భిన్నత్వంలో ఏకత్వమనే నానుడిని ప్రజలు నిజం చేస్తున్నారని, ఇది భారతదేశ సమ్మిళితతత్వాన్ని మరోసారి ప్రపంచానికి చాటిందని తెలిపారు.





కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంతో కలసి జానారెడ్డి శనివారం సురవరం సుధాకర్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను జానారెడ్డి అడిగి తెలుసుకున్నారు. సుధాకర్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి, ఎఐటియుసి జాతీయ నాయకురాలు డాక్టర్ విజయలక్ష్మి, ఆయన కుమారుడు కపిల్‌ను కూడా జానారెడ్డి కలిసి ముచ్చటించారు.

# ప్రభుత్వ ఫలాలు పేదలందరికీ చేరాలి

ఉప ముఖ్యమంత్రి భట్టి ఆకాంక్ష



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ప్రతీ పేదవారిదరికి చేరాలని, సంక్షేమ పథకాలు చేరవేడటంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. జిల్లాలోని అశ్వరావుపేట నియోజకర్గంలో సుమారు 37.67 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న 33 కేవి విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేసిన అనంతరం జిల్లా అధికారులతో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపి రామసహాయం రఘురామరెడ్డి, ఎంఎల్‌ఏలు జారే ఆదినారాయణ, డా.తెల్లం వెంకట్రావు, రామ్‌దాస్ నాయక్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటిడిఏ పిఓ బి.రాహుల్‌తో కలిసి భట్టి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు కమలాపురం సబ్, అంకంపాలెంలో 130కేవి సబ్ స్టేషన్ కూడా మంజూరు చేస్తే నియోజకవర్గ వ్యాప్తంగా విద్యుత్‌కు ఎటువంటి అతరాయం లేకుండా ఉంటుందని వివరించారు. దానికి గానూ భట్టి స్పందిస్తూ వెంటనే ఏర్పాటుకు కావాల్సిన చర్యలు చేపట్టాలని, అశ్వారావుపేట నియోజకవర్గంలో డివిజన్ విద్యుత్ శాఖ కార్యాలయం ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని సిఎండిని ఆదేశించారు. గిరిజనులు అధికంగా నివశించే అశ్వరావుపేట నియోజకవర్గం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుపడి ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అర్హుల దరిచేరాలని, ఇందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ఇది ప్రజాప్రభుత్వం అని, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలను కూడా పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ప్రభుత్వం, అధికారులు కలిసి పనిచేస్తేనే పాలనకు అర్థం ఉంటుందన్నారు. బలంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా తెలంగాణ ఉందని, నేడు దేశం మొత్తం మనవైపే చూస్తోందన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడి 16 మాసాలు అయ్యిందని, తానీ అధికారులు ఇంకా ప్రభుత్వాలోచనకు అనుగుణంగా పనిచేయడం లేదన్నారు. అభివృద్ధిలో అధికారులు భాగస్వామ్యులు కావాలన్నారు. నూతనంగా మంజూరైన పనులు సీజన్‌లో పూర్తి చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని, ఇరిగేషన్ పనులు ఈ సీజన్‌లోనే పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. రానున్న వర్షాకాలంలో గిరిజన ప్రాంతాల్లో వైద్యసేవలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గిరిజన ప్రాంతా ల్లో మౌళిక సదుపాయాల కల్పనకు పంచాయితీరాజ్, ఆర్‌అండ్‌బి, ఐటిడిఏ శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. సన్నబియ్యం పథకం అమల్లో భాగంగా ఇప్పటికే అర్హులందరికీ అందుతున్నాయని, కొత్తరేషన్ కార్డులు కూడా మంజూరు చేసి వారికి కూడా అందిస్తామని చెప్పారు. రాజీవ్ యువ వికాసంలో భాగంగా నియోజకవర్గంలో 4500 మందికి ఒక్కొక్కరికి రూ.5 లక్షలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గాభివృద్ధి కోసం అధికారులు స్థానిక ఎంఎల్‌ఏ సూచనలు తీసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ రక్షణ నిధికి ఒకనెల వేతనం

ప్రకటించిన తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ తన ఒక నెల జీతాన్ని జాతీయ రక్షణ నిధికి ప్రకటించారు. పహల్గాం సంఘటనలో అమాయకులను వారి కుటుంబాల ముందే దారుణంగా హత్య చేసిన దృశ్యాలను, దేశం మొత్తం కన్నీటితో దిగ్భ్రాంతి చెందిందని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో నిరంజన్ అన్నారు. మన సైన్యం ఆ ఉగ్రవాదులను అంతం చేయాలని కోరుకుందని తెలిపారు. సైన్యం దేశ ప్రజల మనోభావాలను గౌరవించి, 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ఉగ్రవాదులపై తన చర్యలను ప్రారంభించిందన్నారు. జాతీయ రక్షణ నిధికి విరాళాలు, ఇతర అన్ని మార్గాల ద్వారా మన సైన్యానికి మద్దతుగా నిలబడటం ప్రతి పౌరుడి విధి అన్నారు.

# ఇస్లాం పేరుతో పాకిస్తాన్ మారణహోమం




భారత్‌లో హిందూ-ముస్లింల మధ్య ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకే పాక్ యత్నం

పార్టీ విభేదాలు పక్కనపెట్టి సైన్యానికి మద్దతు ఇవ్వాలి

పాక్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డ అసదుద్దీన్ ఒవైసీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత్‌లోని హిందూ, ముస్లింల మధ్య ఘర్షణను పాక్ కోరుకుంటుందని, దేశాన్ని మత ప్రాతిపదికన విభజించాలని చూస్తుందని ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. భారత ముస్లింలు దేశం కోసం ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో శనివారం తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉర్దూ జర్నలిస్ట్ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమం జరిగింది. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టియుడబ్ల్యూజె) అనుబంధ సంస్థ అయిన ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉర్దూ జర్నలిస్టులకు అవార్లు ప్రధానం కార్యక్రమం జరిగింది. సుప్రసిద్ధ హైదరాబాది ఉర్దూ పాత్రికేయులు ఫైజ్ మహ్మద్ అజ్గర్, తబస్సుమ్ ఫరీది, హబీబ్ అలీ జిలాని, రహీంల పేరిట ఈ స్మారక అవార్డులను 8 మంది సీనియర్ ఉర్దూ జర్నలిస్టులకు ప్రధానం చేశారు. ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ అధ్యక్షులు ఎం.ఏ. మాజీద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసదుద్దీన్ ఓవైసీ, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వసలహాదారుడు షబ్బీర్ అలీ హాజరయ్యారు. అనంతరం అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ ఇస్లాం పేరుతో పాకిస్తాన్ మారణహోమం సృష్టిస్తుందని విమర్శించారు. ఇస్లాం పేరుతో పాక్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పాకిస్థాన్ దుశ్చర్యలను ప్రతీ భారతీయుడూ తిప్పికొట్టాలి..**

పాకిస్థాన్ దృశ్చర్యలను ప్రతిఒక్క భారతీయుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ద్విజాతి సిద్ధాంతాన్ని తమ పూర్వీకులు తిరస్కరించారన్నారు. ద్విజాతి సిద్ధాంతంపై ఏర్పడిన పాక్, ఆఫ్ఘాన్‌పై ఎందుకు దాడి చేస్తోందని ప్రశ్నించారు. ఇరాన్ సరిహద్దుల్లో పాకిస్థాన్ ఎందుకు బాంబులు వేస్తోందన్నారు. ఆఫ్ఘన్లు, ఇరానియన్లు ముస్లింలు కాదా? అని ప్రశ్నించారు. భారత్‌లో 23 కోట్ల మందికిపైగా ముస్లింలు ఉంటున్నారని తెలిపారు. పహాల్గాంలో అతికిరాతకంగా అమాయక ప్రజలను హతమార్చిందని మండిపడ్డారు. అందుకు ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌తో భారత సైనికులు సరైన సమాధానం ఇస్తున్నారని, పాక్ భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. దేవుడి దయ వల్లే మనమందరం భారత్‌లో జన్మించామన్నారు.

**పాక్‌కు ఇస్లాం పేరు పలికే అర్హత లేదు..**

పవిత్ర మాసంలో చిన్నపిల్లలు, అమాయకులను చంపే పాక్‌కు ఇస్లాం పేరు పలికే అర్హత లేదని అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. అమాయకులను, చిన్నపిల్లలను చంపాలని ఇస్లాం చెప్పలేదని, ఇస్లాం పేరుతో పాక్ అసత్య ప్రచారం చేస్తోందన్నారు. పాకిస్తాన్ ఆర్మీ మనదేశంలోని సామాన్యులను టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతోందన్నారు. దానికి తగిన మూల్యం చెల్లించుకుంటుందన్నారు. పాకిస్థాన్ ఆర్మీ అబద్ధాలతో ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టాలని చూస్తుందని, కానీ వారి మాటలు నమ్మే స్థితిలో ఎవరు లేరన్నారు. శత్రువుల దాడులను మన సైనికులు ధైర్యంగా తిప్పికొడుతున్నారని ప్రశంసించారు. శ్రీనగర్ వరకు డ్రోన్‌లు వస్తున్నాయని, మన సైనికులు ఎంతో ధైర్యంతో వాటిని ఎదుర్కొంటున్నారో ఊహించలేమన్నారు. సరిహద్దు ప్రజలు కూడా ధైర్యంగా నిలబడుతున్నారన్నారు. దేశ సైన్యానికి అండగా నిలవాలని జాతీయ పార్టీలను ఆయన కోరారు. ఈ సమయంలో రాజకీయ పార్టీలు విభేదాలు పక్కనపెట్టి దేశం కోసం ఏకం కావాలని విజ్ఞప్తి చేశారు. పాకిస్థాన్ ఇప్పుడు అధికారికంగా ఒక బిచ్చగాడి దేశంగా మారిందని అసదుద్దీన్ ఓవైసీ విమర్శించారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి పాకిస్థాన్ ఒక బిలియన్ డాలర్ల రుణం కోరడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. పాకిస్థాన్ పతనం ఎంతో దూరంలో లేదన్నారు.

**ఉర్దూ, తెలుగు భాషలను కాపాడుకోవాలి : కె.శ్రీనివాస్ రెడ్డి**



ఉర్దూ, తెలుగు భాషాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇంటర్‌లో సంస్కృతం ప్రవేశపెట్టారని తెలిపారు. ఆంగ్లం, సంస్కృతం, హిందీ భాషాలతో ఉర్దూ, తెలుగు భాషాలు అంతరిచిపోయే ప్రమాదం నెలకొందన్నారు. ఈ క్రమంలో ఉర్దూ, తెలుగు భాషాలను రక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, టియుడబ్ల్యూజె అధ్యక్షులు కె.విరాహత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం



పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో కొలువుదీరిన ప్రజాప్రభుత్వంలో పంచాయితీ కార్యదర్శుల పాత్ర కీలకమని పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం జరిగిన పంచాయతీ కార్యదర్శుల ఆత్మీయ సమ్మేళనం హైదరాబాద్‌లో పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్‌గౌడ్ అధ్యక్షతన జరుగగా రాష్ట్ర మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు జరుగాలన్నా పంచాయతీ కార్యదర్శుల బాధ్యతేనని చెప్పారు. పల్లెల్లో పచ్చధనం, పరిశుభ్రతను కాపాడడమే కాకుండా ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారని సీతక్క వ్యాఖ్యనించారు.కార్యదర్శుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీలు అభివృద్ధి పదంలో నడుస్తున్నాయన్నాయంటే కార్యదర్శుల వల్లేనని స్పష్టం చేశారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పల్లెలన్నీ స్వచ్ఛంగా ఉంచుతూ దేశవ్యాప్తంగా ఎన్నో అవార్డులను తీసుకొస్తునారని ఇది పంచాయతీ కార్యదర్శుల వల్లనే సాధ్యమైందన్నారు. కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ ఓపిఎస్ నుండి జేపిఎస్‌గా మార్చి కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రేడ్4 కార్యదర్శుల 4ఏళ్ల ప్రోహిబిషన్ కాలాన్ని సర్వీస్‌లోకి తీసుకోవాలని సూచించారు. మెడికల్, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని శ్రీకాంత్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జగిత్యాల జిల్లా పంచాయితీ కార్యదర్శులు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ ప్రో.కోదండరాం, జగిత్యాల జిల్లా పంచాయతీ కార్యదర్శిల సంఘం అధ్యక్షులు వంశీధర్ రెడ్డి, కోశాధికారి సిద్ధం సతీష్ కుమార్, నునావత్ రాజ్, హరీష్ కుమార్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం

ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమాజంలో అతి ముఖ్యమైన నాణ్యమైన విద్య, వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా అందించడమే ప్రథమ కర్తవ్యమని, ఇందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చర్యలు చేపట్టారని కాంగ్రెస్ ఎంఎల్‌సి అద్దంకి దయాకర్ తెలిపారు. ఇందులో భాగంగా ప్రైవేట్ వైద్యానికి దీటుగా ప్రజలకు మరింత మెరుగైన ఉచిత వైద్యసేవలను అందించేందుకు ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో త్వరలోనే అత్యాధునిక సౌకర్యాలతో కూడిన 100 పడకల ఆసుపత్రులను అందుబాటులోకి తీసుకురాబోతున్నామని ఆయన వెల్లడించారు. హైదరాబాద్ కోఠి, డిహెచ్‌ఎంఎస్ ఆడిటోరియంలో తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవా వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి అద్దంకి దయాకర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. డైరెక్టర్, డిఎంఇ డాక్టర్ ఎ.నరేంద్ర కుమార్, ఐఎన్‌టియుసి జాతీయ నాయకులు ఎండి. ఇబ్రహీం, అసిస్టెంట్ డైరెక్టర్ డిఎంఈ నర్సింగ్ విజయనిర్మల, ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.నాగన్న గౌడ్, శిక్షణ నర్సుల సంఘం అధ్యక్షులు ఎం.రాజేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, కొవ్వత్తులు వెలిగించి అద్దంకి దయాకర్ తదితరులు నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతి వెలిగించి అంతర్జాతీయ నర్సుల దినోత్సవాలని ప్రారంభించారు. ఈ సందర్భంగా అద్దంకి దయాకర్ మాట్లాడుతూ రోగులను సకల సేవలను అందించి, వారిని తిరిగి ఆర్యోవంతులను చేయడంలో నర్సులదే కీలక పాత్ర అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రవి కిరణ్ పవ్వడి, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎన్.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి వై.శివసాయి కృష్ణ, సంయుక్త ప్రధాన కార్యదర్శి ఏ.లక్ష్మి దేవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు పి.కవిత ఎస్.సంజీవన్ పాల్గొన్నారు.




## రాబోయే ఆరు రోజులు రాష్ట్రంలో మోస్తరు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఆరు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. ఈ మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. శనివారం పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. రానున్న రెండు రోజులు కూడా గంటకు 40 నుంచి 50 కి.మీ. వేగంతో ఈదురుగాలుతో కూడిన వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఆదిలాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణ పేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

## ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు తెలంగాణ ప్రతిష్టను దెబ్బతీయడమే :చామల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ సుందరి పోటీల నిర్వహణను వాయిదా వేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేయడం తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను దెబ్బ తీయడమేనని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్సీ కవిత రాష్ట్రంలో ప్రతి అంశాన్ని రాజకీయ చేసేందుకు ప్రయత్నాస్తున్నారని, రాజకీయంలో ఉన్నామని ఇష్టానుసారంగా ఏదో ఒకటి మాట్లాడడం సరైంది కాదన్నారు. మీడియాతో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రపంచ సుందరీ పోటీలను వాయిదా వేయడమో లేక రద్దు చేయడమే రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లో లేదని, ఇది కేవలం పోటీలు నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ సంస్థకు మాత్రమే అధికారం ఉందనే విషయాన్ని కవిత తెలుసుకోవాలని కిరణ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం వసతులను మాత్రమే కల్పిస్తుందని విషయం వారికి తెలియాదా అన్నారు. తెలంగాణ రాష్ట్రం భద్రత పరంగా సురక్షిత ప్రాంతం కావడంతో నిర్వాహకులు ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నారని, తద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు మరింత పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉందన్నారు. తెలంగాణ నాయకురాలు, ఉన్న కవిత అమెరికాలో కూడా చదువుకుని వచ్చిన ఆమెకు ప్రభుత్వం పరిధి ఏంటి అనేది తెలియాదా లేక రాజకీయం చేయాలన్న దురుద్దేశంతో మాట్లాడుతున్నారా అనేది ఆమె విజ్ఞతకే వదిలివేస్తున్నామన్నారు.

# మధ్యవర్తిత్వ రాజీమార్గంతో వివాదాల పరిష్కారం

తెలంగాణ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** మధ్యవర్తిత్వంతో రాజీమార్గం ద్వారా వివాదాలను పరిష్కరించేందుకు కమ్యూనిటి మెడిటేషన్ సెంటర్ల ద్వారా కృషి చేయడం జరుగుతుందని తెలంగాణ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిజ్ సుజోయ్ పాల్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.వి రమేష్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎస్‌పి డివి శ్రీనివాస రావు, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, జిల్లా న్యాయ మూర్తులు యువరాజు, అనంతలక్ష్మి, అజయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి వీందర్‌లతో కలిసి కమ్యూనిటి మీడియేషనల్ సెంటర్ నిర్వహణపై న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జడ్జ్ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా ఇరు వర్గాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో మధ్యవర్తిత్వ కేంద్ర కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. కేరళలో ప్రారంభమైన కమ్యూనిటి మీడియేషన్ సెంటర్లలో చిన్న చిన్న కుటుంబ, ఇతర తగాదాలను కమ్యూనిటి పెద్దల సమక్షంలో చర్చించుకుని రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడంతో ఇరు పార్టీల సమయం, డబ్బు ఆదా అవుతుందని, రాబోయేతరం ఎలాంటి తగాదా లేకుండా తయారు కావడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి మాట్లాడుతూ రాజీ చేసుకుని తగాదాలను పరిష్కరించుకోవడం వలన పెద్ద గొడవల నుంచి బయటపడవచ్చు అని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కొనసాగుతున్న కేంద్రాల ద్వారా అనేక సమస్యలు పరిష్కరించబడుతాయని తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ మధ్యవర్తిత్వ కేంద్రం కొరకు జిల్లాలోని 17 మండలాలలో 180 మందిని గుర్తించడం జరిగిందని తెలిపారు. కోర్టు ఖర్చుల గురించి కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారని, అటువంటివి లేకుండా ఉచిత న్యాయం అందే విధంగా 2023లో తీసుకువచ్చిన మీడియేషన్ చట్టం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గిరిజనుల కోసం జల్ జంగిల్ జమీన్ లక్ష్యంగా కొమురం భీం నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశాడని, భీమ్ స్ఫూర్తిగా జిల్లాలో మీడియేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మధ్యవర్తిత్వ కేంద్రం ప్రజా ప్రయోజకరంగా ఉంటుందని, ఇప్పటికే గిరిజనులలో రాయి సెంటర్లు అందుబాటులో ఉన్నాయని వాటిని కొనసాగింపుగా మధ్యవర్తిత్వ కేంద్రాలు పనిచేయడం మరింత ఉపయోగకరమన్నారు. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గిరిజన సంస్కృతిలో ఎన్నో సంవత్సరాల నుండి సర్ మేడిలు, మేడిలు, రాయి సెంటర్లు కొనసాగుతున్న అవసరాల దృష్ట్యా మధ్యవర్తిత్వ కేంద్రాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఎస్‌పి మాట్లాడుతూ మధ్యవర్తిత్వ కేంద్రాలకు సహాయ సహకాల కోసం తమ వంతు కృషి చేస్తామని అన్నారు. అంతకు ముందు జిల్లాకు చేరుకున్న తెలంగాణ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జడ్జ్‌కు జిల్లా కలెక్టర్, జిల్లా ప్రదాన న్యాయమూర్తి, జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికి వందేమాతర గీతాలాపన అనంతరం పహల్గాం బాధితులకు నివాళిగా 2 నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ యువరాజా, జూనియర్ సివిల్ జడ్జిలు అనంతలక్ష్మి, అజయ్, జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, ఎస్‌డిపిఒ చిత్తరంజన్, జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు, సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## కాల్పుల విరమణ ప్రకటనను స్వాగతిస్తున్నాం : జాన్ వెస్లీ


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత్, పాకిస్తాన్ మధ్య తక్షణమే అమల్లోకి వచ్చిన కాల్పుల విరమణ ప్రకటనను సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ స్వాగతిస్తోందని రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇరు దేశాల ప్రజలు శాంతి కోసం కృషి చేయడం అభినందనీమని పేర్కొన్నారు. ఇప్పటికైనా పాకిస్తాన్ తన సరిహద్దులలో ఉగ్రవాద కార్యకలాపాలను అంతం చేయడంతో పాటు ఇక నుంచైనా ఎలాంటి ఘర్షణలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జాన్ వెస్లీ విజ్ఞప్తి చేశారు.




## మహాసముద్రాలలో మైక్రోప్లాస్టిక్!



మైక్రోప్లాస్టిక్‌లు భూమి ఉపరితలంపైన మాత్రమేకాదు.. ఇప్పుడు సముద్రాల్లోనూ లోతుగా చొరబడుతున్నాయని తాజా అధ్యయనం స్పష్టం చేస్తున్నది. ఈ పరిణామం భూమి జీవభౌగోళిక రసాయన, కర్బన చక్రాలను ప్రభావితం చేస్తుంది. 'ది నేచర్‌'లో ప్రచురించిన అధ్యయనం నివేదికను అనుసరించి,



మైక్రోప్లాస్టిక్‌లు సముద్రాలు, మహాసముద్రాల్లోనూ వ్యాపించి, అక్కడి పర్యావరణ వ్యవస్థలను దెబ్బతీస్తున్నాయి. ఐదు మిల్లీమీటర్ల కంటే తక్కువ వ్యాసం కలిగిన ప్లాస్టిక్‌లను మైక్రో ప్లాస్టిక్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఇవి సముద్రాలలో 100 మీటర్ల లోతు వరకు చేరుతున్నాయి. పెద్ద ప్లాస్టిక్ శకలాలు (100 నుండి 5,000 మైక్రోమీటర్లు) సాధారణంగా సముద్ర ఉపరితలం దగ్గర కేంద్రీకృతమై ఉండగా, చిన్న కణాలు సముద్ర గర్భంలో 100 మీటర్ల లోతు వరకు నిక్షిప్తమై ఉన్నట్లు పరిశీలకులు గుర్తించారు. గైర్లు అనేవి నెమ్మదిగా కదిలే, వృత్తాకార సముద్ర ప్రవాహాలు. ఇవి ప్లాస్టిక్ ముక్కలను ఆకర్షిస్తాయి. 1950–2015 మధ్యకాలంలో మొత్తం ప్లాస్టిక్ ఇన్‌పుట్ 17–47 మిలియన్ మెట్రిక్ టన్నులుగా అంచనా వేశారు. నైలాన్, పాలిస్టర్‌తో తయారైన ఫిషింగ్ గేర్ సముద్రంలో పాలిథిలిన్ టెరెఫ్తాలేట్ వంటి దట్టమైన ప్లాస్టిక్‌లకు కేంద్రంగా మారింది. 56 కంటే ఎక్కువ పాలిమర్ రకాలను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. బయోజెకెమికల్ సైక్లింగ్‌కు కీలకమైన నీటి స్తంభం, మైక్రోప్లాస్టిక్ ద్వారా ఎక్కువగా ప్రభావితమవుతోంది. ఇది సముద్ర కార్బన్ చక్రానికి అంతరాయం కలిగించే అవకాశం ఉంది. ప్లాస్టిక్ కాలుష్యం సముద్ర పర్యావరణ వ్యవస్థలకు బాహ్య కార్బన్ (అల్లోక్టోనస్ కార్బన్ అని పిలుస్తారు)ను జోడిస్తుంది. మైక్రోప్లాస్టిక్ కార్బన్ ఉద్గారం గైర్‌లలో 30 మీటర్ల వద్ద మొత్తం పార్టిక్యులేట్ ఆర్గానిక్ కార్బన్ 0.1 శాతం నుండి 2,000 మీటర్ల వద్ద 5 శాతానికి పెరుగుతుంది. ఇది సముద్ర నమూనాలను 420 సంవత్సరాల పురాతనమైనవిగా కనిపించేలా చేస్తుంది. మైక్రోప్లాస్టిక్‌లు సూక్ష్మ జీవుల నైట్రిఫికేషన్, డీనైట్రిఫికేషన్‌ను మారుస్తాయి. పోషక చక్రాలకు అంతరాయం కలిగించే జీవక్రియలను విడుదల చేస్తాయి. మైక్రోప్లాస్టిక్‌లు మహాసముద్రాల సహజ వాతావరణానికి, జలచరాలకు హానికరం. సౌర అల్ట్రావయొలెట్ వికిరణం, గాలి, సముద్ర ప్రవాహాలు ప్లాస్టిక్‌లను (<5మిమీ), నానోప్లాస్టిక్‌లు (<100మిమీ)గా విచ్ఛిన్నం చేస్తాయి. అనంతరం ఇవి సముద్ర లోతుల్లోకి వ్యాపించి, అక్కడి వాతావరణంతో పాటు, జలచరాలకూ ముప్పు కలిగిస్తాయి. మైక్రోప్లాస్టిక్స్ తయారీ, వినియోగంపై అత్యంత కఠినమైన ఆంక్షలు విధించి, పకడ్బందీగా అమలు చేయడమే ఈ సమస్యకు పరిష్కారం.

## ప్రమాదంలో 'వెంబనాడ్'



భారతదేశంలోనే అత్యంత పొడవైన వెంబనాడ్ సరస్సు ప్రమాదంలో పడింది. ఆక్రమణలు, కాలుష్యం, దురాక్రమణ జాతుల కారణంగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. దీని ఫలితంగా చేపల పెంపకం 66 శాతం తగ్గింది. వరద నియంత్రణ సామర్థ్యం కూడా క్షీణించింది. వెంబనాడ్ సరస్సును కేరళలో వెంబనాడ్ కయల్ అని కూడా పిలుస్తారు. ఇది కొచ్చి సరస్సు (కొచ్చిలో), అలప్పుజా, కొట్టాయం, ఎర్నాకులం మీదుగా 96.5 కి.మీ విస్తరించి ఉంది. 2002 నుండి రామ్సర్ చిత్తడి నేల (సుందర్బన్స్ తర్వాత రెండవ అతిపెద్ద రామ్సర్ సైట్), జాతీయ తడి భూముల పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్నది. ఈ సరస్సుకు మీనాచిల్, అచంకోవిల్, పంపా, మణిమల నదుల ద్వారా నీరు అందుతుంది. అరేబియా సముద్రం నుండి ఇరుకైన అవరోధ ద్వీపం ద్వారా వేరుగా కనిపిస్తుంది. భారతదేశంలోని అతి పెద్ద మట్టి నియంత్రణ సంస్థ అయిన 1,252 మీటర్ల పొడవున్న తన్నీర్ముక్కోం సాల్ట్ వాటర్ బ్యారేజ్ 1976 నుండి పనిచేస్తోంది. ఇది వెంబనాడ్ సరస్సును మంచినీరు, ఉప్పునీటి విభాగాలుగా విభజిస్తుంది. దేశంలోని అత్యంత కీలకమైన, విస్తారమైన వెంబనాడ్ సరస్సు ఇప్పుడు చిక్కుల్లో ఉండడం పమాద ఘంటికలు మోగిస్తున్నది. ఎన్ని రకాలుగా రక్షణ చర్యలు అమలు చేస్తున్నప్పటికీ ఆక్రమణలు జరగడం అత్యంత దారుణం.

# కామ్రేడ్ ఓంకార్ శతజయంతి ఆరంభం



కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ స్వార్థం ఎరుగని నిస్వార్థ ప్రజా నాయకుడు. ఈ తరానికి తెలియవలసిన గొప్ప త్యాగధనుడు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి నిజమైన ప్రజల మన్ననలు పొందిన యోధుడు ఆయన. కామ్రేడ్ ఓంకార్ గారిని ఆ తరం బ్రహ్మన్న గా పిలుచుకుంటే అందరం ఓంకార్ సాబ్ గా పిలుచుకుంటాం. కులమత,ప్రాంతీయ అసమానతలు ఎరుగని ఆయన చట్టసభలలో అందరి సమస్యలపై గళం ఎత్తి ''అసెంబ్లీ టైగర్''గా ప్రజలచేత అభివర్ణించబడ్డారు. రాజకీయ విలువలకు విలువలు అద్దిన రాజకీయ దురంధరుడు కామ్రేడ్ ఓంకార్. అధికార పక్షాలు, ప్రతిపక్షాలు, సామాన్యులు, అసాధారణులు ఇలా ఎవరినైనా మనసునొప్పిచని సంస్కర్త కామ్రేడ్ ఓంకార్ గారు. నమ్మిన సిద్ధాంతపు గీతదాటని, రాజీపడని ఆయన తత్వానికి రాజకీయ, వర్గ శత్రువులు ఎందరో కూడా ఉండేవారు ఆయనను మాటు కాశీ, కాపు కాశీ హతమార్చే సందర్భాలు ఎన్నో. అనేక మార్లు దాడులలో బాంబులు, పొత్తి కడుపులో దిగిన కత్తి పోట్లు ఆయనకు వంగి సలాం చేశాయి తప్ప హతమార్చలేక పోయాయి. అందుకే ఆయన ''మృత్యుంజయుడు'' అయినాడు. తన సైద్ధాంతిక, రాజకీయ పాఠశాల ఎందరినో తీర్చిదిద్దింది. నేటి తరం ఆయన గురించి అన్వేషిస్తే నవసమాజ మార్పుకు మార్క్సిస్టు సూత్రాలతో పాటు భారతీయ తాత్వికం లాంటి సైద్ధాంతిక ఊటలు ఊరుతాయి. అంతటి ఓంకార్ ఈ పోరాటాల గడ్డపై పుట్టి వందేళ్ళు అయింది.

1926 మే 12న నేటి సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్) మండలం ఏపూరి గ్రామంలో మద్దికాయల రామయ్య, అనంతలక్ష్మి దంపతులకు జన్మించారు. కామ్రేడ్ ఓంకార్ గారికి తల్లిదండ్రులు పెట్టిన అసలు పేరు వెంకు రాములు. దిగువ మధ్యతరగతి కుటుంబం లో జన్మించిన ఆయన ఏపూరులో నాలుగవ తరగతి వరకు చదువుకున్నారు. ఆనాటి నిజాం నబాబు పాలనలో తెలంగాణ ప్రజలు దొరల, భూస్వాముల, దేశముఖ్‌ల ఆగడాల క్రింద అసమానతలకు గురవుతూ, వెట్టిచాకిరి చేస్తూ భానిసలుగా జీవించేవారు. వెట్టిచాకిరి నిర్మూలించాలి, దున్నేవానికే భూమి కావాలి అనే అనేక నినాదాలతో ప్రజల ముందుకు వచ్చిన ఆంధ్ర మహాసభలో 15 ఎండ్ల ఓంకార్ గారు వాలెంటీర్‌గా చేరి ఆ ఆతరువాతి పోరాటంలో తుపాకి చేతపట్టి నిజాం పాలనకు ఎదురొడ్డి పోరాడినారు. అందుకు నిజాం ప్రభుత్వం ఓంకార్ తలకు వెలకట్టింది. అయిన బెదరలేదు. 1946 నుండి 1951 వరకు జరిగిన మహత్తర వీరతెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిజాం సైనికులతో, అటు యూనియన్ సైన్యంతో తలపడి పోరాడినారు.

ఈ పోరాటాల ఫలితంగా 1972లో నర్సంపేట నియోజకవర్గ ప్రజలు నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు అఖండ విజయంతో గెలిపించి పంపించారు. 1972 నుంచి 83 వరకు మూడు సార్లు సిపిఎం నుంచి, 1985 నుంచి 1994 వరకు రెండుసార్లు ఎంసిపిఐ (యు) నుంచి మొత్తం ఐదు సార్లు 22 సంవత్సరాలు ఏకధాటిగా ఎమ్మెల్యేగా నర్సంపేట ప్రజలు గెలిపించారు. తాను శాసన సభ్యుడిగా ఉన్న కాలంలో తన నియోజకవర్గమైన నర్సంపేట ప్రజల సమస్యలే కాకుండా యావత్తు రాష్ట్ర ప్రజల సమస్యలను అసెంబ్లీలో ధారాళంగా వినిపించేవారు.

ఇలా ప్రజల కోసమే జీవితాన్ని అంకితం ఇచ్చిన కామ్రేడ్ ఓంకార్ గారిపై ఐదు సార్లు భూస్వామ్య, నరహంతక మూకలు, పీపుల్స్‌వార్ హత్యా ప్రయత్నాలు గావించారు.రేబల్లె గ్రామంలో ఏ.కె.47 గన్నుతో జరిపిన కాల్పుల ఘటనలో కామ్రేడ్ సిరిబొమ్మల లక్ష్మీనారాయణ,కత్తి సాంబయ్య గార్లు వీరమరణం పొందారు. మానుకోటలో భూస్వామ్య గూండాలచేత కత్తిపోట్లకు గురైనారు. అన్నారం షరీఫ్ గ్రామంలో జరిగిన స్టెన్ గన్ కాల్పుల్లో 12 బుల్లెట్లు కామ్రేడ్ ఓంకార్ గారి శరీరాన్ని రక్తపు మడుగుల్లో ముంచింది.2008 అక్టోబర్ 17వ తేదీన అమరత్వం పొందే వరకు కామ్రేడ్ ఓంకార్ గారి శరీరంలో ఒక బుల్లెట్ అలాగే ఉండి పోయింది.

కామ్రేడ్ ఓంకార్ గారితో పాటు ఉద్యమంలో మమేకమై పనిచేసిన 150 మందికి పైగా కామ్రేడ్స్ హత్య గావించబడ్డారు. మార్క్సిస్టు సైద్ధాంతిక రాజకీయ నిబద్ధతతో ఉన్న ఓంకార్ గారు ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ ఆ తరువాత సిపియం లో కీలక బాధ్యతలు నిర్వహించారు. సిపియం పార్టీలో వచ్చిన సిద్ధాంత విధానాలను ఎత్తిచూపిన ఓంకార్ గారిని పార్టీ బహిష్కరించింది.4వేల మంది కార్యకర్తలతో 1984 ఫిబ్రవరి 18న యంసిపి ని స్థాపించారు. ఆరు నెలలో దేశవ్యాప్తంగా వచ్చిన సంబంధాలతో యంసిపిఐ గా ఏర్పాటు చేశారు.1964 పార్టీ కార్యక్రమాన్ని అంగీకరించే పార్టీలను ఏకం చేసి 2006లో యంసిపిఐ(యు) గా ఏర్పరిచారు.

కామ్రేడ్ ఓంకార్ గారి జన్మస్థానం అయిన సూర్యాపేట జల్లా ఏపూరులో 2025 మే12న ఉదయం 10 గం॥లకు కాగడను ప్రారంభించుకొని, అదే రోజు 2025 మే 12న వరంగల్ జిల్లా మచ్చాపూర్‌లోని కామ్రేడ్ ఓంకార్ గారి 125 అడుగుల భారీ స్మారక స్థూపం పున:ప్రారంభిస్తూ కామ్రేడ్ ఓంకార్ శతజయంతి వార్షికోత్సవ ప్రారంభ సభ నిర్వహించడం జరుగుతుంది.

వనం సుధాకర్
ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు
99892 00533

# అగ్నివీరులను అక్కున చేర్చుకోవాలి

పహల్గామ్ ఉగ్రదాడి కవ్వింపు చర్యలకు ప్రతిగా భారతదేశం చేపట్టిన 'ఆపరేషన్ సింధు' దేశ ప్రజలను ఉత్తేజితం చేస్తున్నది. పాకిస్థాన్ భూభాగం లోని ఉగ్రతండాల స్థావరాలపై గురి పెట్టి మట్టు పెట్టిన తీరు భారతీయులను ఆనందడోలికల్లో ముంచెత్తింది. దీనికి ప్రతీకారంగా పాకిస్థాన్ జమ్మూ, కశ్మీర్‌తో పాటు సరిహద్దు రాష్ట్రాలపై జరిపిన డ్రోన్ దాడులను తిప్పి కొట్టడమే కాకుండా, లాహోర్‌లోని వాయు రక్షక వ్యవస్థను ధ్వంసం చేసిన భారత సైనిక అద్భుత ఆధునిక ప్రతిభా పాటవ ప్రదర్శనను చూసి దేశవాసులు అచ్చెరువొందారు. అయితే, వెలుగు కింద నీడలా సరిహద్దు రేఖ వెంబడి గ్రామాలపై పాకిస్థాన్ మోర్టార్లు, శతఘ్నులు, పేలు పదార్ధాలతో విచక్షణా రహిత దాడులకు పాల్పడుతోంది. నిరంతర కాల్పులను జరుపుతూ కాళరాత్రులను సృష్టిస్తున్నది. దీనిని భారతసైనికులు తిప్పికొడుతూనే ఉన్నారు. పాక్ దాడులలో ఇప్పటికే 19 మంది స్వదేశీయులు బలవడమే కాకుండా, అనేక మంది క్షతగాత్రులవడం బాధకలిగిస్తున్నది.

పాకిస్థాన్ కాల్పులలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలోని కళ్ళి తండాకు చెందిన యువ జవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందడం తెలుగువారిని విషాదంలో ముంచెత్తింది. గిరిజన పుత్రుడైన ఆయనకు చిన్నతనం నుంచే దేశభక్తి మెండు. తల్లిదండ్రులకు ఒక్కడే కుమారుడైనప్పటికీ రైల్వేలో సౌఖ్యవంతమైన ఉద్యోగాన్ని వదులుకొని, 2022 డిసెంబర్‌లో అగ్నివీరుడిగా సైన్యంలో చేరాడు. ఆయన ప్రాణార్పణంతో సైన్యంలో అగ్నివీరుల విధానంపై మరొక్కసారి చర్చించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

కమిషన్డ్ ఆఫీసర్‌ల దిగువ స్థాయి సైనికుల నియామకం కోసం భారత ప్రభుత్వం 2022లో అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. త్రివిధ దళాలలో రెగ్యులర్ ప్రాతిపదికన కాకుండా నాలుగేళ్ళ తాత్కాలిక ప్రాతిపదికన సైనికులను తీసుకోవడం ఈ పథకం ఉద్దేశ్యం. అగ్నివీర్ పథకంలో ఎంపికైన వారికి సాధారణ సైనికులకు వర్తించే వేతనాలు, పెన్షన్ పథకాలు, ఇతర ప్రయోజనాలు వర్తించబోవు. రిటైర్‌మెంట్ తరువాత చేతికి రూ.11.71 లక్షలు అందజేసి పంపిస్తారు. ఏటా 45వేల నుంచి 50వేల మంది అగ్నివీరులను నియమించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం లక్ష్యం గా పెట్టుకుంది. అందులో 25 శాతం మంది దరఖాస్తు చేసుకుంటే శాశ్వత ప్రాతిపదికన తీసుకునేందుకు పరిగణిస్తారు. ఇది సైన్యంలోకాంట్రాక్టు విధానాన్ని ప్రవేశపెట్టడమే. అగ్నివీర్ పథకంపై దేశవ్యాప్తం గా యువకులు భగ్గుమన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బిహార్, హర్యానా తదితర రాష్ట్రాలలో రోడ్డెక్కి తీవ్ర నిరసనకు పాల్పడ్డారు. కొన్ని చోట్ల రైళ్ళు తగులబడ్డాయి. అయినా కేంద్ర ప్రభుత్వం వెనక్కితగ్గకుండా ఈ పథకాన్ని అమలు చేసింది. తొలినాళ్ళలో ఎంపికైన అగ్నివీరుడే రెండు రోజు ల క్రితం వీరమరణం పొందిన మురళీ నాయక్.

ప్రజాపక్షం
11-05-2025, ఆదివారం

అగ్నివీరులు మరణాన్ని బట్టి మూడు కేటగిరీలలో పరిహారం లభిస్తుంది. విధి నిర్వహణలో సహజ మరణం పొందితే 'ఎక్స్' కేటగిరి, ఉద్రిక్తల మధ్య సైనిక సేవలు అందిస్తున్న లేదా ప్రమాదాలలో మరణిస్తే 'వై' కేటగిరి, ఉగ్రవాదుల దాడుల్లో, హింస, సంఘ వ్యతిరేక శక్తులు, శతృవులు చేతిలో మరణిస్తే, శాంతి పరిరక్షణ, యుద్ధం తదితర కారణాలతో మరణిస్తే ''జెడ్'' కేటగిరి కిందకు వస్తాయి. ''ఎక్స్'' కేటగిరికి రూ.48 లక్షల బీమాతో పాటు సేవానిధిలో అగ్నివీరుల జమ చేసిన మొత్తం అందజేస్తారు. ''వై'', ''జెడ్'' కేటగిరిలో మరణించే అగ్నివీరులకు రూ.కోటి వరకు పరిహారంగా లభిస్తుంది. అందులో బీమా నుంచి రూ.48 లక్షలు, ఏక కాల పరిహారం కింద రూ.44 లక్షలు, నాలుగేళ్ళలో మిగిలిన సర్వీసు కాలానికి మరణించిన తేదీ నుంచి సేవానిధి నుంచి పూర్తిస్థాయి జీతం, సేవానిధిలో అప్పటి వరకు అగ్నివీరుడు జమ చేసుకున్న మొత్తానికి ప్రభుత్వ వంతుతో పాటు వడ్డీ సహా కుటుంబ సభ్యులకు చెల్లిస్తారు.

అమరజవాన్ మురళీ నాయక్‌కు ''జెడ్'' కేటగిరి వస్తుంది. రెగ్యులర్ సైనికుడు ఇదే పరిస్థితుల్లో అమరుడైతే రూ.40 లక్షల వరకు కేంద్రప్రభుత్వ పరిహారంతో పాటు, ఆర్మీఫండ్ నుంచి రూ.8లక్షలు, ఆర్మీ ఉద్యోగుల సతీమణుల సంక్షేమ సంఘం నుంచి అదనపు సాయం, సర్వీసును బట్టి డిసిఆర్‌డి నుంచి రూ.20 లక్షల వరకు ఆర్థిక సహాయం, చివరి వేతనంతో సమానమైన జీవిత కాల కుటుంబ పెన్షన్, గ్రాట్యూటీ, చదువుకునే పిల్లలకు స్కాలర్‌షిప్పులు, వివాహ సహాయం, వైద్య సదుపాయాలు, విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ తదితర అనేక సౌకర్యాలు లభిస్తాయని స్వయంగా రక్షణ శాఖ సహాయ మంత్రి లోక్‌సభలో 2022 డిసెంబర్‌లో వచ్చిన ప్రశ్నకు సమాధానంగా వివరించారు.

దేశం ప్రాణత్యాగాలు చేసిన సైనిక కుటుంబ సభ్యులకు ఎంత చేసినా తక్కువే. వారికి కచ్చితంగా ప్రభుత్వాలు అండగా నిలబడాల్సిందే. అయితే, అగ్నివీరుల పట్ల వివక్ష ఏ మాత్రం సమర్థనీయం కాదు. వారికి కూడా రెగ్యులర్ సైనికుల కుటుంబాలకు వర్తించే ప్రయోజనాలను అమలు చేయాలని రక్షణ శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం గత ఏడాది ఫిబ్రవరి మాసంలో కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. అగ్నివీరు లు నాలుగేళ్ళ తాత్కాలిక సర్వీసుపై ఎంపికైనప్పటికీ, వారి త్యాగాలు రెగ్యులర్ సైనికులకు ఏ మాత్రం తీసిపోనివని మురళీనాయక్ అమరత్వం నిరూపించింది.

వర్తమాన పోటీ ప్రపంచంలో డబ్బుల సంపాదనకు అనేక మార్గాలు ఉన్నాయి. వాటన్నిటినీ కాదనుకొని దేశంపై మక్కువతో సైన్యంలో చేరుతున్నారు అగ్నివీరులు. కదనరంగంలో రెగ్యులర్ సైనికులతో పాటు వారు సమస్కంధులుగా భారతావని కోసం పోరాడుతున్న విషయాన్ని పాలకులు గుర్తెరగాలి. అందుకే అగ్నివీరులు సేవలను క్రమబద్ధీకరించి, రెగ్యులర్ సైనికులకు అమలయ్యే సర్వీసు, వేతనాలు, సౌకర్యాలు, పెన్షన్‌లను అమలు చేసే సమయం ఆసన్నమైంది. తదుపరి నియామకాల్లో అగ్నివీర్ విధానాన్ని రద్దు చేసి, గత పద్ధతిలో శాశ్వత ప్రాతిపదికన సైనిక నియామకాలు చేపట్టడమే మాతృభూమి రక్షణ పట్ల మనం ప్రదర్శించే అసలైన దేశభక్తి.

# బానిస సంకెళ్లపై విప్లవ సింహాల గర్జన

## భారతీయుల తొలి స్వాతంత్ర్య సమర శంఖారావం



కింజరాపు అమరావతి
82472 86357

మొబైల్ ఫోన్లు లేని, వాట్సప్ జాడ లేని, ఇంటర్నెట్ ఊహకు కూడా అందని రోజుల్లో మీరట్ నుండి ఢిల్లీ వరకు ఒక మహా విప్లవం ఉప్పెనలా ఎగసింది! దుర్మార్గపు పాలకుల మోసాలు, నిరంకుశ దౌర్జన్యాలు, కుట్రపూరిత పన్నాగాలపై విసిగి వేసారిపోయిన ప్రజల గుండెల్లో విప్లవ జ్వాల రగిలింది! నరాలలో ప్రళయ రుధిరం ఉప్పొంగింది! బానిస సంకెళ్లను తెంచివేయడానికి, స్వేచ్ఛా భారతావనిని ఆవిష్కరించడానికి సింహాల్లా గర్జించడానికి ఎదురు చూస్తున్న ప్రజల ఆరాటమే ఈ పోరాటానికి పిలుపునిచ్చింది. ఆ పిలుపే 1857 మే 10న భగ్గుమన్న సిపాయుల తిరుగుబాటు ! ఇది కేవలం తిరుగుబాటు కాదు ! భారతదేశ ప్రథమ స్వాతంత్ర్య సమర శంఖారావం !

1857 రాకమునుపే దుష్ట వలస పాలకులు ప్రజల ఆర్తనాదాలు, సమస్యలు పట్టించుకోకుండా కేవలం భారత సంపదను దోచుకోవడానికి కంకణం కట్టుకున్నారు. ఈస్ట్ ఇండియా కంపెనీ వారు స్థానిక ప్రజల జీవనాధారమైన కుల వృత్తులను తుంగలో తొక్కారు. మన ఎగుమతులపై పిడుగులాంటి పన్నులు, వారి దిగుమతులపై నామమాత్రపు పన్నులు విధించి దేశ ఆర్థిక వ్యవస్థను ఛిద్రం చేశారు. వారి దుర్మార్గపు ఆర్థిక దోపిడీ, వివక్షాపూరిత పాలన, నూతన భూస్వామ్య విధానాలు ప్రజలకు నరకం చూపించాయి. వారి దుర్నీతి సామాజిక విధానాలు కూడా విప్లవానికి ఊపిరి పోశాయి. పాశ్చాత్య విద్య, సంస్కృతిని బలవంతంగా రుద్దే ప్రయత్నం ప్రజలలో తీవ్రమైన పరాయీకరణ భావనను కలిగించింది. సాంస్కృతిక విధ్వంసం సృష్టించారు. మత మార్పిడులను ప్రోత్సహించారు. విదేశీ యుద్ధాల్లో భారతీయ సైనికులను బలిపశువులుగా వాడుకున్నారు. వేతనాలలో అమానవీయమైన తారతమ్యం చూపారు. భారతీయ సైనికులకు కనీసం పెన్షన్ కూడా లేదు. తమ హక్కులన్నీ కాలరాస్తున్నారన్న భావన పెరిగి ప్రజలు తీవ్రమైన ఆగ్రహంతో ఊగిపోయారు. అన్నింటా భారతీయుల కంటే యూరోపియన్లకే పట్టం కట్టారు. భూస్వామ్య దళారీలకు ఊడిగం చేస్తూ సామాన్య రైతుల ప్రయోజనాలను, హక్కులను కాలితో తన్నారు. రైతులను వారి భూముల నుండి తరిమికొట్టారు. దీంతో ప్రజలు తమ భూమిని, వనరులపై తిరుగులేని ఆధిపత్యాన్ని సాధించాలని ఉగ్రంగా పోరాడటానికి సిద్ధమయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూ రాబందులను నియమించి, దళారులు, వడ్డీ వ్యాపారులను పెంచి పోషించి, గిరిజన భూములను ఆక్రమించి, స్వదేశీ పరిశ్రమలను నేలమట్టం చేసి, పన్నుల భారం మోపి భూస్వాములకు, దళారులకే లాభం చేకూర్చే ఈస్టిండియా కంపెనీ దుర్మార్గపు పాలనను సహించలేక పాలనకు వ్యతిరేకంగా రైతులు, శ్రామికులు, గిరిజనులు, అన్ని మతాల ప్రజలు ఐక్యంగా తమను తాము కాపాడుకోవడానికి సాయుధ తిరుగుబాటుకు దిగారు. సన్యాసి తిరుగుబాటు, వెల్లూరు తిరుగుబాటు, పైకా తిరుగుబాటు వంటివి ఆ పోరాట స్ఫూర్తికి ప్రతీకలు. ఈ ప్రతిఘటన ఉద్యమాలలో వేర్వేరు ఆవేదనలు ఉన్నప్పటికీ వారందరిదీ ఒకే లక్ష్యం బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి సమాధి కట్టడం! కంపెనీ దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడానికి వారిని మరింతగా ప్రేరేపించాయి. కానీ 1857లో జరిగిన తిరుగుబాటు భారతదేశంలో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో ఒక ప్రత్యేక అధ్యాయం. అది తాత్కాలికంగా విఫలమైనా స్వాతంత్ర్య పోరాటానికి తిరుగులేని పునాదులు వేసి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. దీన్ని భారత ప్రజల మొదటి స్వాతంత్ర్య సంగ్రామంగా విశ్లేషించిన మేధావి కారల్ మార్క్స్.

**విప్లవానికి తక్షణ కారణం:**

వారి దుర్మార్గపు రాజ్య సంక్రమణ విధానం ఎన్నో స్వతంత్ర


మంగళ్ పాండే


బేగం హజ్రత్ మహల్


నానా సాహెబ్


ఝాన్సీలక్ష్మీ బాయి


తాంతియా తోపే

రాజ్యాలను కంపెనీ కబంధ హస్తాల్లోకి నెట్టింది. సతారా, నాగ్‌పూర్, ఝాన్సీ వంటి బలమైన రాజ్యాలు కూడా వారి దురాక్రమణకు గురయ్యాయి. అంతేకాదు, జైత్‌పూర్, సంబల్‌పూర్, ఉదయపూర్ రాజ్యాలను కూడా నిర్దాక్షిణ్యంగా విలీనం చేశారు. 1850లో హిందూ వారసత్వ చట్టాన్ని మార్చి, మతం మారిన వారికి కూడా ఆస్తులపై హక్కు కల్పించడం ప్రజల ఆగ్రహానికి హద్దులు లేకుండా చేసింది. భారతీయులందరినీ క్రైస్తవ మతంలోకి మార్చాలని దుష్ట ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ప్రజలు విశ్వసించారు. పాశ్చాత్య విద్యా విధానాన్ని బలవంతంగా రుద్దడం హిందువులతో పాటు ముస్లింల పవిత్ర ధర్మాన్ని అవమానించారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, జమీందార్లు భూమిపై విధించిన భరించలేని పన్నులతో, కంపెనీ అనుసరించిన రక్తపిపాసి ఆదాయ సేకరణ పద్ధతులతో కుమిలిపోయారు. రుణదాతల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను కోల్పోయారు. పారిశ్రామిక విప్లవం పేరిట బ్రిటీష్ తయారీ వస్తువులు మన దేశాన్ని ముంచెత్తాయి. ఇది మన స్వదేశీ పరిశ్రమలను, ముఖ్యంగా వస్త్ర పరిశ్రమను పూర్తిగా నాశనం చేసింది. మన కళాకారులు బ్రిటన్‌లో యంత్రాలతో తయారైన చౌకబారు వస్తువులతో పోటీ పడలేక వీధిన పడ్డారు. బ్రిటీష్ దళాలలో 87% మంది భారతీయ సిపాయిలు ఉన్నప్పటికీ వారిని బ్రిటిష్ సైనికుల కంటే హీనంగా చూశారు. సిపాయిల వేతనాలలో అన్యాయమైన వ్యత్యాసం చూపారు. ఈ తిరుగుబాటుకు రాజకీయ, ఆర్థిక, సామాజిక, మతపరమైన కారణాలెన్నో ఉన్నప్పటికీ తక్షణ కారణం మాత్రం బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ 'ఎన్ఫీల్డ్ రైఫిల్స్' అనే మారణాయుధంలో ఆవు, పంది కొవ్వు పూసిన తూటాలను వాడటం. ఆ తూటాలను నోటితో కొరికి రైఫిళ్లలో నింపాల్సి రావడంతో హిందూ, ముస్లిం సిపాయిలు వాటిని వాడటానికి నిప్పులు చెరిగేలా నిరాకరించారు.

**మీరట్ నుండి ఢిల్లీకి – విప్లవ యాత్ర:**

1857 మార్చి 29న బారక్‌పూర్‌లోని సైనిక స్థావరంలో మంగళ్ పాండే అనే ధీరుడు ఎన్ఫీల్డ్ రైఫిల్‌ను ఉపయోగించడానికి నిరాకరించి తనపై అధికారిపై తిరుగుబాటు బావుటా ఎగరవేశాడు. మిగిలిన సిపాయిలు అతని ధైర్యానికి స్ఫూర్తి పొంది అతనికి అండగా నిలిచారు. కానీ, దుర్మార్గులైన బ్రిటిష్ పాలకులు అతనిని ఏప్రిల్ 8, 1857న ఉరితీశారు. 1857 మే 9న మీరట్‌లో ఎన్ఫీల్డ్ రైఫిల్‌ను ఉపయోగించేందుకు నిరాకరించిన 85 మంది సిపాయిల యూనిఫాంను తీసివేసి వారికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు. ఈ అన్యాయానికి ఆగ్రహించిన సిపాయిలు 1857 మే 10న బ్రిటిష్ దుర్మార్గులకు వ్యతిరేకంగా మీరట్‌లో విప్లవం ప్రారంభించి ఢిల్లీ వైపు కదం తొక్కారు. 1857 మే 11న ఢిల్లీ ఎర్రకోటకు చేరుకొని బహదూర్ షాను చక్రవర్తిగా ప్రకటించారు.

**వీరనారుల పోరాటం – ధీరుల త్యాగం:**

లక్నోలో 1857 జూన్ 4న బేగం హజ్రత్ మహల్, 1857 జూన్ 5న కాన్పూర్‌లో నానా సాహెబ్, ఝాన్సీ, గ్వాలియర్లలో లక్ష్మీ బాయి మరియు తాంతియాతోపే, బరేలీలో ఖాన్ బహదూర్ ఖాన్, అలహాబాద్ , బనారస్‌లలో మౌల్వీ లియాకత్ అలీ, బీహార్‌లో కున్వర్ సింగ్ నాయకత్వాలలో స్వాతంత్ర్య పోరాటం ఉవ్వెత్తున సాగింది. ఎందరో వీరులు ప్రాణాలర్పించారు. మరెందరో జైళ్ల పాలయ్యారు. ఈ విప్లవం సుమారు సంవత్సరానికి పైగా కొనసాగింది. ఈ పోరాటంలో ముఖ్యంగా పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో రైతులు కంపెనీ దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటులో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పాల్గొన్నారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తొలి ప్రతిఘటనలో దేవీ చౌధురాణి పాల్గొనడం మహిళా శక్తిని చాటిచెబుతుంది.

**స్వాతంత్ర్యానికి తొలి అడుగు**


పై తరగతి, మధ్యతరగతి పిరికి మేధావులు ఈ విప్లవానికి వెన్నుదన్నుగా నిలబడలేదు. హైదరాబాద్, మైసూర్, ట్రావెన్‌కోర్, కాశ్మీర్ వంటి పెద్ద రాచరిక రాష్ట్రాలు, చిన్న రాజపుతానా రాజ్యాలు ఈ పోరాటంలో భాగం పంచుకోలేదు. దక్షిణ ప్రాంతాలు దీనికి దూరంగా ఉండిపోయాయి. సమర్థవంతమైన నాయకత్వం కొరవడింది. తగినన్ని ఆర్థిక వనరులు లేకపోయాయి. చదువుకున్న బానిస మనస్తత్వం గల భారతీయులు ఈ విప్లవం భూస్వామ్య స్వభావానికి భయపడి ప్రేక్షక పాత్ర పోషించారు. బ్రిటిష్ కంపెనీ సైన్యం ఉపయోగించిన ఆధునిక మారణాయుధాల ముందు మన సిపాయిల సంప్రదాయ ఆయుధాలు ఏ మాత్రం నిలువలేకపోయాయి. చక్రవర్తిగా ప్రకటించిన బహదూర్ షా పోరాడే శక్తి లేని వృద్ధుడు కావడం కూడా ఒక కారణం. అనేక కారణాల వల్ల ఈ విప్లవం 1858 మధ్యలో దారుణంగా అణచివేయబడింది.

**అనంతర పరిణామాలు**

ఈ విప్లవం భారత చరిత్రలో ఒక పెను తుఫానును సృష్టించింది. బ్రిటిషు దుర్మార్గులు ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనను రద్దు చేసి విక్టోరియా రాణి పాలనను ప్రవేశపెట్టారు. భారత పాలనా వ్యవహారాలను పర్యవేక్షించడానికి వైస్రాయిని నియమించారు. ఈ విధంగా భారతదేశం బ్రిటిషు సామ్రాజ్యవాదంలోకి కూరుకుపోయింది. కానీ, ఈ విప్లవం రగిలించిన స్వాతంత్ర్య కాంక్ష ఎందరో యోధులకు స్ఫూర్తినిచ్చింది. వారి పోరాట ఫలితంగానే 1947 ఆగస్ట్ 15న మనకు స్వేచ్ఛ లభించింది. ఆనాటి విప్లవకారుల త్యాగం ఎప్పటికీ మరువలేనిది!

*జై హింద్!*


# పరిపక్వత చాటిన హిమాన్షీ నర్వాల్



డాక్టర్ అరుణ్ మిత్రా

పహల్గాం అమాయక పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడితో తీవ్ర దుఃఖంలో మునిగిపోయిన సమయంలో, మరణించిన వారి కుటుంబాలకు, ముఖ్యం గా వితంతువులైన యువతుల కు యావత్ భారతదేశం అండ గా నిలుస్తుందని భావించారు. కానీ, ఉగ్రవాదుల దాడిలో ఎంతో భవిష్యత్తు కలిగి అమరుడైన భారత నౌకాదళానికి చెందిన లెఫ్టినెంట్‌ను వివాహం చేసుకున్న హిమాన్షీ నర్వాల్ అనే యువతిని ట్రోల్ చేస్తున్న తీరు ఈ ఆశను వమ్ము చేసింది. మత సామరస్యం కోసం విజ్ఞప్తి చేసినందుకు, పహల్గామ్ సంఘటనను ముస్లిం వ్యతిరేక లేదా కశ్మీర్ వ్యతిరేక సమస్యగా మార్చవద్దని కోరినందుకు ఆమెను పరిహసిస్తున్నారు. దేశంలోని ఇతర ప్రాంతాల్లో చదువుతున్న కశ్మీరీ విద్యార్థులపై హింసకు పాల్పడవద్దని కూడా ఆమె ప్రజలను కోరింది. మన సంస్కృతిలో, మనం ఎల్లవేళలా మన మహిళలను గౌరవంగా చూస్తాము. వారిని రక్షించడానికి ప్రతిజ్ఞ చేస్తాము. హిమాన్షీ నర్వాల్‌ను ట్రోల్ చేయడంపై పెద్దగా ప్రజా ఆగ్ర హం వ్యక్తం కాకపోవడం విచారకరం. ఊహించినట్లుగానే, కేంద్ర ప్రభుత్వం ఈ ట్రోలింగ్‌ను ఖండిస్తూ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ప్రేరేపిత దుండగులు పాల్పడుతున్న ఇలాంటి హేయమైన చర్యకు ఇది నిశ్శబ్ద మద్దతు కాదా?

హిమాన్షీ నర్వాల్‌ను ఇలా ట్రోల్ చేయడం గత 11 సంవత్సరాలుగా కొనసాగుతున్న నిరంతర విద్వేష ప్రచారం ఫలితం. మన రాజ్యాంగంలో పొందుపరచబడిన విలువలను తిరస్కరించే నిరంతర ప్రయత్నం జరుగుతోంది. మన పూర్వీకులు చేసిన కఠిన పోరాటం, త్యాగాల ప్రాతిపదికన ఈ రాజ్యాంగం రూపొందించబడింది. మహాత్మా గాంధీ ప్రచారం చేసిన అహిం స, జవహర్‌లాల్ నెహ్రూ నొక్కి చెప్పిన శాస్త్రీయ దృక్పథం, భగత్ సింగ్ అందించిన న్యా యం, సమానత్వం అనే వారసత్వం మనకు ఉంది.



స్వయం ప్రకటిత నైతిక విలువలను బోధించే స్వయం ప్రకటిత నిఘా గ్రూపులు యువకులు, బాలికలను ట్రోల్ చేయడం కొన్నిచోట్ల సాధారణమైపోయింది. మతపరమైన భేదాల ఆధారంగా గుంపు దాడులు ఈ గ్రూపుల యొక్క దుర్మార్గపు కార్యకలాపాలలో భాగమయ్యాయి. అనేక కేసుల్లో వారిపై ఎటువంటి శిక్షా చర్యలు తీసుకోనందున వారిని ప్రోత్సహించారు. ఈ సమూహాలు లేదా ఉగ్రవాదులు ఊహించిన దానికి విరుద్ధంగా, కాశ్మీర్ ప్రజలు పహల్గాంలో జరిగిన ఉగ్రవాద హింసను ఖండిస్తూ వీధుల్లోకి వచ్చారు, మత గుర్తింపుతో సంబంధం లేకుండా భారతదేశ ప్రజలు ఉగ్రవాద హింసను వ్యతిరేకించారు. స్థానికులు గాయపడిన వారికి ప్రాణాలతో బయటపడిన వారికి సహాయం చేశారు.

మతపరమైన విభజనపై ఆధారపడి జీవించే వారిని ఇది కలవరపరిచింది. సామాజిక సామరస్యం కోసం మాట్లాడే ఎవరినీ విడిచిపెట్టరు అనేది వారి విధానం. ఉన్నతాధికారు ల నిశ్శబ్ద మద్దతుతో హిమాన్షీ నర్వాల్‌ను ట్రోల్ చేయడం దీనికి కారణం. లౌకిక, ప్రజాస్వామ్య దేశంగా, శాస్త్రీయ దృక్పథంతో, న్యా యం, సమానత్వం, లింగ సున్నితత్వం, వర్గాల మధ్య సామరస్యంతో కూడిన భారతదేశ భావనను కాపాడటానికి ఈ సంఘటన మన ముందు ఒక సవాలును విసిరింది. ఈ శక్తులను కఠోర పోరాటం ద్వారా ఓడించి, మన సమాజపు విలువలకు గర్వాన్ని పునరుద్ధరించి, దిశను మళ్లీ మార్చే అనేకమంది వివేకవంతులైన వ్యక్తులు ఇంకా ఉన్నారు. ఇదే హిమాన్షీ నర్వాల్ భారత ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'ను స్వాగతించారు. ''ఉగ్రవాదానికి ముగింపునకు ప్రారంభం'' అని కచ్చితంగా భావించాలని కేంద్రాన్ని అభ్యర్థించారు. 'నా భర్త రక్షణ దళాలలో ఉన్నారు. ఆయన శాంతిని కాపాడాలని, అమాయక ప్రజల ప్రాణాలను రక్షించాలని కోరుకున్నారు. ఈ దేశంలో ద్వేషం, ఉగ్రవాదం ఉండకూడదని ఆయన కోరుకున్నారు. నేను ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను, కానీ వారు ఇక్కడితో ఆపవద్దని నేను అభ్యర్థిస్తున్నాను. ఇది మన దేశంలో ఉగ్రవాదానికి ముగింపునకుప్రారంభం మాత్రమే అని నేను కోరుకుంటున్నాను,'' అని ఆమె అన్నారు. ఇది ఆమె పరిపక్వతకు నిదర్శనం.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## టివి ప్రసారాల్లో సైరన్లు వాడొద్దు..



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ – పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగిన క్రమంలో సరిహద్దు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసేందుకు భారత సైన్యం సైరన్లు మోగిస్తున్న సంగతి తెలిసిందే. అయితే పౌరులను అప్రమత్తం చేసేందుకు వినియోగించే సైరన్‌లను వార్తా ప్రసారాల్లో ఉపయోగించొద్దని మీడియా చానెల్స్‌కు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కేవలం మాక్ డ్రిల్‌ల సమయంలో మాత్రమే ప్రజలకు అవగాహన కల్పించడం కోసం సైరన్లు మోగించాలని ఆదేశించింది. టీవీ ప్రసారాల్లో తరచుగా సైరన్లు మోగించడం వల్ల ప్రజల్లో గందరగోళం నెలకొంటుందని కేంద్రం పేర్కొంది. దీంతో వాస్తవంగా అత్యవసర సమయాల్లో సైరన్లు మోగించినప్పుడు ప్రజలు వీటిని తేలికగా తీసుకునే ప్రమాదం ఉందని తెలిపింది. ఇందుకు సంబంధించిన ఆదేశాలను కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీస్, సివిల్ డిఫెన్స్ అండ హోమ్ గార్డ్స్ విభాగాలు ఆదేశాలు జారీ చేశాయి.

## నివాసాలపై పాక్ షెల్స్ దాడి





**న్యూఢిల్లీ :** శనివారం తెల్లవారుజామున జమ్ముకశ్మీర్ వేసవి రాజధానిలో పాక్ దాడులుక పాల్పడిన కొన్ని గంటల తర్వాత మరోసారి కూడా శ్రీనగర్‌లో భారీ పేలుళ్ల జరిపిందని అధికారులు తెలిపారు. ఉదయం 11.45 గంటల ప్రాంతంలో శ్రీనగర్ విమానాశ్రయం సమీపంలో రెండు భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయని వారు తెలిపారు. పేలుళ్ల కారణంగా నగరం, లోయలోని ఇతర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారని, కొన్ని ప్రాంతాల్లో సైరన్లు కూడా వినిపించాయని వారు తెలిపారు. శుక్రవారం రాత్రి పాకిస్థాన్ అనేక చోట్ల డ్రోన్ దాడులను భారత సైన్యం తిప్పికొట్టిన కొన్ని గంటల తర్వాత, ఉదయం వేళ, నగరంలో బహుళ పేలుళ్ల సంభవించాయి. విమానాశ్రయం సహా కీలకమైన సంస్థాపనల సమీపంలో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. శనివారం జమ్ములోని అంతర్జాతీయ సరిహద్దు (ఐబి) వెంబడి పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో ఎనిమిది మంది సరిహద్దు భద్రతా దళం (బిఎస్‌ఎఫ్) సిబ్బంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఈ ఘటన ఆర్‌ఎస్ పురా సెక్టార్‌లో జరిగిందని వారు తెలిపారు. సైనికులను సమీపంలోని సైనిక వైద్య కేంద్రానికి తరలించారన్నారు.

### 60 దేశీయ విమానాలు రద్దు

శనివారం ఢిల్లీ విమానాశ్రయానికివచ్చే, ఇక్కడి నుంచి బయలుదేరే 60 దేశీయ విమానాలు రద్దు చేయబడినట్లు ఒక అధికారి తెలిపారు. భారత్–పాకిస్తాన్ మధ్య సైనిక వివాదం తీవ్రమవుతున్నందున భద్రతా చర్యలు పటిష్టం చేశారు. దేశంలోని ఉత్తర, పశ్చిమ ప్రాంతాలలో కనీసం 32 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. ఢిల్లీ విమానాశ్రయంలో ఉదయం 5.00 గంటల నుండి మధ్యాహ్నం 2.30 గంటల వరకు బయలుదేరివి 30, వచ్చే 30 విమానాలను రద్దు చేస్నిట్లు అధికారి తెలిపారు. శుక్రవారం, ఢిల్లీ విమానాశ్రయానికి వచ్చి, వెళ్లే 138 విమానాలను వివిధ విమానయాన సంస్థలు రద్దు చేశాయి.

### హర్యానా ఉనా జిల్లాలో లోహ వస్తువు గుర్తింపు

భారత్–పాకిస్తాన్ మధ్య సైనిక ఘర్షణల నేపథ్యంలో ఉనా జిల్లాలోని చింతపూర్ణి ఆలయానికి సమీపంలో ఉన్న బెహాద్ గ్రామంలో క్షిపణి భాగాలను పోలి ఉండే అనుమానాస్పద లోహ వస్తువు కనుగొన్నట్లు అధికారులు శనివారం తెలిపారు. కాంగ్రా జిల్లాలోని నూర్పూర్‌లోని ఇండోరా ప్రాంతంలో రెండు చోట్ల డ్రోన్, క్షిపణి అవశేషాలను పోలి ఉండే మరో రెండు అనుమానాస్పద వస్తువులు కూడా కనుగొనబడినట్లు వారు తెలిపారు. పఠాన్‌కోట్ సమీపంలోని దమ్తాల్ గ్రామంలో భారత సైన్యం కూల్చివేసిన డ్రోన్ అనుమానిత అవశేషాలు, జోటా గ్రామంలో క్షిపణి భాగాలను పోలి ఉండే శిథిలాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ప్రసిద్ధ చింతపూర్ణి ఆలయానికి 10 కి.మీ దూరంలో ఉన్న బెహాద్, శనివారం తెల్లవారుజామున 1.30 గంటలకు పేలుడు శబ్దంతో ప్రతిధ్వనించిందని అధికారులు తెలిపారు.

### పఠాన్‌కోట్, జలంధర్ జిల్లాల్లో భారీ పేలుళ్లు



శుక్రవారం రాత్రంతా ఉద్రిక్తతతో ఉక్కిరిబిక్కిరి కాగా, పంజాబ్‌లోని పఠాన్‌కోట్, జలంధర్ జిల్లాల్లో పేలుడు వంటి శబ్దాలు వినిపించాయని, హోషియార్‌పూర్, అమృత్‌సర్, ఫిరోజ్‌పూర్ జిల్లాల్లో ఎయిర్ సైరన్‌లు మోగాయని అధికారులు తెలిపారు. హర్యానాలోని సిర్సాలో కూడా, అర్ధరాత్రి తర్వాత పేలుడు వంటి శబ్దాలు విన్నట్లు కొంతమంది స్థానికులు తెలిపారు. శనివారం తెల్లవారుజామున పంజాబ్‌లోని జలంధర్ జిల్లాలోని కంగనివాల్ గ్రామంలోని నివాస ప్రాంతంలో గుర్తు తెలియని లోహపు వస్తువు పడినట్లు అధికారులు చెప్పారు. ఈ ఘటనలో ఒక వలస కార్మికుడు గాయపడ్డాడని, ఆ ప్రాంతంలోని కొన్ని ఇళ్ళు కూడా దెబ్బతిన్నాయని స్థానికులు తెలిపారు. గుర్తు తెలియని వస్తువు భాగాలు ఆ ప్రాంతంలో పడ్డాయన్నారు. తాను కిటికీ దగ్గర నిలబడి ఉండగా, తెల్లవారుజామున 1.30 గంటల ప్రాంతంలో ఏదో వస్తువు నీటి ట్యాంక్ (ఇంటి)ని ఢీకొట్టిందని, అది కింద పడడానికి ముందు 45 ఇళ్ల అద్దాలు పగిలిపోయాయని ఆ ప్రాంతానికి చెందిన ఒక మహిళ తెలిపింది. ఓ వలస కార్మికుడికి చేయిపై గాయాలు కాగా, అతన్ని ఆసుపత్రికి తరలించినట్లు ఆమె పేర్కొన్నారు. శుక్రవారం రాత్రిపూట పెద్ద పేలుడు సంభవించిందని, దీని వల్ల చాలా మంది ఇళ్ల నుంచి బయటకు రావాల్సి వచ్చిందని మరో స్థానిక నివాసి ముస్కాన్ చెప్పారు. ఆకాశంలో ఎరుపు రంగు కాంతి వెలిగిందని, ఆ తర్వాత పెద్ద పేలుడు సంభవించిందని సుర్జిత్ కౌర్ తన అనుభవాన్ని వివరించారు. ఆ ప్రాంతంలోని మరికొన్ని ఇళ్ల నీటి ట్యాంకులు కూడా దెబ్బతిన్నాయన్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పెద్ద సమావేశాలు లేదా జనసమూహాలను నివారించాలని జాలంధర్ డిప్యూటీ కమిషనర్ హిమాన్షు అగర్వాల్ ప్రజలను కోరారు. జలంధర్ కాంట్, అడంపూర్‌లోని మార్కెట్లను మూసివేయాలని, ప్రజలు బహిరంగ ప్రదేశాల్లోకి వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. పఠాన్‌కోట్‌లో ఉదయం 5 గంటల ప్రాంతంలో, జలంధర్‌లో 8:30 గంటల ప్రాంతంలో పేలుడు వంటి శబ్దాలు వినిపించాయి. అయితే, ఈ విషయంలో అధికారిక సమాచారం లేదు.

## ఆపరేషన్ సిందూర్

### ఐదుగురు కీలక ఉగ్రవాదులు హతం



న్యూఢిల్లీ : పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా ఈ నెల 7న భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో ఐదుగురు టాప్ ఉగ్రవాదులు హతమయ్యారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె)తో పాటు పాకిస్థాన్‌లోని 9 కీలక ఉగ్రవాద స్థావరాలు, శిక్షణ కేంద్రాలను భారత సైనిక దళాలు ధ్వంసం చేశాయి. సుమారు వంద మంది ఉగ్రవాదులు మరణించారు. మృతుల్లో పాకిస్థాన్‌కు చెందిన ఐదుగురు టాప్ ఉగ్రవాదులు ఉన్నట్లు ఆర్మీ వర్గాలు గుర్తించాయి.

1. ముదస్సర్ ఖాదియన్ ఖాస్ అలియాస్ ముదస్సర్ అలియాస్ అబూ జుందాల్. లష్కరే తోయిబాతో సంబంధమున్న ఉగ్రవాది. మురిద్కేలోని మర్కజ్ తైబా ఇన్‌చార్జ్. 2008 ముంబై దాడుల్లో సజీవంగా పట్టుబడిన ఏకైక ఉగ్రవాది అజ్మల్ కసబ్ ఈ శిబిరంలోనే శిక్షణ పొందినట్లు ఒప్పుకున్నాడు. 26/11 దాడుల్లో పాల్గొన్న మరో ఉగ్రవాది డేవిడ్ హెడ్లీ కూడా ఇక్కడే శిక్షణ పొందినట్లు సమాచారం. కాగా, పాకిస్థాన్‌లోని ప్రభుత్వ స్కూల్‌లో గ్లోబల్ టెర్రరిస్ట్ హాఫీజ్ అబ్దుల్ రవూఫ్ నేతృత్వంలో ముదస్సర్ అంత్యక్రియలు జరి





గాయి. పాకిస్థాన్ సైన్యం గౌరవ వందనం సమర్పించింది. పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్, పంజాబ్ ప్రావిన్స్ సీఎం మరియం నవాజ్ తరపున ఉన్నత సైనిక అధికారులు పుష్ప గుచ్ఛం ఉంచారు. లెఫ్టినెంట్ జనరల్ హోదాలో ఉన్న పాకిస్థాన్ ఆర్మీ అధికారి, పంజాబ్ ప్రావిన్స్ పోలీస్ ఇన్స్పెక్టర్ జనరల్ తదితరులు ఈ అంత్యక్రియలకు హాజరయ్యారు.

2. హాఫీజ్ ముహమ్మద్ జమీల్, జైష్‌ఎమొహమ్మద్ (జెఇఎం)తో సంబంధం ఉన్న టాప్ ఉగ్రవాది. జెఇఎం వ్యవస్థాపకుడు మౌలానా మసూద్ అజార్ బావమరిది. పాకిస్తాన్‌లోని బహావల్‌పూర్‌లో మర్కజ్ సుభాన్ అల్లాహ్ ఇన్‌చార్జ్. జెఇఎంవైపు యువతను ప్రేరేపించడం, నిధుల సేకరణలో చురుకుగా పాల్గొన్నాడు. కాగా, జెఇఎం వ్యవస్థాపకుడు మౌలానా మసూద్ అజార్ తరచుగా బహావల్‌పూర్‌ను సందర్శించేవాడు. మే 7న ఇక్కడి ఉగ్రవాద శిబిరంపై జరిగిన దాడిలో అజార్ కుటుంబ సభ్యులు, నలుగురు అనుచరులతో సహా పది మంది మరణించినట్లు ఆ వర్గాలు తెలిపాయి.

3. మహ్మద్ యూసుఫ్ అజార్ అలియాస్ ఉస్తాద్ జీ అలియాస్ మొహమ్మద్ సలీం. ఇతడు కూడా జైష్‌ఎమొహమ్మద్ (జెఇఎం)లో టాప్ ఉగ్రవాది. మసూద్ అజార్ బావమరిది. జెఇఎంలో ఆయుధ శిక్షణ నిర్వహించాడు. జమ్ముకశ్మీర్‌లోని ఉగ్రవాద దాడులతోపాటు 1999లో ఐసి814 విమానం హైజాక్‌లో (కాందహార్ హైజాకింగ్)లో పాల్గొన్నాడు. విమాన ప్రయాణికుల బందీలకు బదులుగా మసూద్ అజార్‌ను భారత్ నాడు విడుదల చేసింది.

4. అబూ అకాషా అలియాస్ ఖలీద్ అలియాస్ అబూ అకాషా. లష్కరే తోయిబా (ఎల్‌ఇటి) ఉగ్రవాది. జమ్ముకశ్మీర్‌లో అనేక ఉగ్రవాద దాడుల్లో పాల్గొన్నాడు. ఎల్‌ఇటి కోసం ఆఫ్ఘనిస్తాన్ నుంచి ఆయుధాలను అక్రమంగా రవాణా చేయడంలో కీలక పాత్ర పోషించాడు. ఫైసలాబాద్‌లో జరిగిన అబూ అకాషా అంత్యక్రియల్లో పాకిస్థాన్ ఆర్మీ సీనియర్ అధికారులు, ఫైసలాబాద్ డిప్యూటీ కమిషనర్ హాజరయ్యారు.

5. మహ్మద్ హసన్ ఖాన్, నిషేధిత జైషే గ్రూపునకు చెందిన టాప్ ఉగ్రవాది. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె)లో జెఇఎం ఆపరేషనల్ కమాండర్ ముఫ్తీ అస్గర్ ఖాన్ కశ్మీరీ కుమారుడు. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద దాడులను సమన్వయం చేయడంలో కీలక పాత్ర పోషించాడు. కాగా, పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద గ్రూపులైన జైషే మొహమ్మద్ (జెఎఎం), లష్కరే తోయిబా(ఎల్‌ఇటి)లో కీలక పాత్ర పోషించిన ఈ ఐదుగురు టాప్ ఉగ్రవాదులు భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ వైమానిక దాడుల్లో మరణించారు. ఈ ఉగ్రవాదుల అంత్యక్రియలకు పాకిస్థాన్ ఉన్నత సైనిక అధికారుల హాజరైన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పాక్ సైన్యం, ఉగ్రవాదుల మధ్య సంబంధాన్ని ఇది బహిర్గతం చేసింది.



## ఎస్–400పై తప్పుడు వార్తలు

### భారత సైన్యం ప్రకటన

న్యూఢిల్లీ : భారత్‌కు చెందిన ఎస్400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ధ్వంసమైనట్లు వస్తున్న వార్తలను భారతీయ సైన్యం ఖండించింది. ఆదంపూర్‌లో ఉన్న ఎస్–400 రక్షణ వ్యవస్థను పాకిస్థాన్‌కు చెందిన జెఎఫ్17 ఫైటర్ విమానలకు చెందిన హైపర్‌సోకిన్ క్షిపణులు ధ్వంసం చేసినట్లు వార్తలను వ్యాపిస్తున్నాయి. ఆ వార్తల్లో వాస్తవం లేదని భారత ఆర్మీ అధికారి ఒకరు స్పష్టం చేశారు. ఎస్–400 రక్షణ వ్యవస్థ ధ్వంసమైనట్లు పాకిస్థాన్‌కు చెందిన పిటివిలో వార్తలు ప్రసారం అయ్యాయి. ఆ వార్తలను ఖండిస్తూ భారతీయ సైన్యం ప్రకటన చేసింది. చైనాకు చెందిన జినాహూ వార్తా ఏజెన్సీ కూడా ఎస్–400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ధ్వంసమైనట్లు వార్తలను ప్రచురించింది. అయితే ఆ వార్తలు అన్నీ అబద్దాలు అని భారతీయ సైన్యం పేర్కొన్నది.

## పత్రికాస్వేచ్ఛపై కేంద్రం ఉక్కుపాదం

### ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా ఖండన




**న్యూఢిల్లీ:** భారత్–పాకిస్థాన్ మధ్య జరుగుతున్న అనధికార యుద్ధం నేపథ్యంలో 'ద వైర్' సహా కొన్ని యూ ట్యూబ్ న్యూస్ ఛానల్స్‌ను అన్యాయపూరితంగా లక్ష్యంగా చేసుకుని ఆంక్షలు విధించడాన్ని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పి సి ఐ) తీవ్రంగా ఖండించింది. ఇండియన్ ఉమెన్స్ ప్రెస్ కార్ప్స్, ప్రెస్ అసోసియేషన్, ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్, కేరళ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్, వర్కింగ్ న్యూస్ కెమెరామెన్స్ అసోసియేషన్‌లు పిసిఐ ఛత్రంకింద శనివారంనాడు ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. దేశంలో ఈ విధంగా పత్రికాస్వేచ్ఛకు వ్యతిరేకంగా అణచివేత అంటే భారత ప్రజాశ్రేణులపై ప్రయోజనాలకు వ్యతిరేకంగా ప్రత్యక్షంగా చేసిన అణచివేతేనని ఈ ఆరు సంఘాలు విమర్శించాయి. ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో ఎలాంటి గుట్టూ లేకుండా బాహాటత్వం ప్రదర్శించాలని, జర్నలిస్టులూ, వార్తాసంస్థలు ఎలాంటి ఆంక్షలూ లేకుండా తమ విధులు తాము నిర్వర్తించుకోనివ్వాలని డిమాండ్ చేశాయి.

''ఈనెల తొమ్మిదో తేదీన న్యూస్ వెబ్‌సైటు 'ద వైర్' ఒక ప్రకటన విడుదల చేస్తూ, కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 'ద వైర్'ను అందుబాటులో లేకుండా నిషేధించిందని పేర్కొంది. కొన్ని ఇంటర్నెట్ ప్రొవైడర్ల సమాచారం ప్రకారం 2000 సంవత్సరంనాటి ఐ టి చట్టం ప్రకారం, కేంద్ర ఎలక్ట్రానిక్స్,ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ 'ద వైర్'ను నిషేధించింది. గతనెల 22వ తేదీన పహల్గామ్‌లో ఉగ్రవాదులు చేసిన ఘోర అకృత్యం తర్వాత జర్నలిస్టులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తగా తీసుకుంట్ను చర్యల్లో భాగంగానే ఈ నిషేధం కూడా విధించారు. భారత దేశ పత్రికారంగం ఈ చర్యను ఎలాంటి సందేహాలు లేకుండా ఏకాభిప్రాయంతో ఖండించాయి. కశ్మీరు కేంద్రంగా పనిచేసే వార్తాసంస్థలు, అనురాధా భాసిన్, ముజామిల్ జలీల్ వంటి సీనియర్ జర్నలిస్టుల ఎక్స్ ఎకౌంట్లతోపాటు స్వతంత్ర మీడియా సంస్థ ''మఖ్తూబ్ మీడియా'' ఎక్స్ ఎకౌంటును మనదేశంలో చట్టం పేరుతో నిలిపివేసింది. ఇంతకు ముందు కూడా పహల్గామ్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో కశ్మీరు కేంద్రంగా పనిచేసే జర్నలిస్టు హిలాల్ మీర్ సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టాడనే నెపంతో నిర్బంధించారు. భారతదేశంలో బిబిసి ఉర్దూ ఎక్స్ అకౌంటును కూడా స్తంభింపజేశారు. మొత్తం 8000 కు పైగా ఎక్స్ అకౌంట్లను స్తంభింపజేస్తూ కేంద్ర ప్రభుత్వం కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేసిందని వార్తా నివేదికలు వచ్చాయి. కానీ ఎక్స్ వేదికగా ఈ కార్యనిర్వాహక ఉత్తర్వుల వివరాలను విడుదల చేయలేదు. న్యాయపరమైన ఆంక్షలపేరుతో వాటిని ఎక్స్ వేదిక ద్వారా షేర్ చేయలేదు. కానీ ఈ విధంగా చేయడం భారతదేశ ప్రజాస్వామ్యంలో అనుసరిస్తున్న బహిరంగ,బాహాటత్వ విధానానికీ, జవాబుదారీతనానికీ పూర్తి వ్యతిరేకం. దేశంలో మీడియా తనకుతానుగా చాలా బాధ్యతాయుతగా ప్రవర్తిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మీడియా జర్నలిస్టుల సోషల్ మీడియా అకౌంట్లను, వార్తాసంస్థలను ఈ విధంగా ఏకపక్షంగా స్తంభింపజేయడాన్ని, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులను బాహాటంగా ప్రకటించకూడదన్న నిషేధాన్ని ఎత్తివేయాలి. ఈ విధమైన అణచివేత భారతదేశంలో పత్రికాస్వేచ్ఛకు వ్యతిరేకంగా జరిగే అణచివేత, ప్రత్యక్షంగా భారత ప్రజానీకం ప్రయోజనాలకు వ్యతిరేకంగా జరిగే అణచివేత'' అని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా తరపున ఆరు సంఘాలు ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి.

## ఇకపై ఏ ఉగ్రచర్య జరిగినా మాపై యుద్ధంగానే పరిగణిస్తాం..



### ప్రధాని మోదీ స్ట్రాంగ్ వార్నింగ్

**న్యూఢిల్లీ :** భారత్–పాకిస్థాన్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ ఉగ్రవాదులకు, ఉగ్రవాదులకు మద్దతు పలుకుతున్న వారికి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిందని కేంద్ర ప్రభుత్వంలోని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇక నుంచి దేశంలో ఎలాంటి ఉగ్రవాద దాడి జరిగినా దానిని భారత్‌పై యుద్ధంగానే పరిగణిస్తామని, అందుకు ధీటుగా బదులిస్తామని స్పష్టం చేసిందని వెల్లడించాయి. గత నెల 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడి యావత్ భారతదేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఆ దాడిలో ఉగ్రవాదులు ఏకంగా 26 మంది పర్యాటకులను కాల్చిచంపడాన్ని ప్రపంచ దేశాలు ఖండించాయి. ఈ దాడికి పాల్పడింది పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులేనని తేలడంతో భారత్ రగిలిపోయింది. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై సర్జికల్స్ స్ట్రైక్స్ చేస్తోంది. అందుకు ప్రతిగా పాకిస్థాన్ సరిహద్దుల్లో కాల్పులు జరుపుతూ కవ్వింపులకు పాల్పడుతోంది. ఈ నేపథ్యంలో కేంద్రం తాజా హెచ్చరికలు చేసింది. అంతకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ త్రివిధ దళాధిపతులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ప్రధాని నివాసంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్) అనిల్ చౌహాన్, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఉన్నతస్థాయి సమావేశానికి కొన్ని గంటల ముందే భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సైతం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. భారత్ – పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో దోవల్ వరుసగా ప్రధానితో చర్చలు జరుపుతున్నారు.

### యూ ట్యూబ్ చానెల్ '4పిఎం' పిటిషన్‌పై

## మే 13న సుప్రీంకోర్టు విచారణ



న్యూఢిల్లీ : యూ ట్యూబ్ చానెల్ '4 పిఎం'ను నిలిపివేయాలన్న ఆదేశాన్ని రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మే 13న (మంగళవారం) విచారణ చేపట్టనుంది.డిజిటల్ న్యూస్ ప్లాట్‌ఫారమ్ '4 పిఎం' ఎడిటర్ సంజయ్ శర్మ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మే 5న కేంద్రం, ఇతరుల నుంచి ప్రతిస్పందనలను కోరింది. ఈ చానెల్ 73 లక్షల సబ్‌స్క్రైబర్లను కలిగిఉంది. జాతీయ భద్రత, పబ్లిక్ నుంచి 'అస్పష్టమైన కారణాలను' ఉటంకిస్తూ కేంద్రం బహిర్గతం చేయని ఆదేశానికి అనుగుణంగా మధ్యవర్తి ద్వారా నిరోధించడం జరిగిందని పిటిషన్ వెల్లడించింది. మే 13నాటి సుప్రీంకోర్టు కాజ్ లిస్ట్ ప్రకారం ఈ పిటిషన్ విచారణ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్.గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ మాసిహ్‌లతో కూడిన ద్విసభ్యధర్మాసనం ముందుకు వచ్చింది. 'ఈ చానెల్‌ను అడ్డుకోవడం అంటే పాత్రికేయ స్వాతంత్ర్యం, సమాచారాన్ని స్వీకరించే ప్రజాహక్కుపై జరిగిన భయంకరమైన దాడిగా పరిగణించాల్సివస్తుంది' అని పిటిషన్ ఆరోపించింది. '4పిఎం'యూ ట్యూబ్ చానెల్ తరపున పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది తల్హా అబ్దుల్ రహమాన్ తన వాదన వినిపిస్తూ బాధిత పిటిషనర్ తన వివరణను వినిపించే అవకాశం లేకుండదా కంటెంట్ ముసుగును తొలగించడం రాజ్యాంగం అనుమతించబోదని పిటిషన్ పేర్కొంది. 'జాతీయ భద్రత', 'పబ్లిక్ ఆర్డర్' స్క్రూటినీ నుండి కార్యనిర్వాహక చర్యను నిరోధించడానికి అవేమీ మంత్రోచ్చారణలు కాదని పిటిషన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ చానెల్‌ను బ్లాకింగ్‌చేసేందుకు ఆదేశాలు జారీచేయడానికి గల 'కారణాలు' 'రికార్డులు' ఏవైనా ఉంటే సమర్పించాలని కేంద్రానికి ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్ తన పిటిషన్‌లో అభ్యర్థించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్,2009 సమాచారంలోని రూల్ 16ను రద్దు చేయాలని కోరారు. రూల్ 16 అన్ని అభ్యర్థనల ఫిర్యాదులు, నియమం ప్రకారం తీసుకున్న చర్యలకు సంబంధించి కఠినమైన గోప్యతను తప్పనిసరి చేస్తుంది.

## మహిళా ఆర్మీ అధికారులకు 'సుప్రీం' ఉపశమనం

### స్వాగతించిన కాంగ్రెస్ పార్టీ

### సుప్రీం కోర్టు నిర్ణయం మహిళా సైనిక అధికారుల పాలిట 'ఆశాకిరణం'

### విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేత, రిటైర్డ్ వింగ్‌కమాండర్ అనుమ ఆచార్య హర్షం



న్యూఢిల్లీ : సైన్యంలో శాశ్వత కమిషన్ హోదాను తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన మహిళా సైనిక అధికారుల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశం, ఈ సందర్భంగా చేసిన కీలకవ్యాఖ్యలు మహిళా ఆర్మీ అధికారులకు ఉపశమనం ఇచ్చింది. షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్‌ఎస్‌సి) సర్వీస్ నుంచి విడుదల చేయవద్దని కేంద్రాన్ని కోరుతూ శనివారం సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. ప్రస్తుత వాతావరణంలో మహిళా అధికారుల మనోధైర్యాన్ని పెంచుతుందని పేర్కొంది. ఇక్కడి 24, అక్బర్ రోడ్డులో ఉన్నటువంటి కాంగ్రెస్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేత, వింగ్ కమాండర్ (విశ్రాంత) అనుమ ఆచార్య మాట్లాడుతూ 'దేశంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో భారత సాయుధ దళాల పట్ల మేంమా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాం. అంతేకాదు వారి ధైర్యానికి వందనం చేస్తున్నాం' అని ఆమె అన్నారు. ప్రతీ సంవత్సరం 250మంది షార్ట్ సర్వీస్ కమిషన్ అధికారులకు మాత్రమే శాశ్వత కమిషన్ ఇవ్వవచ్చని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. సైన్యంలో యువ అధికారుల కేడర్ ఉండటం చాలా ముఖ్యం. దీనిపై మాట్లాడుతూ 'యువ సైనికులలో మానసిక స్థైర్యానికి, మార్గనిర్దేశానికి మహిళా అధికారులు కూడా ఎంతో ముఖ్యం అని సుప్రీంకోర్టు చెప్పింది' అని అనుమ ఆచార్య చెప్పారు. సుప్రీంకోర్టు నిర్ణయం మహిళా ఆర్మీ అధికారులకు ఆశాకిరణం గా నిలిచిందని చెప్పారు. 'షాట్ సర్వీస్ కమిషన్ మహిళా ఆర్మీ అధికారులను సర్వీస్ నుంచి విడుదల చేయవద్దని సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్రాన్ని కోరింది. ప్రస్తుత పరిస్థితిలో మహిళా ఆర్మీ అధికారుల మనోధైర్యాన్ని దిగజార్చవద్దు' అని అత్యున్నత న్యాయస్థానం పిలుపునిచ్చింది. సుప్రీం కోర్టు నిర్ణయం ఎంతో ఊరట ఇచ్చింది. దేశంలోని ప్రస్తుత వాతావరణంలో మహిళా అధికారుల మనో ధైర్యాన్ని మరింతగా పెంచుతుంది' అని అనుపమ ఆచార్య తెలియజేశారు. '2006 తర్వాత నుంచి విధానాలు నిరంతరం మారతున్నాయి. రెండున్నర ఏళ్ల క్రితం ఇద్దరు మహిళలు కూడా నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డిఏ) ద్వారా ఆర్మీలోకి చేరారు. మనం ఇప్పుడు ఓ 30ఏళ్ల తర్వాత పరిస్థితిని ఊహించవచ్చు. ఆర్మీ చీఫ్‌గా ఒకరు లేదా అధిక సంఖ్యలో మహిళలను చూడొచ్చు' అని ఆచార్య చెప్పారు. 'ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు వచ్చింది. తదుపరి విచారణ ఆగష్టులో జరిగేవరకూ అధికారులను కొనసాగించాలి' అని ఆమె కోరారు. 'సుప్రీంకోర్టు తీసుకున్న ఈ నిర్ణయాన్ని మనం స్వాగతిస్తున్నాం. మనం ఈ దేశ ఆర్మీతో ఉన్నాం. మనం ఆర్మీ ప్రజలను మనం తప్పకుండా గౌరవించాలి. ధైర్యవంతులైన ప్రతీ సైనికుడికీ మనం సెల్యూట్ చేయాలి' అని అనుమ ఆచార్య చెప్పారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం మాట్లాడుతూ '69మంది అధికారులు దాఖలు చేసిన పిటిషన్ల బ్యాచ్‌ను విచారణ జరిపేందుకు ఆగష్టు వరకు వాయిందా వేసింది. తదుపరి విచారణ జరిగే వరకూ విడుదల చేయరాదని' వారు చెప్పిన విషయం తెలిసిందే.



# జనరల్
STATE & REGIONAL NEWS

## త్వరితగతిన ఆయిల్ రిఫైనరీ పనులు పూర్తి

### మాజీ మంత్రి హరీష్‌రావు

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట నియోజకవర్గం నంగునూర్ మండలం నర్మెట్ట గ్రామంలో చేపట్టిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో కలియ తిరుగుతూ నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే అయిల్‌పామ్ పంట అందుబాటులోకి వచ్చిందన్నారు. జూలై నాటికి ఫ్యాక్టరీ అందుబాటులో తేవాలన్నారు. ప్రతి యేట జిల్లాలో అయిల్‌పామ్ జిల్లాలో ఈ సాగుని రైతులు ఎంతో కష్టపడి చేస్తున్నారని, రైతులకు మేలు కోసమే ఈ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిద్దిపేట రంగధాంపల్లి ఆలయంలో నూతనంగా నిర్మించిన అన్నదాన భవనాన్ని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రారంభించారు. హనుమాన్ భక్తులతో కలిసి సాముహిక బిక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆనంతరం క్యాంపు కార్యాలయంలో జరిగిన హనుమాన్ భక్తుల భజన కార్యక్రమంలో ఎంఎల్‌ఏ హరీష్‌రావు పాల్గొన్నారు.

## భారత్-పాక్ ఘర్షణలు భవిష్యత్తులో శాశ్వత శాంతికి దారి

### ఉద్రిక్తతల నేపథ్యంలో శ్రీనగర్ వాసుల ఆశాభావదృక్పథం

**శ్రీనగర్ :** సరిహద్దు అవతల నుంచి పాకిస్థాన్ చేస్తున్న నిరంతర ఫిరంగి దాడులు, సైనిక స్థావరాలపై దాడుల సంఘర్షణలు శ్రీనగర్ సహా కశ్మీర్ లోయ ప్రజల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నా జమ్ముకశ్మీర్ వేసవి రాజధానియైన శ్రీనగర్ నివాసులు మాత్రం ఏ మాత్రం ఆందోళన చెందడం లేదు. ప్రస్తుత పరిస్థితి భయానకంగా ఉన్నా భవిష్యత్తులో నిరంతర శాంతికి మార్గం సుగమం అవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్ నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా భారత్ ఉగ్రవాద శిబిరాలను భూస్థాపితం చేసిన తర్వాత శ్రీనగర్ సహా కశ్మీర్ లోయలో పాకిస్థాన్ అనేకసార్లు నగరంలో దాడులకు తెగబడుతోంది. నివాస స్థావరాలపై డ్రోన్ దాడులు చేస్తోంది. శ్రీనగర్ విమానాశ్రయం సహా దక్షిణ కశ్మీర్‌లోని అవంతిపోరా విమాన స్థావరంలో పాక్ ఈ దాడులకు తెగబడి విఫలమయ్యారు. పేలుళ్ల శబ్దాలు ప్రతిధ్వనించాయి, ముందు జాగ్రత్త చర్యగా ప్రజలందరూ లైట్లు స్విచ్‌ఆఫ్ చేయాలని మసీదులలోని లౌడ్‌స్పీకర్ల ద్వారా అనౌన్స్ చేశారు. అయితే ఈ పరిస్థితిని తలనొప్పిగా భావించకుండా స్థానికులు శనివారం వీధులలో చర్చలు సాగించారు. ఆపరేషన్ సిందూర్ మూలం గా జమ్ముకశ్మీర్‌లో నిరంతర శాంతికి మార్గం సుగమం కాగలదన్న ఆకాంక్షను వ్యక్తపరిచారు. భారత్‌పాకిస్థాన్ కాల్పుల విరమణకు ఇరుదేశాల మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్స్ శనివారం అంగీకరించినట్లు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ప్రకటించారు. భూమి, గగనతలం, సముద్రంలో అన్నిరకాల కాల్పులను శనివారం సాయంత్రం 5గంటల నుంచి నిలిపివేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనికి ముందు ఈ ప్రాంతాలలో ప్రతీరోజూ చర్చల్లో 'స్టాండ్ ఆఫ్' అనే పదం వారి సంభాషణల్లో చోటుచేసుకున్నది. కొద్ది కొద్దిగా తెలిసిన ధృవీకరించబడని సమాచారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ పరిస్థితిపై కొంతమంది ప్రజలు నిపుణుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఆసక్తి కనబరిచారు. రాబోయే ప్రమాదాలనుంచి వారి ఆలోచనలను మళ్లించేందుకు ఈవిధంగా ఆలోచిస్తున్నారేమో అని ఒక ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడు ఫరూఖ్ అహ్మద్ రేషి వ్యాఖ్యానించారు. కశ్మీరీలు రాజకీయ అవగాహన కలిగి ఉన్నవారని, కశ్మీరీలు దాదాపు 80 సంవత్సరాలుగాఈ సంఘర్షణలు ఎదుర్కొంటున్నారని వివరించారు.

## 'నేడు' సుశీలమ్మ సంస్మరణ సభ

### హాజరు కానున్న కూనంనేని, పువ్వాడ అజయ్



**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నాయకురాలు, మాజీ సర్పంచ్ తూము సుశీలమ్మ సంస్మరణ సభ ఆదివారం రాయన్నపేట గ్రామంలో నిర్వహించనున్నట్లు సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు నేడొక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సంస్మరణ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, టిడిపి నాయకులు వాసిరెడ్డి రామనాథం, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, బత్తినేని చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు బత్తినేని నాగప్రసాద్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తూము రోషన్‌కుమార్, ప్రకాష్ ప్రాజెక్ట్స్ ఛైర్మన్ బత్తినేని ప్రకాష్ హాజరుకానున్నట్లు ఆనందరావు తెలిపారు. ప్రముఖ వైద్యులు గోర్కీతో పాటు సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, బిఆర్ఎస్, టిడిపిలకు చెందిన పలువురు నేతలు హాజరుకానున్నారని ఆయన తెలిపారు.

## మార్పుకోసమే ప్రయత్నం

### 28మందిపై రౌడీషీట్ ఎత్తివేత: డిఎస్‌పి తిరుపతిరావు



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మహబూబాబాద్ డివిజన్ పోలీసు పరిధిలో సత్ప్రవర్తన కలిగిన ప్రశాంత వంతమైనజీవితం గడుపుతున్న 28మందిపై రౌడీషీట్‌ను మహబూబాబాద్ జిల్లా ఎస్‌పి సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు తొలగించినట్లుగా డిఎస్‌పి తిరుపతిరావు ప్రకటించారు. మహబూబాబాద్ డివిజన్ పరిధిలో సత్ప్రవర్తన కలగి ఉదన్న వారిపై రౌడీషీట్ తొలగింపు మేళా శనివారం టౌన్‌పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించారు. ఇందులో ప్రశాంతవంతమైన జీవితంతో పాటు ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనకుండా సాధారణ జీవితాన్ని గడుపుతున్న వారిపై రౌడీషీట్ తొలగించేందుకు గానూ జిల్లా పరిధిలో రౌడీషీట్ల తొలగింపు మేళా ఏర్పాటుచేశారు. అధికారులు నెలరోజులపాటు కసరత్తు చేసి రౌడీషీట్ల తొలగించడం జరిగింది. దీని కోసం డివిజన్ పరిధిలోని రౌడీషీటర్ల ప్రస్తుత జీవన విధానంపై సంబంధిత స్టేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో సమీక్ష జరిపి రౌడీషీట్ తొలగింపు జాబితాను రూపొందించారు. ఈ జాబితాను అనుసరించి సత్ప్రవర్తన కలిగిన వారిపై జిలా ఎస్‌పి ఆదేశాల మేరకు రౌడీషీట్ తొలగింపు మేళా నిర్వహించారు. ఈ మేళానుద్దేవించి డిఎస్‌పి తిరుపతిరావు మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా సాధారణ జీవితం గడుపుతున్న వారిపై రౌడీషీట్లను ఎత్తివేస్తున్నట్లు తెలిపారు. సత్ప్రవర్తన కలిగిన వారిపై రౌడీషీట్లను ఎత్తివేశామని జిల్లా ఎస్‌పి తెలిపినట్లుగా డిఎస్‌పి వివరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సిఐ దేవేందర్, డోర్నకల్ సిఐ రాజేష్, బయ్యారం సిఐ రవి, ఎస్ఐ తిరుపతి, రూరల్ ఎస్ఐ దీపిక తదితరులు పాల్గొన్నారు.


## 'ఆర్మీ మిషన్' పేరిట అపరిచితుడు కాల్

### రూ. 96,482 నగదు పోగొట్టుకున్న పట్టణ ట్రేడర్

**ప్రజాపక్షం/మందమర్రి :** అపరిచితుని కాదు ద్వారా 25 రేకులు కావాలన్నా ఆర్డర్‌కు ఆశపడి రూ.96 వేల 482లు కోల్పోయిన ట్రేడర్.. పట్టణ ఎస్ఐ రాజశేఖర్ కథనం ప్రకారం అపరిచితుని ద్వారా కల్ స్వీకరించిన ట్రేడర్ 25 రేకులు ఆర్డరు తీసుకునే క్రమంలో ముందస్తుగా వాట్సాప్ ద్వారా క్యూర్ కోడ్‌ను పంపించి ఒక రూపాయి స్కాన్ చేస్తే మిగతా డబ్బు పంపిస్తామని చెప్పడంతో నమ్మకంతో సదరు ట్రేడర్ ఒక రూపాయి పంపగా రెండు రూపాయలు వచ్చాయని తర్వాత రేకుల అమౌంట్ మొత్తం వస్తాయని అది ఆర్మీ మిషన్ ద్వారా మూడు లింకులు పంపించగా దానిని ఓనర్ ఓపెన్ చేయగా తన అకౌంట్‌లో ఉన్న 96,482 రూపాయలు పోయినట్లుగా మెసేజ్ రాగానే మోసపోయనని గ్రహించి 1930 సైబర్ క్రైమ్ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయగా ప్రాథమిక దర్యాప్తు అనంతరం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా మందమర్రి పోలీసులు పలు సూచనలు చేశారు. ఎదైనా మెసేజ్ స్పందించే ముందు సమాచారాన్ని ధృవీకరించుకోవాలని అనుమానాస్పద లింకులను క్లిక్ చేయరాదని నగదు లావాదేవీలను బ్యాంకుల ద్వారా మాత్రమే చెల్లించుకోవాలని అధిక రాబడి పథకాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, కెవైసిని వ్యక్తిగతంగా అప్డేట్ చేసుకోవాలని అనుమానాస్పద కాల్స్, నెంబర్లపై సైబర్ క్రైమ్ కోర్కెల ద్వారా రిపోర్ట్ చేయాలని వ్యక్తిగత వివరాలు ఎవరితో షేర్ చేయవద్దని చెప్పారు. సైబర్ క్రైమ్ బారిన పడినట్లయితే 1930టోల్ ఫ్రీ నెంబర్‌కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని అన్నారు.

# నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నా...
# లబ్ధిదారులకు దక్కని 'స్వయం ఉపాధి'

### 'రాజీవ్ యువ వికాసం' సరే... ఇప్పటికే మంజూరైన రుణాల సంగతేమిటీ?
### 30 వేల మంది గిరిజన నిరుద్యోగ యువతకు మొండిచేయి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ''అమ్మ పెట్టదు అడుక్కుని తిననివ్వదు'' అనే విధంగా ఉంది పాలకుల తీరు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించే పరిస్థితి లేదు. సరే... ఉద్యోగాలు ఇవ్వకపోయినా తామే స్వయం ఉపాధి చూసుకుని బతుకుతాం అంటే అందుకు సంబంధించిన రుణాలను కూడా ప్రభుత్వం విడుదల చేయడం లేదు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం 'రాజీవ్ యువ వికాసం' అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. దాని అమలు కోసం రూ.9 వేల కోట్లను కేటాయించి దరఖాస్తులను కూడా ఆహ్వానించింది. ఈ నెల 15వ తేదీ నుంచి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టనుంది. ఇక తెలంగాణ రాష్ట్రా అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీన లబ్ధిదారులకు రుణాలపంపిణీ కూడా మంజూరు చేయనున్నట్లు ప్రకటించింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ గతంలో లబ్ధిదారులుగా ఎంపికైన ఎస్‌సి, ఎస్, బిసి, మైనారిటీ నిరుద్యోగ యువత పరిస్థితి ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. ముఖ్యంగా గత మూడేళ్ల కింద స్వయం ఉపాధి కోసం గిరిజన సహకాక ఆర్థిక సంస్థ నుంచి ఎంపికైన 30 వేల మంది నిరుద్యోగ గిరిజన లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒక వైపు గతంలో మంజూరైన పాత రుణాలు విడుదల కాకపోవడం, మరోవైపు కొత్తగా రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులు కావడం ఇందుకు కారణం. ఎస్‌సి, ఎస్, బిసి, మైనారిటీ నిరుద్యోగ యువతకు వీరి కార్పోరేషన్ల ద్వారా ఇచ్చే స్వయం ఉపాధి రుణాలకు 2017 నుంచి గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఎగనామం పెట్టింది. కొద్ది కాలం తరువాత అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో 2021 తిరిగి స్వయం ఉపాధి రుణాల పేరుతో ఈ వర్గాల నుంచి దరఖాస్తులు తీసుకుని ప్రక్రియను ప్రారంభించారు. రెండు మూడేళ్లుగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ కార్పొరేషన్లలో లక్షలాది మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. 2019–2020, 2020–2021 సంవత్సరాల్లో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి ఒక్కో కార్పొరేషన్ నుండి అర్హుల జాబితాను ప్రకటించాయి. గిరిజన శాఖ పరిధిలోని ట్రైకార్‌తో పాటు ఎస్‌సి, బిసి, మైనారిటీ కార్పొరేషన్లలో వేలాది మంది లబ్ధిదారుల రుణాల చెక్కులను సిద్ధం చేసి క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖకు పంపాయి. ఈలోగా అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే లబ్ధిదారులకు మంజూరైన రుణాలను విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో ఇప్పటికీ లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో కోట్లాది రూపాయల బకాయిలను విడుదల చేయకుండా, లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయకుండానే హడావిడిగా రాజీవ్ యువ వికాసం పథకం అమలును వేగవంతం చేయడంతో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ కార్పొరేషన్లలో రుణాలు మంజూరైన లబ్ధిదారుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమౌతుంది.

**గిరిజన లబ్ధిదారులకు మొండిచేయి**

ముఖ్యంగా గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో 2019–2020, 2020–2021 సంవత్సరాల్లో దరఖాస్తు చేసుకున్న వారిలో 30 వేల మంది నిరుద్యోగ గిరిజన యువతీయువకులను లబ్ధిదారులుగా గుర్తించి, వారికి రుణాల పంపిణీ కోసం రూ.219 కోట్ల చెక్కులను సిద్ధం చేసి క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖకు పంపారు. రుణాల విడుదల కోసం వారు నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ, ట్రైకార్ అధికారులు అనేక సార్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాజీవ్ యువ వికాసం ద్వారా ఐదు లక్షల మంది యువతకు రుణాలు ఇవ్వడమే లక్ష్యంగా రూ.9 వేల కోట్ల బడ్జెట్‌ను ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటికే మంజూరైన లబ్ధిదారులకు సంబంధించిన రూ.219 కోట్ల రుణాలు విడుదల చేయకపోవడంలోని ఆంతర్యం ఏమిటని గిరిజన లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటివరకు గిరిజన కార్పొరేషన్‌లో ఒక స్వయం ఉపాధి యూనిట్‌కు రూ.10 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉండగా, కొత్తగా తీసుకువచ్చిన రాజీవ్ యువ వికాసంలో యూనిట్ వ్యయాన్ని రూ.4 లక్షలకు తగ్గించింది. పైగా బ్యాంకులు, ప్రైవేటు ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందేందుకు దరఖాస్తుదారుల ఆర్థిక పరిస్థితిని నిర్ధారించే 'సిబిల్' స్కోర్‌ను రాజీవ యువ వికాసానికి వర్తింపజేసింది. ఈ నిబంధనలన్నీ బలహీనవర్గాల లబ్ధిదారుల ప్రయోజనాలకు శరాఘాతంగా పరిణమించాయి. పైగా గతంలో రుణాలు మంజూరైన లబ్ధిదారులు ఇప్పుడు రాజీవ్ యువ వికాసం పథకం రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి కూడా తీవ్ర ఆటంకాలు ఎదురయ్యాయి. లబ్ధిదారులకు రుణాల పంపిణీ జరగకపోయినప్పటికీ ఆన్‌లైన్‌లో మంజూరైన జాబితాలో వారి పేర్లు ఉండడం వల్ల ఇప్పటికే రుణాలు తీసుకున్నట్టు చూపిస్తూ రాజీవ్ యువ వికాసం ఆన్‌లైన్ దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ఫలితంగా లక్షలాదిమంది గిరిజన నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాసం పథకంలో రుణాలు పొందకుండా అనర్హులుగా మారారు. రాజీవ్ యువ వికాస్ పథకం ప్రారంభంతో దశాబ్దాలుగా నిరుద్యోగ గిరిజన యువతకు రుణ సదుపాయం కల్పిస్తున్న ట్రైకార్ సంస్థ పూర్తిగా నిర్వీర్యమవుతుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ''గత ఆరు నెలల నుండి కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరైన రుణాలకు సంబంధించిన నిధులను విడుదల చేసి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇస్తూ వచ్చింది. ఈ నిధులను విడుదల చేయకుండానే అకస్మాత్తుగా రాజీవ్ యువ వికాసం పేరుతో యువతకు ఇవ్వాల్సిన రుణాలను పూర్తిగా రద్దు చేయడానికి కుట్ర చేస్తున్నదనే అనుమానం కలుగుతున్నది. లబ్ధిదారులకు ఇవ్వాల్సిన రూ.219 కోట్లను తక్షణం విడుదల చేయనట్లయితే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతాం'' గిరిజన లబ్ధిదారులు హెచ్చరిస్తున్నారు.

## సార్వత్రిక సమ్మెతో బిజెపి ప్రభుత్వానికి గుణపాఠం

### ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజయ్‌సారథి రెడ్డి




**ప్రజాపక్షం/మహబూబాబాద్‌ప్రతినిధి:** స్వతంత్ర్యం కంటే ముందు సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న బిజెపి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకే ఈనెల 20న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె అని ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.అజయ్ సారథి రెడ్డి, రేషపల్లి నవీన్ అన్నారు. శనివారం ఏఐటియుసి ఆధ్వర్యంలో ఈనెల 20న జరుగనున్న సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే కార్మిక సంఘాలు జిల్లా సదస్సులు,ప్రచార కమిటీలు, సదస్సులు, సెమినార్లు ఏర్పాటుచేస్తూ సమ్మెను జయప్రదం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారని వారు తెలిపారు. నరేంద్రమోడీ ప్రభుత్వం 11సంవత్సరాలుగా కార్మికులు సాధించుకున్న హక్కులను చట్టాలను నిర్వీర్యం చేసే ప్రయత్నంలో కార్మికులందరూ సమ్మెబాట పట్టాల్సివస్తోందన్నారు. డిల్లీలో రైతు చట్టాలకు వ్యతిరేకంగా ఆందోళన కొనసాగిన విషయం యావత్ దేశానికి తెలుసన్నారు. ఈసందర్భంగా మోడీ క్షమాపణ చెప్పినప్పటికీకూడా ఆ చట్టాలతో పాటు కార్మిక చట్టాలను కూడా మరింత నిర్వీర్యం చేసేప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో కార్పోరేట్‌కు అనుకూలంగా నరేంద్ర మోడీ విధానాలు ఉన్నాయన్నారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోర్టులుగా తీసుకువచ్చేప్రయత్నాలు విరమించుకోకపోతే సంఘటిత రంగం అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులందరూ బిజెపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పక తప్పదని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు వరిపెల్లి వెంకన్న, మంద శంకర్, వెలుగు శ్రావణ్, ఎస్‌కెజానీ, వెంపటి రాములు, పుచ్చకాయల మధుసూధన్, గాదం శ్యాం ప్రసాద్, రమేష్, గుండోజు రమేష్ పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా ర్యాలీ




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇండియన్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌కు సంఘీభావంగా ఖమ్మం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. శనివారం ఖమ్మం కార్పోరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బైపాస్ రోడ్డులో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఉగ్రవాదులు జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. పాకిస్తాన్ కవ్వింపు చర్యలకు పాల్పడడంతో ఇండియన్ ఆర్మీ ఆపరేషన్ సింధూర్ పేరుతో చేపడుతున్న యుద్ధానికి ప్రజలంతా సంఘీభావం తెలపాలన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాక్ వంటి దేశాలకు ఇటువంటి దాడులు గుణపాఠం కావాలని ఆమె తెలిపారు. బోర్డర్‌లో యుద్ధం చేస్తున్న సైనికులంతా క్షేమంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం యుద్ధంలో మరణించిన సైనికులకు, దాడిలో మృతిచెందిన మృతులకు నివాళులర్పించారు. మేయర్, కార్పొరేటర్లు ఒక నెల వేతనాన్ని ఆర్మీ జవాన్లకు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ , కార్పొరేటర్లు , పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యం



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి:** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాలలో శనివారం అకాల వర్షం కురిసింది.దీంతో పలు చోట్ల కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడిసింది. అలాగే రోడ్లపై ఆరబోసిన ధాన్యం, మొక్కజొన్న తడిచిపోయాయి. అకాల వర్షం,గాలి వానతో రైతులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట, కొత్తపల్లి, ఇల్లంద, కట్రియాల గ్రామాలతో పాటు జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలో, హనుమకొండ జిల్లా పరకాల, హహన్‌పర్తి, హనుమకొండ, ఎల్కతుర్తి, ఐనవోలు మండలాలలో అకాల వర్షం కురిసింది. కొన్ని చోట్ల వర్షంతో పాటు ఈదురు గాలులకు మామిడి తోటలలో కాయలు నేలరాలి రైతులకు నష్టాన్ని కలిగించాయి.ఇప్పటికే మూడు రోజుల క్రితం జిల్లాలో కురిసిన అకాల వర్షానికి జరిగిన భారీ నష్టం నుండి రైతులు తేరుకోక మునుపే మరోసారి అకాల వర్షం రూపంలో నష్టం జరిగింది. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో గాలి వానతో వర్షం కురవడంతో రైతులు తేరుకునే సరికే నష్టం జరిగిపోయింది. కల్లాలలో ధాన్యం తడవడంతో పాటు కోతకు సిద్దంగా ఉన్న వరిపంటకూ నష్టం జరిగిందని రైతులు వాపోయారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని వివిధ పార్టీల నాయకులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

# బ్యాంకులలో వరుస అగ్నిప్రమాదాలు

### తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పోలీసులు
### తూతూ మంత్రంగా స్పందిస్తున్న బ్యాంక్ అధికారులు
### పునరావృతమవుతున్న ఘటనలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని బ్యాంక్‌లలో జరుగుతున్న వరుస అగ్నిప్రమాదాలపై అధికారులు, ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాలపై అధికారుల అలసత్వం స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు బ్యాంకింగ్ సెక్యూరిటీ, విద్యుత్ భద్రత , అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థలపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భద్రతా లోపాల నేపథ్యంలో పోలీసులు పలుసార్లు సూచనలు చేస్తున్నా బ్యాంక్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనపించకపోవడం వల్లనే మళ్లీ మళ్లీ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. బ్యాంకింగ్ సెక్టార్లో భద్రతా ప్రమాణాలు, విద్యుత్ వ్యవస్థల నిర్వహణ, అత్యవసర ప్రతిస్పందనపై సమగ్ర విశ్లేషణపై అధికారులు సమగ్రంగా చర్చించుకుని తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటే అగ్నిప్రమాదాలకు చెక్ పెట్టవచ్చు. తూతూ మంత్రంగా కొంతమంది అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నా మరికొంత మంది అధికారుల అలసత్వం వల్ల ప్రమాదాలు పునరావృత్తం అవుతున్నాయి. సికింద్రాబాద్ ప్యాట్ని సెంటర్‌లోని ఎస్‌బిఐ బ్యాంక్ పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. షార్ట్‌సర్క్యూట్ వల్లనే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తేల్చారు. ఎసిలు ఆఫ్ చేయకపోవడం, కంప్యూటర్లు, లైట్లు కూడా సరిగా ఆర్పకుండా పోవడం వల్ల షార్ట్‌సర్క్యూట్‌కు కారణాలవుతున్నాయి. షార్ట్‌సర్క్యూట్ కాకుండా తగు చర్యలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ, పోలీసు అధికారులు బ్యాంక్ అధికారులను కోరుతున్నారు. రాష్ట్రంలో ఇటీవల బ్యాంక్‌లలో జరిగిన సంఘటనలు ఇలా ఉన్నాయి.

**కరీంనగర్‌లో 2024 జూలైన..**

కరీంనగర్ బస్టాండ్ సమీపంలోని యూనియన్ బ్యాంక్‌లో రాత్రి 11:20 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదంలో బ్యాంక్ రికార్డులు, కంప్యూటర్లు ధ్వంసమయ్యాయి. ఫైర్ సిబ్బంది 1 గంట వరకు మంటలను అదుపు చేశారు .

**మైలార్‌దేవ్‌పల్లి 2025 మార్చిలో..**

అజ్ఞాత వ్యక్తులు మైలార్‌దేవ్‌పల్లిలోని ఎస్‌బిఐ ఎటిఎంను దోచేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఎటిఎం యంత్రం ధ్వంసమైనప్పటికీ, రూ.7.06 లక్షల నగదు సురక్షితంగా ఉంది.

**కొంపల్లిలో డిసెంబర్ 2022న..**

కొంపల్లిలోని ఎస్‌బిఐ బ్రాంచ్‌లో ఉదయం 8:45 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఎయిర్ కండిషనర్లు మరియు క్యాబిన్లు ధ్వంసమయ్యాయి. అయితే, నగదు మరియు కంప్యూటర్లు సురక్షితంగా ఉన్నాయి .

**మేడ్చల్‌లో 2024 ఎప్రిల్‌లో..**

మెడ్చల్ పట్టణంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగింది, కానీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

**వరంగల్ ఎస్‌బిఐ ఎటిఎంలో..**

వరంగల్లోని ఎస్‌బిఐ ఎటిఎం కేంద్రంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో రెండు ఎటిఎం యంత్రాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి.


**కర్మన్‌ఘాట్ కెనరా బ్యాంక్‌లో..**

హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్‌లోని కెనరా బ్యాంక్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఎయిర్ కండిషనర్, ఫ్యాన్ ధ్వంసమయ్యాయి .

**బ్యాంకు అధికారులు..**

బ్యాంకు అధికారులు పోలీస్ సూచనలను పరిగణనలోకి తీసుకుని, భద్రతా చర్యలను బలోపేతం చేస్తున్నారు. కరీంనగర్‌లోని యూనియన్ బ్యాంక్ శాఖలో జరిగిన అగ్ని ప్రమాదం తర్వాత, బ్యాంకు అధికారులు భద్రతా వ్యవస్థలను సమీక్షించి, అవసరమైన మార్పులు చేయాలని నిర్ణయించారు.

**బ్యాంకుల భద్రతపై ఆందోళన**



బ్యాంకుల భద్రతపై రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు. రాచకొండ పరిధిలో 489 బ్యాంకులను పరిశీలించగా అనేక భద్రతా లోపాలు గుర్తించబడ్డాయని చెప్పారు. వాటిలో పాత అలారం వ్యవస్థలు, సిసిటివిలు, సెక్యూరిటీ గార్డుల నియామకం లోపాలు ఉన్నాయన్నారు. ఆయన బ్యాంకులకు భద్రతా వ్యవస్థలను నవీకరించాల్సిన అవసరం ఉందని సూచించారు. సిసిటివి కెమెరాలు, అలారం వ్యవస్థలు, సెక్యూరిటీ గార్డుల నియామకం వంటి భద్రతా చర్యలను బలోపేతం చేయాలని సూచించారు. ఘటన జరిగిన వెంటనే మంటలను ఆర్పేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సుధీర్‌బాబు సూచించారు.

– రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు

## మెకానిక్ కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ టూ వీలర్స్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో మెకానిక్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఖమ్మం నగరంలో టూ వీలర్ మెకానిక్‌గా పని చేస్తున్న మద్దోజు భాస్కర్‌కు ఇటీవల పక్షవాతం వచ్చింది. ఆరు నెలలు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్న ఖమ్మం కార్పోరేషన్ టూ వీలర్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.శనివారం యూనియన్ అధ్యక్షులు వంగాల కొండలరావు చేతుల మీదుగా రూ. 10వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ యూనియన్‌లో ప్రతి ఒక్కరూ సభ్యత్వం పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మాచారి, హమీద్, మురళి, శేషు, వెంకటేష్, నాగులమీరా, సత్యనారాయణ, ఉపేందర్, నరేష్, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

## అనిల్‌ను ఘనంగా సత్కరించిన తపస్ నాయకులు



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** ఉట్కూర్ మండలం పెద్ద పొర్ల గ్రామంలో అగ్నివీర్ కు ఎంపికైనా రైతు కుటుంబ నుంచి వచ్చిన అనిల్‌ను, తపస్ (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) ఆధ్వర్యంలో పెద్దపొర్ల గ్రామం గ్రామానికి చెందిన భారతమ్మ, ఈరప్ప పుణ్య దంపతుల కుమారుడు అనిల్‌ను ఘనంగా సన్మానించడం జరిగింది. గ్రామస్థుల పాల్గొన్నారు.

## తెలంగాణ మీ సేవ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా వెంకట్రాం రెడ్డి



**ప్రజాపక్షం/ నారాయణపేట్:** నారాయణపేట్ జిల్లాలోని మీసేవ నిర్వాహకులు ఆదివారం జిల్లా కేంద్రంలో సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు బైరాశంకర్, ప్రధాన కార్యదర్శి మమ్మద్ మోహిద్ హాజరైయ్యారు. తెలంగాణ మీసేవ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కోయిల కొండ వెంకట్రాం రెడ్డి , ఉపాధ్యక్షులుగా కంరోద్దీన్, శంకర్, ప్రధాన కార్యదర్శిగా ఇమ్రాన్ ఖాన్, సంయుక్త కార్యదర్శులుగా కరుణానిధి, బి. రవి తో పాటు కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ మీసేవ నిర్వాహకుల సహకారంతో సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నారు. మీసేవ నిర్వాహకులకు అందుబాటులో ఉండి తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి ముందుటానన్నారు. మీసేవ నిర్వహకులు నా పై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా బాధ్యతతో నడుచుకుంటానన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని మీసేవ నిర్వహకులు పాల్గొన్నారు.

## భారత జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితని కలిసిన రామలింగం



**ప్రజాపక్షం/ మక్తల్ :** తెలంగాణ ఉద్యమకారుడు శనివారం హైదరాబాదులో వారిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అయితే నారాయణపేట జిల్లాలో భారత జాగృతి మీ బలోపేతం చేసేందుకు తొందరలోనే నారాయణపేట జిల్లాకు వస్తానని తెలిపారు. అయితే కేసీఆర్ సారథిలో నారాయణపేట జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్ రెడ్డి, ఎస్. రాజేందర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశంలో నిర్వహిస్తానని అన్నారు. ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంబడే సముచితంగా ఇస్తామని అన్నారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలుకావాలి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** రక్తదానం చేసి ప్రాణదాతలుకావాలని డాక్టర్ దామోదర్‌రెడ్డి అన్నారు. డాక్టర్ శివరాం జన్మదినం సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ కేంద్రానికి డాక్టర్ దామోదర్‌రెడ్డి ముఖ్య అతిథిగావిచ్చేసి ప్రారంభించారు. అనంతరం మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిరోజు రక్తం అవసరం ఉండి ఎంతోమంది ఇబ్బందులకు గురవుతున్నారని, గర్భిణీలు ప్రమాదంలో గాయపడినవారు రక్తంకోసం ఇబ్బందులుపడుతున్నారని అన్నారు. రక్తదానం చేయడంవల్ల ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. డాక్టర్ శివరాం మాట్లాడుతూ ప్రతిరక్తపుబొట్టు విలువైనదని, ఏదైన పునరుత్పత్తి చేసుకోవచ్చుగాని రక్తాన్నిమాత్రం ఎవరో ఒకరుదానం చేయడంవల్లే పొందవచ్చన్నారు. 35మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి రక్తదానం చేశారని యువకులు ఈ విధంగా ఉత్సాహంగా రక్తదానంచేయడం అభినందనీయమని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ మూడునెలలకు ఒకసారి నిర్భయంగా వచ్చి రక్తదానం చేయవచ్చని అన్నారు. రక్తదాతలు అందరికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మిత్రఫౌండేషన్ అధ్యక్షులు కుడుముల చంద్రకాంత్‌రెడ్డి, దారమోనిగణేష్, శానవాజ్‌ఖాన్, జగదీష్, మల్లెల్ల మాజీ సర్పంచ్ రాములు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు రేష్మభేగం, ఆస్పత్రి నర్సు సూపరింటెండెంట్‌లు జాయ్‌మేర్సీ, వేద శిరోమణి, సునీత, మైకేల్‌మనోహర్, ల్యాబ్‌టెక్నిషియన్, రహీం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల 'అపూర్వ' సమ్మేళనం

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న డీవీఎం 10 బ్యాచ్ పాఠశాల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న పూర్వ విద్యార్థులు విద్యార్థులు నేర్పిన అధ్యాపకులకు ఘన సన్మానం ఆపదలో ఉన్న స్నేహితులను ఆదుకుందామన్న తోటి స్నేహితులు ఆపదలో ఉన్న స్నేహితులను మనమంతా ఆదుకోవాల్సిన అవసరం ఉందని, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఎప్పటికీ మరువబోమని పలువురు పూర్వ విద్యార్థులు అభిప్రాయపడ్డారు. జిల్లా కేంద్రంలోని దయానంద విద్యా మందిర్ ఉన్నత పాఠశాలలో 2000–2001 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత రజతోత్సవంగా పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని శనివారం పాఠశాలలో నిర్వహించి కలుసుకున్నారు .కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా మే20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని శనివారం మండలకేంద్రంలో సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆర్.శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా ఈనెల 20నజరిగే సార్వత్రికసమ్మెను జయప్రదం చేయాలని కోరారు. బిజెపిప్రభుత్వం అధికారంలోకివచ్చి 11సంవత్సరాలు గడిచిపోతున్న కార్మికులకు ఒరగబెట్టింది ఏమిలేదని ఆవేదన వ్యక్తంచేశారు. 44కార్మిక చట్టాలను రద్దుచేస్తూ నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకొస్తూ ఉన్నచట్టాలను కాలరాయడమేతప్పా మరొకటికాదని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పొదిలరామయ్య, తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ జిల్లా అధ్యక్షులు బత్తులవెంకటేశ్వర్లు, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నమ్మ, కృష్ణవేణి, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు వెల్గొండ రాములు, పార్టీశాఖ కార్యదర్శి చంద్రశేఖర్, రామకృష్ణ, స్వామి, మైబూస్, శ్రీశైలం, శంకర్, రాము, జస్వంత్, మల్లేష్, మహేష్, సుభాష్, చిన్నమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

## గిరిజనులకు ఇందిరాసౌరగిరి జలవికాసపథకం

### కలెక్టర్ బదావత్‌సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** గిరిజన ప్రజల అభివృద్ధికి ఇందిరా సౌరగిరి జలవికాసపథకంతో రూ.12,600 కోట్ల రూపాయలతో ఆరులక్షల ఎకరాల పోడుభూములకు పథకం వర్తింపు చేయడం జరుగుతుందని దీంతో 2.10లక్షల చెంచు, గిరిజన రైతులకు మేలు చేకూరుతుందని ఈ పథకాన్ని మన్ననూరులో మే 18న ముఖ్యమంత్రిచే పథకం ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ తెలిపారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలంలోని జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయంలో ఉద్యానవనశాఖ, భూగర్భజలశాఖ, ఐటిడిఎ, డిటిడిఒ అధికారులతో, జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్‌గోపిడి, జిల్లా ఎస్‌పి వైభవ్‌గైక్వాడ్‌రఘునాథ్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణలతో కలిసి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్, ఇందిరాసౌరగిరి జలవికాసం పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పైలట్‌ప్రాజెక్టుగా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలంలోని మన్ననూరులో ప్రవేశపెట్టనున్న ఇందిరాసౌరగిరి జలవికాస పథకనకు సంబంధించి చేపట్టాల్సిన పనులను అధికారులకు వివరించారు. గిరిజన ప్రజల వ్యవసాయ భూములకు నీటి సౌకర్యంతోపాటు విద్యుత్ సౌకర్యం కల్పించివారి భూములలో ఉద్యానపంటలు సాగుచేసే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టా ఉన్న పోడుభూములు వర్షాధారం ద్వారానే సాగుచేస్తుండటం వలన గిరిజనులు అభివృద్ధికి నోచుకోవడం లేదని, ప్రభుత్వం అట్టి పోడుభూములకు నీటిసౌకర్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో బోరుబావులను తవ్వించి , సౌరవిద్యుత్ సౌకర్యంకల్పించి ఉద్యాన పంటలుసాగుచేసేవిధంగా డ్రిప్‌సిస్టమ్ ఏర్పాటువంటి పనులను ఈపథకం ద్వారా గిరిజన రైతాంగానికి మేలు చేస్తాయని వివరించారు. తక్షణమే భూగర్భజల అధికారులు తమ బృందాలతో గ్రౌండ్‌వాటర్‌సర్వే జరిపి బోరుబావులను సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం మన్ననూరులోని ట్రైబల్‌వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో హెలిప్యాడ్ స్థలాన్ని జిల్లా ఎస్‌పి వైభవ్‌గైక్వాడ్ రఘునాథ్, డిఎఫ్ఓ రోహిత్‌గోపిడి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి పరిశీలించారు. మన్ననూరులో పైలట్‌ప్రాజెక్టుగా ఇందిరా సౌరగిరి జలవికాస పథకంను మే 18న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు , అందుకు చర్యలను యుద్ధప్రాతిపదికన 24గంటలపాటు సంబంధితశాఖలబృందాలు పూర్తిస్థాయిలో సమన్వయంతో పనులు చేపట్టాలని సూచించారు. ఈసమీక్షా సమావేశంలో అచ్చంపేట ఆర్‌డిఓ మాధవి, గ్రౌండ్‌వాటర్ ఏడి దివ్యజ్యోతి, డిటిడిఓ ఫిరంగి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారులు వెంకటేశం, జగన్, డిఆర్‌డిఏపిడి చిన్న ఓబులేసు, మిషన్‌భగీరథ డిఇఇ ఇంద్రాహేమలత, అధికారి జాఫర్, ఆర్‌అండ్‌బిడిఈ జలంధర్, అమ్రాబాద్ తహసీల్దార్ శైలేంద్ర, ఎంపిడిఓ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మహిళలను వేధిస్తే చట్ట ప్రకారం చర్యలు



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** జిల్లా ఎస్‌పి యోగేష్ గౌతమ్, ఐపిఎస్ ఆదేశాల మేరకు ఉట్కూర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనీ సమ్మర్ క్యాంప్ లో ఉన్న విద్యార్థులకు షీ టీమ్ పోలీసులు పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మహిళలను, చిన్నపిల్లలను వేధిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా షీటీమ్ పోలీసులు చెన్నయ్య మాట్లాడుతూ. విద్యార్థులు చదువుతోపాటు క్రీడ ల్లో రాణించాలని తెలిపారు. అందరూ సమ్మర్ క్యాంపు ను సద్వినియోగం చే సుకోవాలని సూచించారు. మహిళలకు షీటీమ్ పోలీసులు అండగా ఉంటార ని మహిళలను, విద్యార్థులను ఎవరైనా వేధించిన, టీమ్ పోలీసులకు నెం: 871 2670398కి సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి చట్ట ప్రకారం వేధించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఒకవేల సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షీటీమ్ పోలీసులు బాలరాజు,జ్యోతి,కవిత,విద్యార్థులుతదితరులు పాల్గొన్నారు.

## దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

### జిల్లా ఎస్‌పి రావుల గిరిధర్



**ప్రజాపక్షం / పెబ్బేరు :** వేసవిలో పిల్లలకు సెలవులు ఉండటంతో చాలా మంది ప్రయాణాలు చేస్తారు ఇదే అదునుగా దొంగలు చేతివాటం చూపిస్తారు. ఊళ్లకు వెళ్లేవారు ఇంటి బయట నిద్రించేవారు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి రావుల గిరిధర్ అన్నారు. పెబ్బేరు పోలీస్‌స్టేషన్లను జిల్లా ఎస్‌పి రావుల గిరిధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిసరాలను తనిఖీ చేసి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలపై వాటి ప్రస్తుత స్థితిగతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా గట్టిగా గస్తీ నిర్వహిస్తూ అరికట్టాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రికార్డుల నిర్వహణ తప్పకుండా నవీకరిస్తూ ఉండాలని, ఎటువంటి పెండెన్సి లేకుండా రికార్డుల నిర్వహణ చేయాలనే సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో రిసెప్షన్ సెంటర్‌ను పరిశీలించి బాధితుల పట్ల వ్యవహరించే తీరును, ఫిర్యదులను పరిష్కరించే తీరును పరిశీలించారు. డయల్ 100, బ్లూ కోర్ట్ సిబ్బంది గ్రామ గ్రామాన సందర్శిస్తూ సమాచార సేకరణలో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరుఎస్ఐ, యుగంధర్‌రెడ్డి, పోలీసుసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం





### ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజాపాలన ప్రభుత్వం పేదలకు అన్నివిధాల అండగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికనందు శనివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులతోపాటు కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా ఎన్నో సంక్షేమపథకాలను ప్రవేశపెట్టి అమలుచేసి పేదలపక్షపాతిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. రాజీవ్‌యువశక్తి ద్వారా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవారికి ఆర్థికసాయం, అర్హులైనపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ఉచితబస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ, ధాన్యం కొనుగోలులో మద్దతుధరతోపాటు బోనస్‌కింద క్వింటాల్‌కు రూ.500 ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు, మండలకాంగ్రెస్ అధ్యక్షులు మిద్దెరాములు, తిరుపతయ్య, అమృత్‌రెడ్డి, మాన్యనాయక్, శేఖర్, వెంకటేష్‌గౌడ్, కృష్ణ, గోవిందునాయక్, భీమయ్య, నజీర్, ముక్తార్, వేణు, జిల్లా వ్యవసాయ మార్కెట్‌కమిటిచైర్మన్ రమణరావు, జిల్లాయూత్ కాంగ్రెస్‌ప్రెసిడెంట్ వినోద్ పాల్గొన్నారు.

**రైతాంగానికి పెద్దపీట**

**నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ప్రజాప్రభుత్వం రైతాంగానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తి గ్రామంలో మండలానికి సంబంధించిన రైతులకు ప్రభుత్వసబ్సిడికింద మంజూరైన స్ప్రింక్లర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి పెద్దపీట వేస్తుందని, ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రుణమాఫీ కింద 24వేలకోట్ల రూపాయలు వెచ్చించిందని, సన్నవడ్లకు బోనస్ ఇచ్చిందని, ఎలాంటి షరతులులేకుండా రైతులనుండి ధాన్యం కొనుగోలు చేసిందని, వ్యవసాయ యాంత్రీకరణను రైతాంగానికి మరింత దగ్గరచేయడానికి ప్రయత్నిస్తుందని, సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రజా ప్రభుత్వం రైతుల అభివృద్ధికోసం కట్టుబడి ఉందని అన్నారు. సం బంధిత అధికారులు, నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, మండల ప్రెసిడెంట్ కోటయ్య, మాజీకౌన్సిలర్స్ , జిల్లాయూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ వినోద్, మండలకాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

**సిఎం సహాయనిధితో పేదలకుమేలు**

సిఎం సహాయనిపథకం ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 24మంది బాధితులకు శనివారం చెక్కులను పంపిణీచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందినవారికి ప్రభుత్వం ఆర్థికంగా చేయూతను అందిస్తుందన్నారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వం

### అదనపు కలెక్టర్ జి. వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం / వీపనగండ్ల:** రైతులు ఆరు కాలం కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని , గ్రామాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా అదనపు కలెక్టర్ జి. వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల పరిధిలోని కల్వరాల, తూముకుంట గ్రామాలలో ఐకేపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వీపనగండ్ల విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో రైతులు కల్లాలలో విక్రయించడానికి ఆరుబోసిన వరి ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు ఆధైర్య పడవద్దని, ప్రతి గింజను కొంటామని, వారం, పది రోజులలో ధాన్యం కొనుగోలును పూర్తి చేస్తామన్నారు. రైతులు కొనుగోలు కేంద్రానికి విక్రయించటానికి తెచ్చే ధాన్యం కొనుగోలును పూర్తి చేస్తామని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రానికి విక్రయించడానికి తెచ్చే ధాన్యం పట్ల నిబంధన ప్రకారమే వడ్లు ఇవ్వాలని, తేమ శాతం సూచించిన విధంగా ఉండాలని రైతులకు సూచించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక లారీ పెట్టాలని ట్రాన్స్ఫోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు.

## వేగవంతంగా ధాన్యం కొనుగోలు

### కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి

**ప్రజాపక్షం / పాన్‌గల్ :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలును వేగవంతంగా చేపట్టాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం పాన్‌గల్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాఆన్యాన్ని నిబంధనల పేరిట రైతులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. తరుగు పేరుతో ఒక సంచికి ఒక కిలో తరుగు తీస్తున్నారని తరుగు తీయకుండా కొనుగోలుచేసి వెంటనే ధాన్యంను తరలించాలన్నారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు నిరీక్షణ తప్పడం లేదని ఆయన అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కాదని కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. సమావేశంలో మాజీ ఎంపిపి శ్రీధర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ నాయక్ ,రైతు బంధు మండల మాజీ కో ఆర్డీనేటర్ వెంకటయ్య నాయుడు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు జ్యోతినందన్ రెడ్డి, మండల నాయకులు వీరసాగర్, చిక్కేపల్లి నర్సింహ, బండి సరోజమ్మ, ప్రవీణ్ రెడ్డి, రాంబాబు నాయక్, హన్మంతు, నవీన్ రెడ్డి, సాయిలు,కొండల్,యాదగిరితదితరులుపాల్గొన్నారు.

## 18న అమ్రాబాద్‌కు ముఖ్యమంత్రి

**ప్రజాపక్షం/అచ్చంపేట :** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలానికి ఈనెల 18న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. అమ్రాబాద్ మండలం మన్ననూరులోని ఫారెస్టుగెస్ట్‌హౌజ్‌లో శనివారం ఆయన సంబంధితశాఖల అధికారులు, విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18న నల్లమలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నారని, అమ్రాబాద్, మాచారం, మన్ననూరు ప్రాంతాల్లో స్థలసేకరణ జరుపుతున్నామని తెలిపారు. రూ.12,600కోట్లతో ఒక బృహత్తర పథకం నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేటలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పోడుభూములకు సౌరవిద్యుత్ తోపాటు తాగునీటి వసతి కల్పించనున్నట్లు తెలిపారు. 6లక్షలభూమి సాగులోకి వచ్చేపథకాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. 2.10లక్షలమంది రైతులకు ఈపథకంతో లబ్ధిపొందనున్నట్లు తెలిపారు. గిరిజనులకు ఆర్థికస్వావలంభన మెరుగుపర్చేపథకాలు ప్రారంభిస్తారని తెలిపారు.

రాష్ట్రప్రభుత్వం ఇందిర సౌరగిరిజల ప్రభుత్వం అమల్లోకి తెస్తుందని ఇది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 18న ప్రారంభించనున్నట్లు తెలిపారు.

## ఘనంగా బీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు





**ప్రజాపక్షం/ ఎర్రవల్లి :** బీచుపల్లి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 14వ తేదీ వరకు ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు జరిపించనున్నారు. శనివారం ఉదయం పంచామృతాభిషేకం, వాస్తుపూజ, వాస్తు హోమం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, బలిహరణం రాత్రికి తెప్పోత్సవంతో బ్రహ్మోత్స వాలు ప్రారంభం అయ్యాయి. 11న పంచామృ తాభిషేకం, స్వామి వారి ఉపనయనం, రాత్రికి ప్రభోత్సవం, 12న మధ్యాహ్నం 12:15 గంటలకు సీతారాముల కళ్యాణం, సాయంత్రం రథంగా హోమం, 9 గంటలకు కుంభం, రాత్రి 10కి రథోత్సవం జరిపించనున్నారు. 13న చౌకి సేవ. రాత్రికి ప్రభోత్వవం, 14న అమృ త స్నానము, పంచామృతాభిషేకం, రాత్రికి పల్లకీసే వతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. అనంతరం ప్రతి శనివారం నె ల రోజుల పాటు భక్తులు స్వామికి పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారని ఆలయ వ్యవస్థాపక వంశీయులు డీకే భరత సింహా రెడ్డి మేనేజర్ రామన్ గౌడ్ అర్చకులు ప్రహ్లాద చారి మారుతి సందీప్ తెలిపారు. శ్రీ బీచుపల్లి ఆంజనేయ స్వామి వానరి చరిత్ర. శ్రీకృష్ణ దేవరాయల వారి గురువులైన వ్యాసరాయల వారు చాలాల ప్రసిద్ధి చెందినవారు. వీరు దినమునకు ఒక ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేయనిదే నిదురించెడి వారు కాదు. వీరు ప్రతిష్ఠ చేసిన ఆంజనేయ స్వామి విగ్రహములకు ఒక ప్రత్యేక లక్షణము ఉన్నాది. విగ్రహము ఇరువైపుల శంఖు, చక్రములు వుండుటవలన వ్యాసరాయుల వారు విగ్రహ ప్రతిష్ఠ చేసారని నిదర్శనము. ఈ ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ 16వ శతాబ్దామున జరిగిందని చారిత్రక పరిశోధకులు నిర్వహించినారు. ఈ ఆంజనేయ స్వామి వారు వ్యాసరాయల వారికి కలలో కనపించి రేపు ఉదయము నన్ను దర్శించుటకు ముందుగా ఎవరు వస్తారో వారినే నాకు ప్రతి రోజూ పూజలు చేయటకు నియమించమని ఆదేశించారు. మరుసటి ఉదయము దర్శనమునకు మొదట ఒక పశువుల కాపరి పశువులను మేపుతూ అటుగా వచ్చి స్వామి వారిని దర్శించుకున్నాడు. వ్యాసరాయల వారు అతనినే పూజారిగా ని యమించెను. అతడు బోయ కులస్తుడు. అతని పేరు బీచుపల్లి . రాను రాను ఈ దేవస్థానమునకు బీచుపల్లి రాముడని పేరు వచ్చినది. వ్యాసరాయలచే ప్రతిష్ఠ జరిగిన బీచుపల్లి ఆంజనేయ స్వామి వారిని గద్వాల సంస్థానపు రాజులు కూడా ప్రతి దినము దర్శించుకునే వారని చరిత్ర చెబుతుంది.

## ఆపరేషన్ సిందూర్ విజయవంతం పట్ల ర్యాలీ




**ప్రజాపక్షం/దేవరకొండ :** ఆపరేషన్ సిందూర్ విజయవంతం పట్ల శనివారం దేవరకొండ పట్టణంలో డిండి చౌరస్తా నుండి అంబేద్కర్ విగ్రహం వద్దకు ర్యాలీ నిర్వహించారు. దేశం కోసం వీర మరణం పొందిన మురళి నాయక్‌కు వీర జవాన్లకు జోహార్లు అర్పిస్తూ భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్‌విటి, జక్క శ్రీనయ్య, సుజిత్, క్రాంతి, నరసింహా, కోటి, పాపానాయక్, పాండు, రాంసింగ్, శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లాలో రబీ సీజన్‌లో ఇప్పటివరకు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ తెలిపారు. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 5.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం లక్ష్యమని ఇంకా లక్షన్నర టన్నులు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. సుమారు 80శాతం ధాన్యం కొనుగోలు పూర్తయిందని, రైతులకు నగదు చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. అదేవిధంగా ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కస్టమ్ మిల్లింగ్ 98శాతం పూర్తయిందని, రెండు శాతం మాత్రమే మిగిలి ఉందన్నారు. సీఎంఆర్ బియ్యం పౌర సరఫరాల శాఖ దిగుమతి చేసుకుందన్నారు.

## నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు నెల జీతం

### భారత్ యుద్ధ నీతిని పాటిస్తుంది: గుత్తా సుఖేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/ నల్లగొండ ప్రతినిధి :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు నా నెల జీతం నేషనల్ డిఫన్స్ ఫండ్‌కి ప్రకటిస్తున్నానని శాసన మండలి సభ్యులు అందరూ కూడా నేషనల్ డిఫన్స్ ఫండ్ కి విరాళం ప్రకటించాలని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కొరారు. భారత్ పాకిస్థాన్ తో వీరోచిత పోరాటం చేస్తూ యుద్ధ నీతిని పాటిస్తూ దాడులు చేస్తోందన్నారు. శనివారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ పాకిస్థాన్ తో భారత్ వీరోచిత పోరాటం చేయడంతో పాటు భారత్ యుద్ధ నీతిని పాటిస్తూ దాడులు చేస్తోందని తెలిపారు.ఉగ్రవాదులు ఉన్న ప్రాంతాలపైనే భారతదేశం దాడులు చేస్తోంది. కానీ పాకిస్థాన్ మాత్రం భారత్ పౌరులపై దాడి చేస్తోందని పాక్ యుద్ధ నీతికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోందన్నారు. పీఓకే స్వాధీనం చేసుకుంటే ఇలాంటి ఘటనలు జరగవని ఈ సమయంలో భారత్ పౌరులు అందరూ దేశానికి మద్దతుగా నిలబడాలన్నారు.వీర జవాన్ మురళి నాయక్ మృతి చాలా బాధాకరంఅని ఈ సందర్భంగా మురళి నాయక్ కి నివాళులర్పిస్తు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## గట్టుప్పలను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తా

### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/ చండూరు గట్టుప్పల :** రానున్న రోజుల్లో గట్టుప్పల మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం గట్టుప్పల మండల కేంద్రంలో 1 కోటి 43 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శంఖుస్థాపన చేశారు. అనంతరం 25లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన గట్టుప్పల మండలంలో అన్ని వసతులతో కూడిన అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయుటకు కృషి చేస్తానని అన్నారు. కాంగ్రేస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, గట్టుప్పల తహసీల్దార్ రాములు , గట్టుప్పల మండల కాంగ్రేస్ అధ్యక్షుడు నామని జగన్నాథం , సిపిఐ గట్టుప్పల మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్ , పలువురు అధికారులు పాల్గొన్నారు.

## మూడు నెలల నుండి కూలీలకు వేతనాలు రావడం లేదు

### ఉపాధిహామీ కూలీలతో బికెఎంయు నాయకులు



**ప్రజాపక్షం/డిండి :** డిండి మండలం సింగరాజుపల్లి గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం దేవరకొండ నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు ఎలిమినేటి హుస్సేన్, మొగిల్ల వెంగలయ్యలు మాట్లాడుతూ మూడు నెలల నుండి కూలీలకు వేతనాలు రావడం లేదని, పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు లేక ఉపాధి హామీ కూలీలు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. పని ప్రదేశాలలో మంచి నీరు, టెంట్ సౌకర్యం, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలలకు పారా, గడ్డపార, తట్ట పని ముట్లు ఇవ్వాలని, పని దినాలు 200 రోజులు కల్పించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజువారివేతనం 700 ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. పని ప్రదేశాలలో ఫోటో స్కానింగ్ విధానాన్ని ఎత్తివేయాలని, నాలుగు నెలలుగా ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు రావడం లేదని, పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఉపాధి కూలీలకు పెండింగ్ కూలీని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో దేవరకొండ నియోజకవర్గ గిరిజన సమాఖ్య నాయకులు రమావత్ దేవిలాల్, ఉపాధి హామీ కూలీలు కడారి వెంకటయ, జంతుక బాలయ్య, నిరంజన్, వెంకులు, బాల రాములమ్మ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు



**ప్రజాపక్షం/నల్లగొండ :** భూ భారతి చట్టం 2025 అమలులో భాగంగా అర్హులైన సర్వేయర్ల కు శిక్షణ ఇచ్చేందుకుగాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సర్వేయర్ల శిక్షణ కోసం ఈ నెల 17 లోగా సమీపంలోని మీ సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఎంపికైన సర్వేయర్లకు ఈనెల 26 నుండి జూలై 26 వరకు (50 పని దినాలు) శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. రెవెన్యూ పరిపాలన కు తోడుగా, సర్వే మరియు ల్యాండ్ రికార్డ్స్ శాఖ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5,000 మంది సర్వేయర్లకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో శిక్షణ ఇచ్చి సర్వేయర్లను నియమించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి (భూమి హక్కుల రికార్డు చట్టం 2025) ద్వారా భూమి సంబంధిత సేవలను ప్రజలకు కల్పించి వారి భూ సమస్యలను పరిష్కరించే ఉద్దేశంతో లైసెన్సుడ్ సర్వేయర్లను నియమించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అందువల్ల జిల్లాలోని సర్వేయర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ,ఈనెల 17 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

# వేగవంతంగా భూసేకరణ బిల్లుల చెల్లింపు

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్ కింద భూసేకరణ పూర్తయినందున బిల్లుల చెల్లింపు, తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులపై మిర్యాలగూడ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డిలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించిన భూసేకరణ పేపర్ నోటిఫికేషన్ ఇదివరకే జారీ చేయడం జరిగిందని, దానికి సంబంధించిన చెల్లింపులు చేయాల్సి ఉన్నందున వీటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. అదేవిదంగా విద్యుత్ చార్జీలపై సైతం సమీక్షించి పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. నిడమనూరు చెరువుకు నాగార్జున సాగర్ మెయిన్ కెనాల్ నుంచి నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా నిడమనూరు ట్యాంకుకు ఓటీ ద్వారా నీళ్లు నింపేందుకు ప్రణాళిక రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మిర్యాలగూడ నియోజకవర్గానికి సంబందించి దున్నపోతుల గండి, పోతుల పాలెం, వీర్లపాలెం భూసేకరణతోపాటు రెండు లిఫ్టులకు ఇదివరకే ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తయినందున తదుపరి ప్రక్రియపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. అదేవిధంగా మిగిలిన లిఫ్ట్ ఇరిగేషన్ భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డిలు మాట్లాడుతూ తమతమ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న లిఫ్ట్ పనులను, భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, ఇరిగేషన్ ఎస్ఈ మల్లిఖార్జున్, ఈఈ కరుణాకర్, డీఈ కేశవత్ తదితరులు పాల్గొన్నారు.



## భారత సైన్యానికి విజయం వరించాలి

### టిపిసిసి రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/మునుగోడు:** పాకిస్తాన్‌పై యుద్ధం చేస్తున్న భరత్ సైన్యం విజయం సాధించాలని ఆ భగవంతుని ఆశీర్వాదంతో విజయ ప్రాప్తి కలుగాలని శ్రీశ్రీశ్రీ కేదారేశ్వర స్వామి ఆలయంలో కోరుకున్నట్లు టిపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. శనివారం నల్లగొండ జిల్లా మునుగోడు మండల పరిధిలోని కోతులారం గ్రామంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ కేదారేశ్వర స్వామి నాభిశీల బొడ్రాయి తృతీయ బ్రహ్మోత్సవాల కార్యక్రమానికి ఆలయ చైర్మన్, బీసీ జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆహ్వానం మేరకు టిపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ముందుగా డప్పు చప్పులతో కోలాటాల బృందంతో వారికి స్వాగతం పలుకుతూ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ 400ఏండ్ల చరిత్ర కల్గిన శ్రీశ్రీశ్రీ కేదారేశ్వర స్వామి పూరాతన ఆలయంలో గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని, అలాగే మన దేశం కోసం పాక్ తో యుద్ధం చేస్తున్న సైనిక దళానికి మనో ధైర్యాన్ని కల్పించాలని, వారికి విజయం సిద్ధించాలని భగవంతుని కోరుతున్నానన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఉమ్మడి నల్లగొండ జిల్లా చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి పున్న కైలాష్ నేత, ఒట్టికోటిఒట్టికోటి శేఖర్, జాదుల సత్యనారాయణ,కాంగ్రేస్ పార్టి నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులు అరెస్టు

### ఒక కిలో 250 గ్రాముల గంజాయి,రెండు సెల్‌ఫోన్‌ల సీజ్

### డిఎస్‌పి కె.పార్ధసారధి వెల్లడి



**ప్రజాపక్షం/చివ్వెంల:** గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను చివ్వెంల మండల పోలీసులు అరెస్టు చేశారు. వారి నుండి ఒక కెజీ 250 గ్రాముల గంజాయి,రెండు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను శనివారం సూర్యాపేట డిఎస్‌పి కె. పార్ధసారధి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. సూర్యాపేట ఖమ్మం రోడ్డు శివారులోని ఇండియన్ పెట్రోల్‌బంక్ వద్ద ఉదయం 6:15 గంటలకు చివ్వెంల ఎస్ఐ వి.మహేశ్వర్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండడగా ఒక బ్యాగ్‌తో అనుమానస్పదంగా ఇద్దరు వ్యక్తులు ఖమ్మం రోడ్డు వైపు వస్తుండగా వారిని అడ్డుకుని తనికీ చేశారు. అందులో గంజాయి ఉండడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బస్తీ జిల్లా లోని గౌర తానా లోని బల్వాకు చెందిన మహేందర్‌నాథ్ నిశాద్,తమిళనాడు రాష్ట్రం లోని మామిళ్లపురం సునామినగర్ దేవనేరి కుప్పం కు చెందిన మహ్మద్ హబీబ్ ప్రస్తుత వాసం రైలుపేట గుంటూర్ వీరిరువురు గత కొంతకాలంగా ఒరిస్సా రాష్ట్రంలోని బేజా ప్రాంతం నుండి గంజాయిని కొనుగోలు చేస్తూ సూర్యాపేటలో అమ్మకాలు జరుపుతున్నారు. గతంలో సూర్యాపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అమర్‌నాథ్ నిశాద్‌పై కేసు నమోదు అయ్యింది. పటుట్బడిన గంజాయి విలువ 15 వేలు ఉంటుందని చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రాజశేఖర్,ఎస్ఐ మహేశ్వర్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిపిఐ నిర్మాణానికి కృషి చేయాలి



**ప్రజాపక్షం/మర్రిగూడ:** భారత కమ్యూనిస్టు పార్టీ బలపడితేనే పేద,మధ్యతరగతి,బడుగు,బలహీన వర్గాలకు ప్రయోజనం జరుగుతుందని సిపిఐ మండల కార్యదర్శి ఈదుల భిక్షం రెడ్డి అన్నారు. సిపిఐ కొండూరు గ్రామ శాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కార్యకర్తలు పార్టీ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండల కార్యవర్గ సభ్యులు ఆకుల రఘుమయ్య పటేల్, కౌన్సిల్ సభ్యులు ఆకుల వెంకట్రామ్ పటేల్,గ్రామ నాయకులు వద్దేమాను వెంకటయ్య, జరుపుల రామరాజు,ఈద మారయ్య, బడేటి పెద్దయ్య, ఉప్పునూతల సత్తయ్య,శ్రీమతి మొక్కరోజు బిక్షపమ్మ,నడింపల్లి సత్తయ్య, వద్దేమాను రాములు, జరుపుల కిరణ్ నాయక్,అంబోతు నవిన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.ఈ మహాసభలో సిపిఐ గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా వద్దెమాను వెంకటయ్య,సహాయ కార్యదర్శిగా జరుపుల రామరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**వట్టిపల్లి గ్రామ శాఖ కమిటీ**

వట్టిపల్లి గ్రామ శాఖ సమావేశం వేముల సత్తయ్య అధ్యక్షతన జరిగినది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ మండల కార్యదర్శి ఈదుల బిక్షం రెడ్డి గారు హాజరై శాఖ బలోపితం స్థానిక ఎలక్షన్లో పోరుకు మనం సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సహాయ కార్యదర్శి బూడిద సురేష్, కార్యవర్గ సభ్యులు కొండ్రెడ్డి గిరి పాల్గొని నూతన గ్రామ శాఖ కార్యదర్శిగా వేముల సత్తయ్య,సహాయ కార్యదర్శి పందుల మహేష్ గౌడ్ ను ఎన్నుకున్నారు.

## సుందరీమణుల ఆతిథ్యానికి ముస్తాబు

### 12న నాగార్జునసాగర్‌కు సుందరీమణుల రాక



**ప్రజాపక్షం/నందికొండ:** మే7వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరుగనున్న 72 వ మిస్ వరల్డ్ పోటీలకుహైదరాబాద్ వేదికైన సందర్భంగా ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ లోని విజవిహార్ బుద్ద వనం అన్ని హంగులను పూర్తి చేసుకుని సర్వం సిద్ధమైవారిఆతిథ్యానికిఎదురు చూస్తుంది. హైదరాబాదులో అందాల పోటీలు బుధవారం ప్రారంభమైన సందర్భంగా విజయవిహార్ నవీనీ కరణ పనులు శరవేగంగాపూర్తయ్యాయి.హైదరాబాదులో జరుగుతు న్నపోటీలకు 140 దేశా నుండి వచ్చిన సుందరీమణులు మే 12 న నాగార్జున సాగర్‌ను సందర్శించనున్నారు. భారతదేశం నుంచి మిస్ ఇండియా నందిని గుప్తా ఈ పోటీలలో పాల్గొననున్నారు దీంతో నాగార్జున సాగర్‌లో విడిది చేయడానికి అంతర్జాతీయ స్థాయి లో విజయవిహార్ లోని 38 గదులను ఐదు కోట్ల రూపాయలతో ఆధునీకరణ చేశారు.ప్రస్తుత మిస్ వరల్డ్ చెక్ రిపబ్లిక్ కు చెందినక్రిస్టినా పిస్కోవా ఈఈవెంట్ ముగింపులో ఎన్నికైన వారిని తన వారసురాలిగా పట్టాభిషేకం చేయనున్నారు. ఇది గ్లోబల్ ఈవెంట్ కావడంతో పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తోంది. వారు హైదరాబాదులో బయలుదేరి నాగార్జున సాగర్ చేరుకుని మళ్లీ తిరిగి హైదరాబాద్ వెళ్ళే వరకు ఏటువంటి అవాంతరాలు అవాంఛనీయ సంఘటనలు, జరగకుండా 1200 నుంచి 1500 మంది పోలీసులతో పూర్తి కట్టుదిట్టమైన రూట్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

## స్వర్ణం మల్లిక నియామకం పట్ల హర్షం



**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి:** జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం కేంద్రానికి చెందిన సంఘం స్వర్ణ మల్లిక వారం రోజుల క్రీతం వెలువడిన ఫలితాల్లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైంది. జూనియర్ సివిల్ జడ్జి నియామక ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 44 మంది ఎంపిక కాగా అందులో జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రానికి చెందిన సీనియర్ న్యాయవాది గట్టు సురేష్ కూతురు స్వర్ణ మల్లిక కూడా ఎన్నిక కావడం చాలా గొప్ప విషయం సందర్భంగా శనివారం న్యాయవాది గట్టు సురేష్ ఇంటికి వెళ్లిన సీపీఐ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు. బిఆర్ఎస్ నాయకులు పచ్చర్ల శ్రీనివాసులు, లెక్షరర్లు గంట పరేష్ బాబు, గుడు సాబ్, జిమ్ ట్రైనర్ పాషా, అంతంపల్లి రేషన్ డీలర్ భీమన్న, సత్యం తదితరులు గట్టు మండలానికి గద్వాల జిల్లాకు ఇంతటి ఘన కీర్తి సన్మానించి స్వీట్లు, పంచి తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

## సర్వేయర్ల పోస్ట్‌కు దరఖాస్తు

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** పాలిటెక్నిక్ లో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ పరీక్ష కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ ఈ నెల 13 తేదీన నిర్వహించబడుతుందని పరీక్షల నిర్వహణ కోఆర్డినేటర్ రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, గద్వాల పట్టణంలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయని ఆయన తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం 11:00 గంటలలోపు తప్పనిసరిగా హాజరుకావాలి ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోనికి ప్రవేక్షించడానికి అనుమతించబడదని తెలియజేశారు. పరీక్షా సమయంలో కింద నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని పరీక్ష పూర్తయ్యే వరకు (మధ్యాహ్నం 1:30) ఎవరూ హాల్‌ను విడిచిపోవద్దని, ఉదయం 11:00 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు ఎవరూ టాయిలెట్‌కు వెళ్లేందుకు అనుమతి ఇవ్వబడదు క్యాలిక్యులేటర్‌లు, గణిత/భౌతిక పట్టికలు, తెల్ల కాగితాలు లేదా ఎలక్ట్రానిక్ పరికరాలు వంటివి తీసుకురావడం ఉపయోగించడం నిషేధించబడింది ప్రశ్నాపత్రిక బుక్‌లెట్ చివరలో ఇచ్చిన రెండు ఖాళీ తెల్ల పేజీల పై మాత్రమే రఫ్ వర్క్ చేయాలి. అభ్యర్థులు ఈ నిబంధనలను పాటిస్తూ సమయానికి పరీక్షకు హాజరు కావాలన్నారు. గద్వాల పట్టణంలోని గోనుపాడు ప్రభుత్వ పాలటెక్నిక్ కళాశాలలో 400 మంది, ఎం ఏ ఎల్ డి డిగ్రీ కళాశాలలో 700, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 280 ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, సుంకులమ్మ నెట్టు పాత బాస్ స్టేషన్ వద్ద గల సెంటర్ లో 400 మంది మొత్తం 1780 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు ఆయన ప్రకటనలు తెలియజేశారు.

## గిరిజన తండాల్లో బిటిరోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని ధర్మారం కర్వల్ గడ్డ తండా నుండి బిల్యానాయక్ తండ వరకు బీటీ రోడ్డు పనులకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శనివారం శంకుస్థాపన చేశారు. ప్రతి తండాకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడం ఆయా తండా వాసులు ప్రయాణం సులువు అవుతుందని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని నాగాయపల్లి గ్రామంలో ధారవత్ రామ్ కోటి తండ్రీ గుండె పోటుతో మృతిచెందగా అతడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందచేసి, గోపాలపురం గ్రామంలో నిరుపేద సొంత ఇల్లు లేని కుటుంబానికి చెందిన భూసం మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. వారికి ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, నాయకులు ధనావత్ భాస్కర్ నాయక్, ఐలయ్య, మోహన్ బాబు నాయక్ పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

### నూతన వాహన చట్టాల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### సూర్యాపేట జిల్లా ఎస్.పి కె.నరసింహ




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట జిల్లా పోలీస్‌శాఖ రోడ్డు భద్రతా నియమాల పట్ల చాలా పటిష్టంగా పనిచేస్తుందని,ప్రతిరోజు వాహనాల తనికీలు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నామని జిల్లా ఎస్.పి కె.నరసింహ ఐపిఎస్ తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుండి సూర్యాపేట జిల్లా పోలీసులు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సూర్యాపేట టౌన్,సూర్యాపేట రూరల్ పరిధిలో పట్టుబడిన 73 మంది మైనర్ లను వారి తల్లిదండ్రులతో శనివారం సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వాహన చట్టాలు,రోడ్డుభద్రత,ప్రభుత్వం అమలులోకి తెచ్చిన కొత్త నిబంధనలు,జరిమానా,శిక్షలు,వాహన యజమానులపై తల్లిదండ్రులపై చర్యలు వంటి ప్రధాన అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జిల్లా ఎస్.పి కె.నరసింహ ఐపిఎస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మైనర్ బాలురకు,వారి తల్లిదండ్రులకు,వాహన యజమానులకు నూతన వాహన చట్టాలు వాటి పరిణామాలు గురించి వివరించారు. రోడ్డు భద్రత ప్రమాదాల నివారణలో భాగంగా ఈనెల 5వ తేదీ నుండి గత వారం రోజులుగా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో,ముఖ్య పట్టణాల్లో మైనర్‌ల డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగిండం జరిగిందని తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో వాహనాలు నడుపుతున్న 239 మంది పిల్లలను గుర్తించి ఆయా వాహనాలను సీజ్ చేసి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. సూర్యాపేట టౌన్,రూరల్ లో పట్టుబడిన 73 మంది పిల్లలను వారి తల్లిదండ్రులను,వాహన యజమానులను సూర్యాపేట టౌన్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని వారికి వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. పిల్లలను ఆదిలోనే మంచి లక్షణాలు అలవరుస్తూ పెంచాలని, ఎవరైనా, చెడుప్రవర్తన కలిగి ఉంటే వారికి కౌన్సిలింగ్ నిర్వహించి లేదా చట్టపరిధిలోఅ వగాహన కల్పిస్తూ మంచి మార్గం నడిచేలా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాహన నిబంధనల ప్రకారం మైనర్ డ్రైవింగ్ చేస్తూ ఒక్కసారి పట్టుబడితే అతనికి 25 సంవత్సరాల వయస్సు వచ్చేంత వరకు డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వడం కుదరదని తెలియజేశారు. అలాగే గరిష్టంగా 25వేల రూపాయల జరిమానా విధించి తల్లిదండ్రులపై,వాహన యజమానులపై చర్యలు తీసుకుంటూ జైలుకు పంపడం లాంటివి ఈ నూతన చట్టం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తుందని తెలియజేశారు. వాహన చట్టాల నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎవరైనా వాహనాలు నడిపితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట సబ్ డివిజన్ డిఎస్‌పి పార్ధసారధి,సూర్యాపేట పట్టణ సీఐ వీర రాఘవులు,రూరల్ సీఐ రాజశేఖర్,ఎస్‌ఐలు ఆంజనేయులు,బాలునాయక్,సాయిరాం,ఏడుకొండలు, ప్రవీణ్‌కుమార్,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫోకస్

# క్రీడ

## ప్రపంచ రికార్డులు..

పురుషుల విభాగం: 4 × 100 మీటర్ల రిలేలో జమైకా జట్టు 36.84 సెకన్లలో ఈ రికార్డును నెలకొల్పింది. ఈ విజయాన్ని 2012 లండన్ ఒలింపిక్స్‌లో నెస్టా కార్టర్, మైఖేల్ ఫ్రాటర్, యోహాన్ బ్లేక్, ఉసేన్ బోల్ట్ కలిసి సాధించారు. 4 × 400 మీటర్ల రిలేలో అమెరికా జట్టు 2:54.29 నిమిషాలతో రికార్డును నెలకొల్పింది. ఈ విజయాన్ని 1993లో స్టుట్గార్ట్‌లో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సాధించారు. మహిళల విభాగం: 4 × 100 మీటర్ల రిలేip అమెరికా జట్టు 40.82 సెకన్లలో ప్రపంచ రికార్డును నెలకొల్పింది. ఈ విజయాన్ని 2012 లండన్ ఒలింపిక్స్‌లో టియానా మాడిసన్, అలిసన్ ఫెలిక్స్, బియాంక నైట్, కార్మెలిటా జెటర్ కలిసి సాధించారు. 4 × 400 మీటర్ల రిలేలో అప్పటి సోవియట్ యూనియన్ జట్టు 3:15.17 నిమిషాల్లో ఈ రికార్డును నెలకొల్పింది. ఈ విజయాన్ని 1988 సియోల్ ఒలింపిక్స్‌లో సాధించారు. 4 × 400 మీటర్ల మిక్స్‌డ్ రిలేలో అమెరికా జట్టు 3:07.41 నిమిషాల్లో ఈ రికార్డును నెలకొల్పింది. ఇది 2024 పారిస్ ఒలింపిక్స్‌లో నమోదైంది.



## సమష్టి కృషికి నిదర్శనం...
# అథ్లెటిక్స్ రిలే పోటీలు




చైనాలోని గ్వాంగ్‌జౌలో శనివారం (ఈనెల 10వ తేదీ) ప్రారంభమైన 2025 ప్రపంచ అథ్లెటిక్స్ రిలే చాంపియన్‌షిప్స్ ఒక జట్టు సమష్టి కృషికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఆదివారం (మే 11వ తేదీ)తో ముగిసే ఈ క్రీడా పోటీలను నిర్వహించడం ఇది ఏడోసారి. చైనా తొలిసారి పోటీలకు ఆతిథ్యమిస్తున్నది. ఈ క్రీడా సంబరానికి గ్వాంగ్‌డాంగ్ ఒలింపిక్ స్టేడియం ప్రధాన వేదికగా మారింది. మిక్స్‌డ్ 4 × 100 మీటర్ల ఈవెంట్‌ను మొదటిసారి పోటీల జాబితాలో చేర్చారు. నిజానికి 2023 మే 13–14 తేదీలలో జరగాల్సినప్రపంచ అథ్లెటిక్స్ రిలేలకు ఆతిథ్యం ఇచ్చే బాధ్యతను గ్వాంగ్‌జౌకు అప్పగించారు. కానీ కొవిడ్ 19 మహమ్మారి కారణంగా ఛాంపియన్‌షిప్స్‌ను 2025కి వాయిదా వేశారు. ఈ ఏడాది జరిగే ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌కు ఈ ఈవెంట్ ఒక అర్హతా పోటీగా ఉపయోగపడుతుంది. ఇందులోని ప్రతి ఈవెంట్‌లో టాప్ 14 జట్లు (మిక్స్‌డ్ 4 x 100 మీటర్లు మినహా) ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌కు అర్హత సాధిస్తాయి. పురుషులు, మహిళల విభాగాల్లో మిక్స్‌డ్ 4 × 100 మీటర్లు, 4 × 400 మీటర్లు ఈవెంట్స్‌లో ఈసారి పోటీలు జరుగుతాయి. అథ్లెటిక్స్‌లో రిలే పోటీలు అనేవి నాలుగు సభ్యుల బృందాలు ఒక నిర్దిష్ట దూరాన్ని పరుగెత్తి, బాటన్‌ను ఒకరికి ఒకరు అందజేస్తూ గమ్యాన్ని చేరే పోటీలు. ఈ పోటీల్లో సమన్వయం, వేగం, బాటన్ మార్పు నైపుణ్యం ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. 4 × 100 మీటర్ల రిలేలో ప్రతి రన్నర్ 100 మీటర్లు పరుగెత్తుతాడు. బాటన్‌ను 20 మీటర్ల మార్పు ప్రాంతంలో మాత్రమే అందజేయాలి. ఈ పోటీ పూర్తిగా లైన్లలో జరుగుతుంది. 4 × 400 మీటర్ల రిలేలో ప్రతి రన్నర్ 400 మీటర్లు పరుగెత్తుతాడు. మొదటి లెగ్ పూర్తిగా లైన్లలో, రెండవ లెగ్ మొదటి 100 మీటర్ల వరకు లైన్లలో, అనంతరం రన్నర్లు లోపలి లైన్‌కు చేరవచ్చు. మిక్స్‌డ్ 4 × 400 మీటర్ల రిలేను పురుషులు, మహిళలు కలిసి పాల్గొనే పోటీ. ప్రతి బృందం రెండు పురుషులు, రెండు మహిళలతో ఉంటుంది. పురుషుడు, మహిళ, పురుషుడు, మహిళ సీక్వెన్స్‌లో రిలే కొనసాగుతుంది. కాగా, మెడ్లీ రిలేలు అనేవి విభిన్న దూరాల కలయికతో కూడిన పోటీలు. ఉదాహరణకు, స్ప్రింట్ మెడ్లీ (100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు) లేదా డిస్టెన్స్ మెడ్లీ (1200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 1600 మీటర్లు) వంటి ఈవెంట్లు. బాటన్‌ను 20 మీటర్ల మార్పు ప్రాంతంలో మాత్రమే అందజేయాలి. బాటన్‌ను డ్రాప్ చేయడాన్ని అనుమతించరు.డ్రాప్ చేసిన రన్నరే దానిని తిరిగి తీసుకోవాలి. బాటన్ మార్పు, బాటన్‌ను డ్రాప్ చేసి తిరిగి తీసుకోకపోవడం, ఇతర రన్నర్లను అడ్డుకోవడం లేదా మార్గాన్ని తప్పించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై అనర్హత వేటు పడుతుంది. జట్టులోని ఏ ఒక్కరు పొరపాటు చేసినా, జట్టు మొత్తం డిస్‌క్వాలిఫై కావాల్సి వస్తుంది. అందుకే, జట్టులోని ప్రతి ఒక్కరూ ఎంతో అప్రమత్తతతో వ్యవహరిస్తారు. ఈ రిలే పోటీలకు నిర్దిష్టమైన వ్యూహాన్ని అనుసరిస్తారు. ఉదాహరణకు 4 × 100 మీటర్ల రిలే: 1వ రన్నర్ మంచి స్టార్టింగ్ నైపుణ్యం కలవారై ఉండాలి. 2వ రన్నర్ దీర్ఘ స్ట్రెయిట్ లెగ్‌ను కవర్ చేయగల శక్తివంతులై ఉండాలి. 3వ రన్నర్‌కు కర్వ్‌లో నైపుణ్యం అవసరం. 4వ రన్నర్ (ఆంకర్) బలమైన ముగింపు నైపుణ్యం కలవారై ఉండాలి. 4 × 400 మీటర్ల రిలేలో 1వ రన్నర్‌తో శక్తివంతమైన ప్రారంభం, 2వ రన్నర్‌తో వేగంగా స్థానం కోసం పోరాడటం, 3వ రన్నర్‌తో స్థిరమైన ప్రదర్శన, 4వ రన్నర్ (ఆంకర్)తో ఆధిక్యాన్ని నిలుపుకోవడం లేదా గ్యాప్‌ను తగ్గించడం జట్ల ప్రధాన వ్యూహంగా ఉంటుంది. అమెరికాలో జరిగే పెన్ రిలేస్ ప్రముఖ రిలే పోటీగా కొనసాగుతున్నది. హోల్మెన్‌కోల్లస్టాఫెట్టెన్ అనేది నార్వేలో జరిగే ప్రపంచంలోనే అతిపెద్ద రిలే పోటీ. రిలే పోటీలు వ్యక్తిగత నైపుణ్యం, బృంద సమన్వయాన్ని సమ్మిళితం చేస్తాయి. ఈ లక్షణం అథ్లెటిక్స్‌లో రిలేలను అత్యంత ఆసక్తికరమైన ఈవెంట్లుగా మారుస్తుంది.

## ఫ్రాన్స్‌లో
# మోటార్ రేస్ సంబరం





అధికారికంగా 'మిచెలిన్'గా పిలిచే 2025 ఫ్రెంచ్ మోటార్‌సైకిల్ గ్రాండ్ ప్రీ తుది రేస్ సంబరాలు ఆదివారం జరగనున్నాయి. ఫ్రాన్స్‌లోని లె మాన్స్ (Le Mans) లోని బుగట్టి సర్క్యూట్‌లో జరుగుతోంది. ఇది 2025 మోటో జిపి సీజన్‌లో ఆరో రౌండ్‌గా ఉంటుంది. భారత కాలమానం ప్రకారం ప్రధాన రేసుల షెడ్యూల్ మే 11, ఆదివారం, మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభవుతుంది. అనంతరం రేస్ 2 మధ్యాహ్నం 3:45 గంటలకు జరుగుతుంది. ఇక ప్రధాన రేస్‌సాయంత్రం 5:30కు ఉంటుంది. శనివారం జరిగిన క్వాలిఫైయింగ్ రేస్‌లో ఫ్రాన్స్‌కు చెందిన ఫాబియో క్వార్టరారో1'29.324 సెకన్లతో పోల్ పొజిషన్ సాధించాడు. మార్క్ మార్కెస్ రెండవ స్థానంలో, అతని సోదరుడు అలెక్స్ మార్కెస్ మూడవ స్థానంలో నిలిచారు. కాగా, ఈ రేసులను ప్రసారం చేసే ఛానల్స్ గురించి స్పష్టమైన సమాచారం లభించలేదు. అయితే, మోటోజిపి అధికారిక వెబ్‌సైట్ లేదా వారి యాప్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించవచ్చు. ఈ రేస్‌కు ముందు, అలెక్స్ మార్కెస్ 2025 మోటోజిపి చాంపియన్‌షిప్‌లో అగ్రస్థానంలో ఉన్నాడు. అతని సోదరుడు మార్క్ మార్కెస్ కేవలం ఒక పాయింట్ తేడాతో రెండవ స్థానంలో ఉన్నాడు. ఫ్రాన్సెస్కో బాగ్నాయ మూడవ స్థానంలో నిలిచాడు. కాగా, ఫ్రెంచ్ గ్రాండ్ ప్రీ ఫలితాలు చాంపియన్‌షిప్ పాయింట్లపై కీలక ప్రభావం చూపే అవకాశం ఉంది.

# హాకీ స్టిక్‌ను పోలిన తొలితరం బ్యాట్

క్రికెట్ ఎన్నో శతాబ్దాలుగా ఆడుతున్నారన్న వాదన ఉన్నప్పటికీ, మొట్టమొదటిసారి ఈ క్రీడ గురించిన ప్రస్తావన 1624లో రికార్డయింది. ఆరంభంలో క్రికెట్ బ్యాట్ ఒక కర్ర మాదిరి ఉండేది. తొలి తరంలో హాకీ స్టిక్‌ను పోలిన బ్యాట్‌తో క్రికెట్ ఆడేవారు. 1729లో ఉపయోగించిన ఒక బ్యాట్‌ను లండన్‌లోని ఓవల్ మైదానం, సాంథమ్ రూమ్‌లో భద్రపరిచారు. ఆ తర్వాతి కాలంలో వాడిన కొన్ని బ్యాట్లు కూడా అక్కడ ఉన్నాయి. 1770 దశకంలో క్రికెట్ నిబంధనలకు ఊక రూపం వచ్చింది. ఆ తర్వాత ప్రస్తుతం ఆడుతున్న క్రికెట్ బ్యాట్ రూపుదిద్దుకుంది.




## 8 బంతుల ఓవర్..
# 12 రోజుల మ్యాచ్!



టెస్టు మ్యాచ్ ఐదు రోజులు జరుగుతుందని అందరికీ తెలుసు. ఇంతకు ముందు, ఒక రోజు విశ్రాంతితో కలిపి ఆరు రోజుల జరిగేది. అయితే, 1939లో దర్బన్ వేదికగా దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ జట్ల మధ్య టెస్టు మ్యాచ్ 12 రోజులు జరిగింది. ఆ మ్యాచ్‌లో ఓవర్‌కు ఎనిమిది బంతులు వేశారు. తాము వెళ్లాల్సిన ఓడకు సమయాతీతమవుతున్న కారణంగా, ఇంగ్లాండ్ క్రీడాకారులు మ్యాచ్‌ని మధ్యలోనే విడిచి, స్వదేశానికి పయనమయ్యారు. దీనితో ఆ టెస్టును డ్రాగా ప్రకటించారు. ఈ మ్యాచ్‌ని 'టైమ్‌లెస్ టెస్ట్' అని పిలుస్తారు.

### సంక్షిప్త స్కోర్లు

దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్: 202.6 ఓవర్లలో 530 పరుగులకు ఆలౌట్ (పీటర్ వాన్ డెన్ బిజ్ 125, డూడ్లే నౌర్స్ 103, కెప్టెన్ అలాన్ మెల్విల్లే 78, ఎరిక్ డాల్టన్ 57, రెగ్ పెర్క్స్ 100 పరుగులకు 5 వికెట్లు).
ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 117.6 ఓవర్లలో 316 ఆలౌట్ (వికెట్‌కీపర్ లెన్ అమెస్ 84, ఎడ్డీ పైంటర్ 62, ఎరిక్ డాల్టన్ 59 పరుగులకు 4, చౌడ్ లాంగ్టన్ 71 పరుగులకు 3, బాబ్ న్యూసన్ 58 పరుగులకు 2 వికెట్లు).
దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ (మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం 214): 142.1 ఓవర్లలో 481 ఆలౌట్ (కెప్టెన్ అలాన్ మెల్విల్లే 103, పీటర్ వాన్ డెన్ బిజ్ 97, బ్రూస్ మిచెల్ 89, కెన్ ఫార్నెస్ 74 పరుగులకు 4, హెడ్లే వెరిటీ 146 పరుగులకు 3, వాలీ హామండ్ 87 పరుగులకు 2 వికెట్లు).
ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ (విజయ లక్ష్యం 696): 218.2 ఓవర్లలో 5 వికెట్లకు 654 (లియోనార్డ్ హూటన్ 55, పాల్ గిబ్ 120, బిల్ ఎడ్రిచ్ 219, వాలీ హామండ్ 140, ఎడ్డీ పైంటర్ 75, ఎరిక్ డాల్టన్ 100 పరుగులకు 2 వికెట్లు).
మ్యాచ్ ఫలితం: డ్రా.

## సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు

బి.బాలకిషన్ సిపిఐ జిల్లా కార్యదర్శి



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ, కార్మిక హక్కుల పరీరక్షణ కోసం మే 20న జరుగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు భారత కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ మద్దతుతో పాటు సమ్మెలో సిపిఐ శ్రేణులు ప్రత్యక్షంగా పాల్గొంటామని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. బాలకిషన్ అన్నారు. శనివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సురవరం వెంకట్రామిరెడ్డి భవనం ఎదుట ఎఐటియుసి రూపొందించిన సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్స్, కరపత్రాలు ప్రచార సామాగ్రిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బి.బాలకిషన్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలకు ఆజ్యం పోస్తూ కార్మిక కర్షక ఉద్యోగ ప్రజా వ్యతిరేక విధానాను అమలు చేస్తున్నారని మండిపడ్డారు. మోడీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం అవుతున్నాయని దివాళా కోరు ఉదారవాద ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు నల్ల చట్టాలు, లేబర్ కోడ్‌లు లాంటి శాసనాలు దేశ అభివృద్ధికి తీవ్రమైన కలంకమని అన్నారు. మే 20న జరగబోయే సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం ప్రజలు రైతులు ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పి. సురేష్ మాట్లాడుతూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెతో నియంతృత్వ పోకడలతో సాగుతున్న కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పదని అన్నారు. సార్వత్రిక సమ్మెకు రోజురోజుకు మద్దతు ఆదరణ పెరుగుతున్నదని దీన్ని జీర్ణించుకోలేని కేంద్ర ప్రభుత్వం సమ్మెను ఎలాగైనా విచ్ఛిన్నం చేయాలని దుర్బుద్ధితో సమ్మెకు సిద్ధమవుతున్న కార్మిక వర్గంపై , సమ్మెపై విష చిమ్ముతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పి. సురేష్ , ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. దేవానంద్, మెడికల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియ న్ నేతలు గోపాల్ నాయక్, కామేశ్వర రావు, ఎఐటియుసి నాయకులు ఆంజనేయులు, యాదయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపోరాటాలతో సమస్యలు పరిష్కారం

సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** ప్రజాపోరాటాలతోనే గ్రామ సమస్యలు పరిష్కారం అవుతాయని, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడానికి క్షేత్రస్థాయిలో ప్రతి కార్యకర్త ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. శనివారం కురవి మండలం బలపాల సిపిఐ గ్రామ శాఖ సమావేశం రామగోని రవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిధిగా హాజరైన జిల్లా కార్యదర్శి విజయసారథి మాట్లాడుతూ గత 11సంవత్సరాలుగా కేంద్రంలో పరిపాలన చేస్తున్న బిజెపి పార్టీ నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించడంలోనూ, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. రాజ్యాంగ మూల సూత్రాలకు విఘాతం కలిగిస్తూ ప్రజల్లో భావోద్రేకాలను, మత విద్వేషాలను రెచ్చగొట్టే బిజెపి ప్రయత్నాలను ప్రగతిశీల శక్తులు ఐక్యమై ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. నూతన గ్రామ కమిటీతో పాటు, కార్యకర్తలు పార్టీని గ్రామస్థాయిలో సంస్థాగతంగా బలోపేతం చేయడానికి స్థానిక సమస్యలపై పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బలపాల సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శిగా రామగోని రవి, సహాయ కార్యదర్శిగా బత్తుల వెంకటేశ్వర్లుతోపాటు 7గురితో కమిటి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరావు, మండల కార్యదర్శి కరణం రాజన్న తదితరులు పాల్గొన్నారు.




# స్వార్థ ప్రయోజనాల కోసమే కులమతాలు

రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో నిర్వహించిన సెమినార్‌లో బికెఎంయు రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య




**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే కుల, మతాలను పెంచి పోషిస్తున్నారని బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యలు విమర్శించారు. శనివారం రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో 'కులం సామాజికం, మతం వ్యక్తిగతం, మతసామరస్యం పౌరుల బాధ్యత' అనే అంశంపై సిపిఐ 100 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా బికెఎంయు జిల్లా అధ్యక్షులు జె. అంజయ్య ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య అధ్యక్షతన స్థానిక అంబేద్కర్ భవన్‌లో జిల్లా స్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యలు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారత దేశంలో అధికారిక లెక్కల ప్రకారం 3000 కులాల తో పాటు మరో 25000 ఉప కులాలు ఉన్నాయని అన్నారు. అదేవిధంగా 8 మతాలు ఉన్నాయని, అందులో నూటికి ఎనభై శాతం మంది హిందూ మతం విశ్వసిస్తున్నారని తెలిపారు. కులాలు, మతాలు, రాజకీయ ప్రయోజనాల కోసం అధికార దాహం కోసం పుట్టినవే అని వారు పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికలు వచ్చినప్పుడు కులమతాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటున్నారని వారు మండిపడ్డారు. ఇలాంటి దగులు బాజీ రాజకీయాలు చెయ్యడం అనేది సరైనది కాదు అని దుయ్యబట్టారు. భారతదేశ సమాజంలో పుట్టిన ప్రజలకు వృత్తులను బట్టి మనుధర్మ శాస్త్రం ప్రకారం నాలుగు వర్ణాలుగా విభజించి, బ్రాహ్మణులు తలలో నుంచి, వైశ్యులు భుజాల నుంచి, క్షత్రియులు తొడల నుంచి, శూద్రులు పాదాల నుంచి పుట్టారని తలా తోక లేని రాతలు రాసి భారత ప్రజలపై రుద్దారని,ఎవరైనా తల్లి కడుపులోనుంచి పుడతారు కానీ ఇలా మనిషి అవయవాల నుంచి పుట్టరని అది గుర్తేరుగాలని వారు గుర్తు చేశారు. వర్ణాలు,వృత్తులను బట్టి కులాలను అంటగట్టారని విమర్శించారు. వృత్తులు పోయ్యాయి, అన్నికులాలవారు అన్యవృత్తులను చేస్తున్నారు.అయిన కులాలు పోలేదు.ఈ కుల పీడన ప్రజలను పట్టిపీడిస్తున్న పరిస్థితి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.
కుల,మతపరమై న ఎలాంటి సంఘటనలను ప్రతిఘటించి ఎదుర్కొని,ప్రజలకు అండగా ఉండి పోరాడుతున్న పార్టీ ఏదైనా ఉందం టే అది సిపిఐ,అనుబంధ ప్రజాసంఘాలేనని వారు అ న్నారు.ఇకనైనా పాలక ప్రభుత్వాలు పేద ప్రజల సమస్యలపై దృష్టి పెట్టి ఆర్థిక అసమానతల పోగొట్టే విధంగా, సంక్షేమ పథకాలను పేదలకు అందే విధంగా,కూడు, గూడు,విద్య,వైద్యంతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగా లు కల్పించాలని వారు పాలక ప్రభుత్వాల కలకొండ కాంతయ్య, పాలమాకుల జంగయ్యలు డిమాండ్ చేశా రు.ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రామస్వామి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం ప్రభు లింగం,ఏఐటియుసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ,మహిళా సమైక్య జిల్లా కార్యనిర్వాక అధ్యక్షురా లు వడ్ల మంజుల, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు ఎండి మ క్బూల్,సిపిఐ వివిధ మండలాల కార్యదర్శులు సత్తిరెడ్డి, శ్రీనివాస్,సుదీర్,జంగయ్య,తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు కోడ్‌లను రద్దు చేసి 44 కార్మిక చట్టాలను అమలు చేయాలి

దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్లు ఆవిష్కరించిన సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** కార్మికు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ పిలుపునిచ్చారు. నాలుగు లెబర్ కోడ్‌లను రద్దు చేసి నలబై నాలుగు కార్మిక చట్టాలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెవాల్ పోస్టర్లను కార్మికులతో కలసి సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డెబ్బయి ఐదు సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో పదకొండు సంవత్సరాల క్రితం బిజెపి నాయకత్వంలో మతతత్వ పార్టీ ఏర్పడిందన్నారు. పెట్టుబడిదారి విధానం కొనసాగుతుందని, కార్మిక వర్గం ఏన్నో పోరాటాలు చేసి సాధించుకున్న నలభైనాలుగు చట్టాల్లో ఇరవై తొమ్మిది కార్మిక చట్టాలను సమూలంగా రద్దు చేసిందన్నారు. పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు బడా వ్యాపారులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. ఈ కోడ్‌ల వల్ల కార్మికుల పనిగంటలకు, పన్నెండు గంటలు పెంచి కార్మిక చట్టాల్లో అనేక సవరణలు చేసి సమ్మె హక్కును తొలగించి కేంద్ర ప్రభుత్వం నిరసతనలు తెలియచేసి సమ్మె నోటిసులు ఇచ్చిన కార్మికులకు, కార్మిక సంఘా ల నాయకులపై బెయిలు దొరకని సెక్షన్ల ద్వారా జైల్లో పెట్టే అధికారం బిజెపి ప్రభుత్వం తెచ్చిన ఆచట్టం వల్ల కార్మికుల ఉద్యమాలను అణచివేయటం ప్రధాయ ధ్యేయంగా పెట్టుకుందన్నారు. కనీస వేతనాల చట్టం పెమెంట్ ఆఫ్ వేజేస్ పిఎఫ్, ఇఎస్ఐ ప్రమాద నష్టపరిహార చట్టాన్ని నిర్వీర్యం చేసి కార్మికులపై ఏవిధమైన హక్కులు లేకుండ బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గంపై కన్నెర్ర చేసిందన్నారు. ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొనాలన్నారు. ఈకార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా నేత కిష్టపురం లక్ష్మ ణ్, ఉపాధ్యక్షులు పిట్ల మల్లేశం, బిక్షపతి, పట్టణ అధ్యక్షులు బాలయ్య, నాయకులు రాజు, శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## 13న కోదాడలో బిసి హక్కుల సాధన సమితి మూడవ జిల్లా మహాసభలు



రాష్ట్ర ప్రధానకార్యదర్శి ధూళిపాళ ధనుంజయ్ నాయుడు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** ఈనెల 13వ తేదీన కోదాడ మున్సిపల్ పరిధిలోని బాలాజీనగర్ ఎల్ఐసి బిల్డింగ్‌లో జరగనున్న బిసి హక్కుల సాధన సమితి మూడవ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ్ నాయుడు విజ్ఞప్తి చేశారు. శనివారం హుజూర్‌నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో మహాసభల కరపత్రానలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకులు మారినా జెండాలు అజెండాలు మారినా బిసి బతులుకు మాత్రం మారలేదని, ప్రతి ఎన్నికల్లోనూ ప్రతి రాజకీయ పార్టీ బిసిలను ఉద్ధరిస్తామని బిసిల, ఎస్‌టి, ఎస్‌సి, మైనార్టీల ఉద్ధరణే లక్ష్యమని ఊకదపుడు ఉపన్యాసాలు చెబుతుంటారని తీరా ఎన్నికల్లో లబ్ధి పొందిన అనంతరం బిసిల ఊసే ఉండటం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అధికారంలో పార్టీ బిసి యువతకు స్వయం ఉపాధి అందిస్తామని ఇంటర్వ్యూ నిర్వహించి ఐదు లక్షల మందికి మొండి చెయ్యి చూపారని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా రాజీవ్ యువవికాసం పేరుతో దరఖాస్తులు స్వీకరిస్తున్నది కానీ అనేక కొర్రీలు పెట్టి అసలు పథకానికి అర్థం లేకుండా చేస్తున్నారని ఇదంతా బిసిలను మోసం చేయడమేనని ఆయన అన్నారు. ఎన్నికలల్లో భాగంగా కామారెడ్డి బిసి డిక్లరేషన్ ఇచ్చిన హామీల ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని ఆయన డి మాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగ ర్ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, బిసి హ క్కుల సాధన సమితి నాయకులు యల్లావుల రమే ష్, రైతుసంఘం నాయకులు జక్కుల రమేష్, విద్యార్థి సంఘం నాయకులు కొమ్రరాజు వెంకట్ , కందుల వెంకటేశ్వర్లు, స్టాలిన్, జడ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఘనంగా మాతృ దినోత్సవ వేడుకలు




**ప్రజాపక్షం/దుండిగల్ :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వాసవి క్లబ్ వనిత ఆనందగిరి ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా అధ్యక్షురాలు నల్లమల్లి సామ్రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృభక్తిని ఘనంగా స్మరించుకుంటూ, తల్లుల సేవను వేదిక పై ప్రశంసించి, నాలుగు తరాల అమ్మలకు పాదపూజ నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇంచార్జ్ కొలను హనుమంత రెడ్డి, కొలను శ్రీనివాస్ రెడ్డి, కొలను రాజశేఖర్ రెడ్డి, క్లబ్ కోశాధికారిణి పద్మ, అదనపు ప్రధాన కార్యదర్శిని రాధిక, అనంతలక్ష్మి, రజిని మరియు క్లబ్ సభ్యురాలు పాల్గొన్నారు.



## దేశ సైనికుల క్షేమం కోసం ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్‌లో ఆపరేషన్ సింధూర్‌వో భాగంగా భారత దేశ ఆర్మీ, నేవీ, వాయు దళాల క్షేమంకోసం మాజీ మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. బాచుపల్లి హిల్ కౌంటీ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మహా శ్రీమృత్యుంజయ యాగంలో మాజీ మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ దేశానికి భారత సైన్యం సరైన గుణపాఠం చెబుతుందని అన్నారు. భారత దేశ సైన్యానికి ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించి పాకిస్థాన్‌ని మట్టుపెట్టే విధంగా శక్తిని ప్రసాదించాలని వేడుకున్నారు. దేశ ప్రజల కోసం ప్రతీ పౌరుడు పాకిస్థాన్‌తో పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కొలను గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

**పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవ వేడుకలు...**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 2 లోని శ్రీశ్రీశ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో స్థానిక మాజీ మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి దంపతులు విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ గణపతి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత దేశ ప్రజలను కాపాడేందుకు నేవీ, వాయు, ఆర్మీ దళాలు చేస్తున్న పోరాటంలో సైన్యానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆ భగవంతుడు ధైర్య సాహసాలతో పాటు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారెడ్డి, నాగరాజు యాదవ్, సుదర్శన్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి

### ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

**ప్రజాపక్షం/పరిగి :** పరిగి పట్టణంలోని ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో మూడు నెలలు ఉచిత శిక్షణ పూర్తి చేసుకున్న 70మంది ఎస్‌సి మహిళలకు ఎస్‌సి కార్పోరేషన్ ద్వారా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఉచిత కుట్టుమిషన్లు , సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం మహిళల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు అలాగే కుట్టు మిషన్లుతో ఇంటి వద్ద ఉపాధి పొందవచ్చు అని అన్నారు. టైలరింగ్‌కు మంచి డిమాండ్ ఉందని శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు పని కల్పించే బాధ్యత తీసుకుంటున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఇందిరమ్మ ఇండ్లు వంటి అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పరశురాంరెడ్డి డిసిసి ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ అయూబ్, అంజనేయులు, సురేఖరెడ్డి, శశికళ అనంద్, సురేందర్, మహిళలు తదితరులు పాల్గోన్నారు.

**సైనిక కుటుంబాలకు అండగా ఉందాం**

క్యాంపు కార్యాలయంలో భారత్–పాక్ ఉద్రిక్తల నేపథ్యంలో మరణించిన సైనికుడు మురళి నాయక్‌కు అధికారులతో కలిసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సైనిక కుటుంబాలకు ప్రతి ఒక్కరు అండగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో సైనిక డిఫెన్స్ నిధికి ఒక నెల జీతాన్ని విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గోన్నారు.

**బాధిత కుటుంబానికి ఎల్ఒసి అందజేత**



వికారాబాద్ నియోజకవర్గంలోని పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నివాసంలో పరిగి మండలం రూప్ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన కటకట సువర్ణ భర్త నర్సింలు అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సువర్ణకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 1లక్ష50వేల విలువగల ప్రభుత్వం ద్వారా మంజురైన ఎల్ఒసి ని బాధితురాలి కుటుంబ సభ్యుల కు, అదేవిధంగా సయ్యద్ మల్కపూర్ గ్రామానికి చెందిన సాజిదా బేగం తండ్రి అబ్దుల్ ఖాధిర్ అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు మెరుగైన





హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియం వేదికగా 72వ ప్రపంచ సుందరి పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. గుస్సాడీ, కొమ్ము, కోయ కళాకారులు తమ ప్రదర్శనతో విదేశీ అతిథులను ఆకర్షించారు. మిస్ వరల్డ్ ప్రారంభ సమావేశంలో వివిధ దేశాల సుందరీమణులు తమ దేశీయ ఆహార్యంతోపాటు వివిధ దేశాల సంస్కృతి, సాంప్రదాయ వేషధారణలతో అలరించారు. భారతదేశ ప్రతినిధిగా పాల్గొంటున్న మిస్ ఇండియా నందిని గుప్తా త్రివర్ణ పతాకంతో వేదిక పైకి రాగానే ఆహ్వానితులతో పాటు సందర్శకులు పెద్దఎత్తున కరతాళ ధ్వనులతో స్వాగతం పలికారు. దేశ రక్షణకోసం పోరాడుతున్న సైనికుల ధైర్య సాహసాలకు నిర్వహకులు సెల్యూట్ ప్రకటించారు.

## అధునాతన దంత వైద్య సేవలు

### డిఎంహెచ్ఓ డాక్టర్ ఉమాగౌరి

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అధునాతన దంత వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, అవసరం ఉన్న వారు వినియోగించుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డిఎంహెచ్ఓ) డాక్టర్ ఉమాగౌరి తెలిపారు. సాధారణ దంత వైద్య సదుపాయాలే కాకుండా రోడ్డు ప్రమాదంలో గాయలకు గురైన దంత భాగాల చికిత్స సైతం లభిస్తోందన్నారు. రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలోగాయపడి మాక్సిలా ఎముక దవడ పై భాగం) విరగడం వల్ల ఎదురైన పిరమిడల్ లేఫోర్ట్2 చిక్సిను ఇక్కడి దంత సర్జన్ డాక్టర్ పి.వినోద్ లోకల్ అనస్తీషియా ద్వారా బోన్ ప్లాటింగ్‌తో ఫ్రాక్చర్ రిడక్షన్ చికిత్సను విజయవంతంగా నిర్వహించారని డిఎంహెచ్ఓ తెలిపి చికిత్స చేసిన వైద్య బృందాన్ని అభినం దిం చారు.

## భారతదేశ సాయుధ దళాలకు అండగా ఉండాలి




**ప్రజాపక్షం/కాప్రా :** ఉగ్రవాద దేశం పాకిస్తాన్ దాడులను తిప్పి కొడుతున్న భారతదేశ సాయుధ దళాలకు దేశ ప్రజలంతా అండగా ఉండాలని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి డిజి సాయిలు గౌడ్ పిలుపిచ్చారు. పార్టీ ఉప్పల్ మండల కార్యదర్శి పి.రామ్‌నారాయణ అధ్యక్షతన ఈసిఐఎల్‌లోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో జరిగిన సిపిఐ ఉప్పల్ మండల 4వ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన సభ ఎర్ర జెండాను ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌ను పూర్తి స్థాయిలో కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందేలా కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ వినాయకనగర్ డివిజన్ అధ్యక్షుడు యూసుఫ్ భాయ్ అన్నారు. శనివారం డివిజన్‌లోని తారక రామారావు నగర్ ప్రాంతంలో కొనసాగుతున్న సిసి రోడ్డు పనులను స్థానిక పార్టీ నేతలతో కల్సి పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డుల జారీ లాంటి విషయాల్లో అవసరం, అర్హత ఉన్న వారికి సహకరించాలన్నారు. పార్టీ శ్రేణులు గుండా నిరంజన్, ఆగమయ్య, పిట్ల శ్రీనివాస్, పంజా శ్రీనివాస్ యాదవ్, ఆర్యరాజు, కుమార్, తదితరులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో సిసిఐలో కార్మికుడు మృతి

**ప్రజాపక్షం/తాండూరు:** వికారాబాద్ జిల్లా తాండూరు మండల పరిధి కరణ్‌కోట్‌లోని సిసిఐ సిమెంట్ ఫ్యాక్టరీలో ఓ కార్మికుడు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కోరణ్‌కోట్ గ్రామానికి చెందిన ఖాసిం అలీ, హుస్సేన్‌అలీ (39) ఇద్దరు అన్నదమ్ములు. గతకొన్నేళ్లుగా సిసిఐ ఫ్యాక్టరీలో కాంట్రాక్ట్ పద్ధతిన కార్మికులుగా పనిచేస్తున్నారు. అయితే ఖాసీం అలీ పేయింటర్‌గా పనిచేస్తుండగా



హుసేన్ అలీ ఫ్యాక్టరిలోని పంపుహౌజ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఇద్దరు అన్నదమ్ములు నైట్ డ్యూటీలో భాగంగా విధులలో చేశారు. శుక్రవారం మధ్యరాత్రిలో ఖాసీం అలీ తోటి కార్మికుడు హన్మంతుతో కలసి తమ్ముడు పని చేస్తున్న పంపుహౌస్ వద్దకు వెళ్ళి చూడగా హుస్సేన్‌అలీ కిందపడిపోయినట్లు గుర్తించారు. వారు దగ్గరకు వెళ్ళి కదిపిచూడగా లేవలేదని, అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఆయన మృతి అనుమానాస్పందంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే హుస్సేన్‌ను తాండూరులోని జిల్లా ఆసుపత్రికి తరలించడం పలు అనుమానాలకు తావిస్తుందని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కార్మీక సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ సిసిఐ ఫ్యాక్టరీ ముందు ఆందోళనకు దిగారు. హుస్సేన్ అలీ మృతిపై పలు అనుమానాలు ఉన్నాయంటూ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## భారత సైన్యానికి వెన్నుదన్నుగా నిలుద్దాం

### మాజీ మంత్రులు హరీష్ రావు, మల్లారెడ్డి, బిఆర్ఎస్ విప్ వివేకానంద పిలుపు



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** భారత సైన్యానికి వెన్నుదన్నుగా నిలుస్తూ, ఐకమత్యాన్ని చాటాలని, ఉగ్రవాదం పై అలుపెరగని పోరాటం చేయాలని రాష్ట్ర మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, సిహెచ్ మల్లారెడ్డి, రాష్ట్ర శాసనసభ బిఆర్ఎస్ పార్టీ విప్ కెపి వివేకానందలు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారంలోని మల్లారెడ్డి హెల్త్ సిటీ వారి ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్‌కి సంఘీభావంగా జాతీయ సమగ్రతను చాటుతూ భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రులు హరీష్ రావు, మల్లారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానందలు విచ్చేసి వీర మరణం పొందిన అగ్నివీర్ జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ ఎత్తున జాతీయ జెండాలతో పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమాయకులను చంపడం అనేది ఉగ్రవాద, ఉన్మాదానికి నిదర్శనమని, బిన్ లాడెన్ వంటి ఉగ్రవాదులను పెంచి పోషించి ప్రపంచ మానవాళికే పాకిస్థాన్ దేశం ప్రమాదకరంగా మారిందని మండిపడ్డారు. ఉ3గవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ దేశాలు ఏకమై పోరాటం చేయాలని అన్నారు. ఇప్పటికే నాలుగు సార్లు పాకిస్థాన్ భారత్‌తో యుద్ధానికి కాలు దువ్వింది, కనీ భారత సైన్యం దాటికి నిలవలేకపోయిందని, అయినా ఇంకా బుద్ధి రాలేదని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యంలో పాకిస్థాన్‌కి విలువలేదని, ఆ దేశ ప్రజలే పాకిస్థాన్ ఆర్మీ, ఉగ్రవాదాన్ని తన్నే దుస్థితికి పాకిస్థాన్ దిగజారిందని అన్నారు. భారత సైన్యం అద్భుత ధైర్యసాహసాలతో పాకిస్థాన్ వెన్నులో ఒనుకు పుట్టిందని, ఈ యుద్ధంలో భారత సైన్యానికి వెన్నుదన్నుగా ప్రతి భారత పౌరుడు నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, కార్పొరేటర్ సత్యనారాయణ, నాయకులు భాస్కర్, శ్రీకాంత్, వేణు యాదవ్, మల్లారెడ్డి హెల్త్ సిటీ యాజమాన్యం, పెద్దఎత్తున యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## వికలాంగులకు గొడుగుల పంపిణీ

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** వేసవి కాలం దృష్ట్యా చిరు వీధి వ్యాపారులు, వికలాంగులకు లయన్స్ క్లబ్ ప్రతినిధు లు గొడుగుల పంపిణీ చేసారు. శనివారం జి హెచ్ఎంసి కాప్రా సర్కి ల్ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా లయన్స్ గవర్నర్ ఎన్. మనోహర్‌రెడ్డి జన్మదినం సందర్భం గా జరిగిన గొడుగుల పంపిణీ కార్యక్రమం లో లయన్స్ ప్రతినిధులు అశోక్‌కుమార్, గంప నాగేశ్వరరావు, లింగారెడ్డి, కమలాకర్, ఎస్ పి వై రెడ్డి, కొత్తపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కరువు

- మురుగు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు
- అరకొరగా సిసికెమెరాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లాలో ఉన్న వికారాబాద్, పరిగి. కొడంగల్, తాండూర్ ప్రయాణ ప్రాంగణా ల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. వికారాబాద్, పరిగి బస్టాండ్‌లో మురుగు పరుతోంది. దుర్వాసనతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నీటి సౌకర్యం లేని కారణంగా మల మూత్ర విసర్జన ఎక్కడ పడితే అక్కడ పరిగి బస్టాండ్‌లో చేస్తున్నారు. బస్టాండ్‌లో అరకొర సిసి కెమెరాలు ఉన్నాయి, సరైనా నీటి వసతి లేదు అని తెలుస్తుంది. వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న బస్టాండ్‌లో అన్ని బస్సులు ఉన్నాయి. హైదరాబాద్‌కు తొందరగా వెళ్లాలంటే తాండూర్ నుండి వచ్చె ఎక్స్‌ప్రైస్ బస్సుల కోసం గంటల కొద్ది ఎదురుచూపులే. వికారాబాద్ ప్రయాణ ప్రాంగణాన్ని 35 సంవత్సరాల క్రి తం ప్రారంభించారు. నాడు కల్పించిన సౌకర్యాలే నేటికీ ఉన్నాయి.

బస్టాండ్‌లో వరుస సెల్‌ఫోన్ చోరీలు జరుగుతున్నాయి. వికారాబాద్ బస్టాండ్‌లో వరుస దొంగతపాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తుంది. అరకొర సిసి కెమెరాలు ఏర్పాటు చేసినా పర్యవేక్షణ లేక పనిచేయడం లేదని తెలుస్తుంది. బస్టాండ్ పరసరాలలో చెత్త, మురుగుతో దుర్వాసన వస్తుంది. జిల్లాలో తాండూర్ బస్టాండ్ పెద్దదిగా పేరు ఉంది కాని సిసి కెమెరాలు ఏర్పాటు చేసినా చోరీలు ఆగడం లేదని తెలుస్తుంది. బస్టాండ్ ప్రాంగణంలో పరిశుభ్రత కరవవుతున్నాయి. ఫ్లాట్‌ఫారాలు లేక ప్రయాణీకులు చెట్లను ఆశ్రయిస్తున్నారు. కొడంగల్ బస్టాండ్‌లో సిసి కెమెరాలు లేక సెల్‌ఫోన్ దొంగతనాలు జరుగుతున్నాయి. ఆరు నెలలనుండి నాలుగు సెల్‌ఫోన్లు, రెండు బంగారం దొంగతనం కేసులు నమోదైతే నమోదుకు ముందుకు రానివెన్నో ఉన్నాయి. వికారాబాద్‌లో 66బస్సులు ఉన్నాయి. ఇందులో రెండు మాత్రమె ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. నిత్యం తిరిగే కిలోమీట ర్లు 24,200 కిలోమిటర్లు. వచ్చు ఆదయం 14.2 లక్షల్లో వస్తుంది, పరిగిలో బస్సులు 78 ఉన్నాయి ఇందులో అర్డీనరి బస్సులు లేవు అన్నీ ఎక్స్‌ప్రైస్‌లు ఉన్నాయి. 29,650 కిలోమీటర్లు, 16.5 లక్షల్లో ఆదాయం వస్తుంది. తాండూర్‌లో 96 బస్సులు ఇందులో కూడా దాదాపు అన్ని ఎక్స్‌ప్రైస్‌లే ఉన్నాయి. నిత్యం తిరిగే కిలోమిటర్లు 36,450, వచ్చే ఆదయం 17.35లక్షల్లో వస్తుంది. అన్ని బస్టాండ్‌లలో నీటి పంపులు పనిచేయడం లేదు. మహాలక్ష్మి పథకం ప్రారంభం అనంతరం రాకపోకలు పెరిగాయి. అందుకు సరిపడా సౌకర్యాల కల్పన జరగడం లేదని తెలుస్తుంది.

వికారాబాద్ డిపోకు ఎక్స్‌ప్రైస్ బస్సులను పెంచాలని ప్రయాణీకులు కోరుతున్నారు. ఉదయం 8గంటల వరకు హైదరాబాద్ వెళ్లడానికి బస్సు లేక ప్రయాణికులు ఇబ్బందులు గురవుతున్నారు. అలాగే బస్టాండ్‌లో నిత్యం పోలీస్‌ను కేటాయించాలని ప్రయాణికులు కోరుతున్నారు. దొంగతనం జరిగేతే చెప్పుకోవడానికి బస్టాండ్‌లో ఎవ్వరు ఉండడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ప్రయాణీకుల సౌకర్యం కోసం పోలీసులను కేటాయించాల్సి ఉంది. వికారాబాద్ బస్టాండ్‌లో టాయిలెట్‌కు వెళ్లాలంటే నీటి సౌకర్యం లేక మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారుల స్పందించి ప్రయాణీకులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని బస్టాండ్‌లలో టాయిలెట్‌లు నీటి సౌకర్యం లేక దుర్వాసన వస్తోంది. బస్టాండ్‌ల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.








# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## సికింద్రాబాద్‌లో భారీగా గంజాయి పట్టివేత



**హైదరాబాద్ :** నగరంలో నిత్యం ఎక్కడో ఒక చోట గంజాయి పట్టుబడుతూనే ఉంది. శనివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి ముఠాను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. పక్కా సమాచారంతో దాడి చేసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో అక్రమంగా గంజాయి సరఫరా చేస్తున్న నలుగురు సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుల నుంచి రూ. 1.50 లక్షల విలువైన గంజాయి.. నాలుగు సెల్ ఫోన్లు, ఒక బైక్ ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఒడిశాలో గంజాయిని కొనుగోలు చేసి సికింద్రాబాద్‌లో విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## విద్యార్థుల సమస్యలను గాలికొదిలేసి అందాల పోటీలు ఏమిటి?

ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్

**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటుంటే ప్రభుత్వం మాత్రం అందాల పోటీలు నిర్వహించడం ఏమిటని ఎఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ ప్రశ్నించారు. శనివారం షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆకాష్ నాయక్ మాట్లాడుతూ దేనికోసం..ఎవరి కోసం ఈ అందాల పోటీలను నిర్వహిస్తున్నారో ప్రజలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులు వివిధ రంగాల్లో అనేక సమస్యలతో కొట్టు మిట్టాడుతుంటే తమకేమి పట్టనట్లు వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. భారతదేశానికి పాకిస్తాన్‌కు మధ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో అందాల పోటీలు నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిఫ్‌లు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని పేర్కొన్నారు. ఒకవైపు భారత్ పాకిస్తాన్ మధ్య యుద్ధం జరుగుతుండటం..వీర జవాన్లు వీర మరణం పొందుతుంటే తెలంగాణ రాష్ట్రానికి అందాల పోటీలు కావాల్సి వచ్చిందా అని ప్రశ్నించారు. ఇప్పటికైన ప్రభుత్వం కళ్లు తెరిచి విద్యారంగ సమస్యలను పరిష్కరించడంతోపాటు వీర జవాన్లను అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** బడుగు బలహీన వర్గాల నేత.. మాజీ శాసన సభ్యులు అంజయ్య యాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని రెడ్‌రోజ్ పంక్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ జన్మదినం సందర్భంగా ప్రత్యేకంగా కారు రూపంలో తయారు చేసిన కేక్‌ను కట్ చేయడంతో పాటు మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. బిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. మాజీ శాసన సభ్యులు జన్మదినం సందర్భంగా మాజీ సర్పంచ్ సుమిత చందునాయక్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. షాద్‌నగర్ మున్సిపాలిటితో పాటు ఫరూఖ్‌నగర్, కొత్తూరు, నందిగామ, కేశంపేట, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాల అధ్యక్షులు, కార్యర్తలు పెద్ద ఎత్తున పాల్గొని అంజయ్య యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేయడంతో పాటు వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.పూలమాలలు, శాలువాలు, బోకేలతో అంజయ్య యాదవ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ కార్యకర్తల అభిమానానికి తాను ఎల్లప్పుడు రుణపడి ఉంటానని, వారి సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ నరేందర్, మాజీ వైస్ చైర్మెన్ నటరాజన్, యువనేత మురళీయాదవ్, రాజావరప్రసాద్, ఎమ్మె సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిసిలు విద్య, సామాజిక రంగాల్లో రాణించాలి : జక్కుల జలజ



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ :** బిసిలు విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని బిసిసేన ఫరూఖ్‌నగర్ మండల మహిళా అధ్యక్షురాలు జక్కుల జలజ కోరారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడు గ్రామంలో బిసిసేన మహిళా గ్రామ కమిటి అధ్యక్షుల తోపాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ మహిళా అధ్యక్షురాలుగా వడ్ల సుజాతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలుగా చాకలి కల్పన, కార్యదర్శిగా గుంటి రంగమ్మ, బండాల శకుంతల, కోశాధికారిగా వడ్ల సుమలతలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసిలు అన్ని రంగాల్లో రాణిస్తేనే సమాజంలో ముందుకు వెళ్ళేందుకు అవకాశం ఉంటుందన్నారు. బిసిల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. బిసిలు కేవలం ఓటు బ్యాంకుగానే కాకుండా అన్ని రంగాల్లో ఐక్యతగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి , కార్యదర్శి జూపల్లి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు చిన్న బాల్‌రాజ్, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షులు మేకల వెంకటేష్, చౌదరిగూడ మండల మహిళా అధ్యక్షురాలు పేట జయ శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు స్రవంతి, వసంత, శారదలు పాల్గొన్నారు.

## భారత సైనికులు సమర్థవంతంగా ఎదురుకోవాలని పూజలు

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** భారత దేశ సైనికులు సమర్థవంతంగా ఎదురుకోవడానికి మరింత శక్తి సమర్థ్యం కల్పించాలని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో బిజెపి పార్టీ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ లచ్చిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులకంటే తీవ్రంగా కాల్పులు నిర్వహించడం హేయమైన చర్యగా భావిస్తున్నామన్నారు. భారత దేశ ప్రధాన మోదీ సారథ్యంలో పాకిస్తాన్‌ను మట్టికరిపిస్తామని హెచ్చారించారు. భారత సైనికులకు బిజెపి పార్టీ అండగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పద్మారెడ్డి, దామోదర్‌రెడ్డి, శంకరయ్య గౌడ్, శ్రీధర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, బిక్షపతి, కసిరెడ్డి, రాజు గౌడ్, నందకిషోర్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బాణాసంచాపై నిషేధం





హైదరాబాద్ సిపి సివి ఆనంద్

**హైదరాబాద్ :** నగరంలో టపాసులు, బాణాసంచాపై నిషేధం విధిస్తూ హైదరాబాద్ పోలీస్ కమి షనర్ సివి ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. భారత్‌పాక్ యుద్ధం నేపథ్యంలో దేశంలోని రాష్ట్రాలను కేంద్ర హోం శాఖ అప్రమత్తం చేసింది. దీంతో వెంటనే అలర్ట్ అయిన తెలంగాణ ప్రభుత్వం, పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. హైదరాబాద్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల్లో హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ అమలులోకి తీసుకుని వచ్చారు. సెక్షన్ 67 (సి) కింద ప్రజల భద్రత కోసం మిలటరీ కంటోన్మెంట్ ప్రాంతాలలో, బహిరంగ ప్రదేశాల్లో టపాసులు లేదా బాణసంచా పేలుళ్లపై నిషేధం విధించారు. ప్రస్తుత భద్రతా వాతావరణం దృష్ట్యా, పటాకులు కాల్చిన పేలుడు లేదా తీవ్రవాద సంబంధిత కార్యకలాపాలని తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. భద్రతా దళాలపై అనవసరమైన ఒత్తిడి పెరిగే అవకాశం ఉండడంతో నిర్ణయం తీసుకున్నారు. బహిరంగ ప్రదేశాలు, సమావేశాలు, కార్యక్రమాలలో పటాకులు పేల్చడం నిషేధం విధించారు. సిటీ పోలీస్ యాక్ట్ ప్రకారం ఆంక్షలు తక్షణం అమలులోకి వస్తాయని ఆదేశించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆంక్షలు కొనసాగుతాయి. ఇప్పటికే అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. సిపి సివి ఆనంద్ ఎప్పటికప్పుడు భద్రతను పర్యవేక్షిస్తూ, బందోబస్తుపై పోలీసులకు సూచనలు ఇస్తున్నారు. నగరంలో అనుమానాస్పద వ్యక్తులపై కూడా పోలీసులు ఫోకస్ పెట్టారు.

## మురళీ నాయక్ త్యాగం వృథాకాదు

టిడిపి సికింద్రాబాద్ అధ్యక్షుడు సాయిబాబా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత్ పాక్ మధ్య జరుగుతున్న యుద్ధంలో వీర మరణం పొందిన మురళీ నాయక్ త్యాగం వృథాకాదని టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో శనివారం మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి, కొవ్వుతులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ మురళీ నాయక్ పాక్ మూకలపై వీరోచితంగా పోరాడుతూ తీవ్రంగా గాయపడ్డారన్నారు. గాయపడినప్పటికీ వీరోచితంగా పోరాడి ఐదుగురు శత్రువులను మట్టుపెట్టారన్నారు. మురళీనాయక్ తల్లిదండ్రులకు ఏకైక సంతానమని, యుద్ధ భూమిలో వీర మరణం పొందిన జవాన్‌గా చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజు గౌడ్, రాజేంద్రప్రసాద్(ఆర్.పి), పరశురామ్, ఎస్.ప్రకాష్, అడ్డగుట్ట విజయ్, భానుప్రకాష్, జగదీష్ గౌడ్, మల్లికార్జున్, కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.




## సిబిఐ వలలో ఆదాయపన్ను శాఖ కమిషనర్

**హైదరాబాద్ :** ఓ కంపెనీకి లబ్ధి చేకూర్చేందుకు లంచం తీసుకుంటుండగా హైదరాబాద్ ఆదాయ పన్ను శాఖ కమిషనర్ జీవన్‌లాల్ లావిడియాను సిబిఐ అధికారులు ముంబాయిలో శనివారం అరెస్టు చేశారు. ఓ కంపెనీకి లబ్ధి చేకూర్చేందుకు జీవన్‌లాల్ లంచం డిమాండ్ చేసినట్లు తెలిసింది. దీంతో కంపెనీ ప్రతినిధులు ఇచ్చేందుకు అంగీకరించడంతో మధ్యవర్తి ద్వారా రూ.70లక్షలు తీసుకుంటుండగా సిబిఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మధ్యవర్తి, జీవన్‌లాల్‌ను అదుపులోకి తీసుకున్న సిబిఐ అధికారులు విచారించగా ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలు బయటికి వచ్చాయి. దీంతో సిబిఐ అధికారులు ముంబాయి, హైదరాబాద్, ఖమ్మం, విశాఖపట్టణం, ఢిల్లీతోపాటు 18 ప్రాంతాల్లో సోదాలు చేశారు. సోదాల్లో సిబిఐ అధికారులు రూ.69లక్షల నగదు, కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో జీవన్‌లాల్, సాయిరామ్ పలిశెట్టి, నట్టా వీరనాగ శ్రీరామ్‌గోపాల్, కాంతిలాల్ మోహతా, సజిదా మజహర్ హుస్సేన్‌షాను అరెస్టు చేశారు. ముంబాయిలోని సిబిఐ కోర్టు స్పెషల్ జడ్జి ఎదుట హాజరుపర్చారు. కోర్టు ఐదుగురికి రిమాండ్ విధించడంతో జైలుకు పంపించారు. మాజీ ఎమ్మెల్యే కూమారుడైన జీవన్‌లాల్ 2004లో ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యాడు. హైదరాబాద్ ఆదాయ పన్ను శాఖ కమిషనర్‌గా పనిచేస్తున్నాడు.

## వరద ముంపు సమస్యకు ‘బాక్స్ డ్రైన్’

**ప్రజాపక్షం/అల్వాల్ :** వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం బాక్స్ డ్రైన్ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ అన్నారు. మచ్చ బొల్లారం డివిజన్ సూర్య నగర్ నుండి చంద్ర నగర్ మీదగా జ్యోతి నగర్ వరకు వ్యయం 25 లక్షల తో బాక్స్ డ్రైన్ తో ఇరువైపుల సిమెంటుతో కూడిన పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా చిన్నపాటి వర్షాలకు సూర్య నగర్ నుండి చంద్ర నగర్ జ్యోతి నగర్ వివిధ కాలనీలు జలమయం అవుతుందని దానికి బాక్స్ డ్రైన్ పనులతో పరిష్కారం అవుతుందన్నారు. డివిజన్లోని పెండింగ్లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్ గౌడ్, గణేష్ యాదవ్, వెంకటేష్,



దేవేందర్, రంగస్వామి, వెంకటేశ్వర్లు, చారి, అన్వర్, శేఖర్, మొయ్యి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకే
# వేసవి క్రీడల శిక్షణా శిబిరాలు





అదనపు కమిషనర్ యాదగిరి రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వేసవి క్రిడల శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థులలో క్రిడా నైపుణ్యాన్ని పెంపొందించి, క్రిడాకారులను తీర్చిదిద్దాలని జిహెచ్ఎంసి అదనపు కమిషనర్( క్రిడలు ) డాక్టర్ యాదగిరి రావు సంబంధిత కోచ్‌లను ఆదేశించారు. సికింద్రాబాద్ జోన్‌లోని వివిధ ప్లే గ్రౌండ్లు, స్విమ్మింగ్ పూల్లను సంబంధిత జోన్ గేమ్స్ ఇన్స్ స్పెక్టర్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిహెచ్ఎంసి నిర్వహిస్తున్న వేసవి క్రిడల శిక్షణ శిబిరాలకు మంచి స్పందన లభిస్తుందని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 6 నుండి 16 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు క్రిడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు వేసవి క్రిడల శిక్షణ శిబిరాలను నిర్వహించడం ఆనవాయితీగా మారిందన్నారు.
దేశంలోనే ఏ మున్సిపల్ కార్పొరేషన్ క్రీడలకు ప్రొత్సహించడం లేదన్నారు. మొ దటి నుంచి జిహెచ్ఎంసి విద్యార్థులకు క్రిడల్లో ప్రొత్సహిస్తుందని యాదగిరిరావు చెప్పారు. ఈ సంవత్సరం ఆరు జోన్‌లలో వివిధ క్రిడా విభాగా ల్లో నిష్ణాతులైన 77 మంది పార్ట్ టైం కోచ్‌లు, 800 మంది గౌరవ వేతన కోచ్‌ల ద్వారా వేసవి క్రిడల శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 44 విశాలమైన బహుళ క్రీడా సముదాయాలు, 29 స్విమ్మింగ్ పూల్స్, 13 ఆట స్థలా లు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లలో 44 రకాల ఆటలలో శిక్షణను ఇస్తున్నట్లు ఆయన వివరించారు.

## పదేళ్లల్లో చేసిన అభివృద్ధే నేడు పల్లెల్లో కనిపిస్తోంది

మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్



**ప్రజాపక్షం/కొత్తూరు:** పదేళ్లల్లో చేసిన అభివృద్ధే నేడు గ్రామీణ ప్రాంతాల్లో కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అన్నారు. శనివారం షాద్‌నగర్ మాజీ శాసన సభ్యులు అంజయ్య యాదవ్ జన్మదినం సందర్భంగా కొత్తూరులో ఘనంగా సన్మానించారు. కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ మాట్లాడుతూ గెలుపు..ఓటములతో పని లేకుండా నిరంతరం ప్రజల మధ్య ఉండే నేత అంజయ్య యాదవ్ అని అన్నారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధియే లక్ష్యంగా పని చేశారని, ఏ గ్రామానికి వెళ్ళినా అంజయ్య యాదవ్ పేరు వినిపిస్తుందన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే నేడు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తున్నాయని గుర్తు చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీపై ప్రజలు విసిగిపోయారని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. బిఆర్ఎస్‌పై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా విజయమే లక్ష్యంగా పని చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్, కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మె సత్యనారాయణ, కౌన్సిలర్లు మాదారం నర్సింహ్మాగౌడ్, అనిత శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మెండే కృష్ణయ్య, మాజీ అధ్యక్షుడు యాదగిరి, మాజీ సర్పంచ్ బ్యాగరి సత్తయ్య, మధుసూదన్‌రావు, గుండు సురేష్, జంగయ్య, లక్ష్మణ్‌నాయక్‌లు పాల్గొన్నారు.

## గురునానక్ యూనివర్శిటీ హాస్టల్‌లో బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య

**ప్రజాపక్షం/ఇబ్రహీం పట్నం :**బిటెక్ విద్యార్థిని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇబ్రహీంపట్నం పోలిస్ స్టేషన్ పరిధిలో గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలో శనివారం ఉదయం చోటుచేసుకుంది.ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు,బంధువులు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కురనవెళ్ళి గ్రామానికి చెందిన అల్లూరి భావన(22) రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలో గురునానక్ యూనివర్సిటిలో బిటెక్ మూడవ సం త్సరం చదువుతున్నట్లు తెలిపారు.అయితే శనివారం ఉదయం కళశాల పరిధిలో ఉన్న హస్టల్ గదిలో ఎవ్వరు లేని సమయంలో చున్నీతో సీలిం గ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకోని మృతి చెందటంతో తక్షణమే హస్టల్ వార్డెన్ యాజమాన్యానికి, పోలీస్‌లకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. హుటహుటిన సంఘటన స్థలానికి పోలీసులు చేరుకోని యాజమాన్యం ఆదేశాల మెరకు మృత దేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కూతురు మరణ వార్త విన్న వెంటనే తల్లీదండ్రులు సంఘటన జరిగిన కళశాల దగ్గరకి వచ్చే సరికి మృత దేహాన్ని కళశాల యాజమాన్యం గుట్టు చప్పుడు కా కుండా రహాస్యంగా భావన మృత దేహాన్ని మార్చురికి తరలించటంతో ఇది హత్య! ఆత్మహత్యనా అన్ని తల్లీదండ్రులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. కళశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోని మృతి చెందిన విద్యార్థినికి న్యాయం చేయాలని విద్యార్థి సంఘాలు కళాశాల ముందు ఆందోళన చేశారు. ఈ సంఘటనపై తల్లీదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు జరుపుతున్నారు.




## ఉమ్మడి శామీర్‌పేటలో కాంగ్రెస్ అధ్యక్ష రేసులో ఆశావాహులు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఉమ్మడి శామీర్‌పేట మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవుల రేసులో కాంగ్రెస్ నాయకులు, ఆశావాహులు పోటాపోటీ పడుతున్నారు. ఎఐసిసి, టిపిసిసి ఆదేశాల మేరకు ఇటీవల తూంకుంట మున్సిపాలిటిలో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో తూంకుంట మున్సిపాలిటి, శామీర్‌పేట మండలం (అలియాబాద్ మున్సిపాలిటి), మూడుచింతలపల్లి మండలం (ఎంసిపల్లి మున్సిపాలిటీ) అధ్యక్షుల బరిలో ఉన్నవారు తమ పేర్లను అధిష్టానానికి అందజేశారు. తూంకుంటలో 35, శామీర్‌పేటలో 15, మూడుచింతలపల్లి 22 మంది ఆశావాహులు తమ పేర్లను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిలకు అందజేశారు. దీంతో పాటు ఎ బ్లాక్, బి బ్లాక్, కార్పోరేషన్, అనుబంధ సంఘాల కమిటీల ఎన్నికకు సంబందించి పేర్లను ఆశావాహులు ఎక్కువ సంఖ్యలో అందజేశారు. దీంతో అదిష్టానం అధ్యక్షుల ఎంపికలో ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి

### మూడుచింతలపల్లిలో పోరు రసవత్తరం

మూడుచింతలపల్లిలో రసవత్తరమైన పోటీ కనిపిస్తుంది. కొత్తగా ఏర్పాటు కానున్న మున్సిపాలిటీపై అందరి చూపు ఉంది. ఇందులో సీనియర్ కాంగ్రెస్ నాయకులు అధ్యక్ష బరిలో పేర్లను ఇవ్వగా కొత్తగా ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరినవారు కూడ తమ పేర్లు ఇచ్చారు. సీనియర్లుగా బావిస్తున్న దోసకాయల వెంకటేష్(ఉద్దెమర్రి మాజి సర్పంచ్), శామీర్‌పేట వర్కింగ్ ప్రసిడెంట్ బండి జగన్నాధం, మాజి వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి మాజి ఉపసర్పంచ్ (కొల్తూర్), కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రామిడి శశిదర్‌రెడ్డి, జెగ్రిపోతుల నర్సింలు, వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్‌రావు, ప్రబాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డిలతో పాటు మరికొంత మంది మూడుచింతలపల్లి మున్సిపాలిటి అధ్యక్ష పదవికి తమ పేర్లును అందజేశారు. ఈ పది మందిలో ముగ్గరు పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అధ్యక్ష పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే..

## రిజర్వాయర్‌ను వాడుకొని నీళ్ళు ఇవ్వండి

**ప్రజాపక్షం/గండిపేట:** గుడ్ మార్నింగ్ మణికొండ పేట మున్సిపల్ పరిధిలోని నెక్నంపూర్ అల్కాపూర్ రోడ్డు నంబర్ 1,2 పరిసర ప్రాంత ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యల సేకరణ సందర్భముగా సీతారం ధూళిపాళ్ల మాట్లాడుతూ విద్యుత్ సప్లై తీవ్ర అంతరాయంగా ఉందని పేరుకు మాత్రం వీధి దీపాలు ఉన్నా వెలగడం లేదని స్థానిక ప్రజలు తెలియజేశారన్నారు. ఎండాకాలం తీవ్రత ఎక్కువగా ఉన్నందువలన మంచినీటి సరఫరా నామమాత్రంగా వదులుతున్నారని బిల్లు మాత్రం తగ్గడం లేదని తెలియజేశారు. కొంతమంది ఉన్న కనెక్షన్ తీయించుకుంటున్నామని తెలియజేశారని ఆయన అన్నారు. కోర్టు మెట్లెక్కి కట్టిన రిజర్వాయర్ లను వాడుకోవడం చేతకాని జలమండలి అధికారుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపై ఎక్కడి పడితే అక్కడే చెత్త పేరుకుపోయి దోమల బెడద తీవ్రంగా ఉందన్నారు. ఈ సమస్యలపై సంబంధిత ప్రభుత్వ అధికారులు పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారం ధూళిపాళ అన్నారు. ఈ కార్యక్రమంలో గుట్టమీది నరేందర్, బొమ్ము ఉపేందర్నాథ్ రెడ్డి, షేక్ ఆరిఫ్ మహమ్మద్, ఏర్పుల శ్రీకాంత్, యాలాల కిరణ్, సుమనలిని,శ్రీధర్, రమణమూర్తిలు డిమాండ్ చేసినారు.



# క్రీడ

## ఉద్రిక్తతలకు తెర..

### ఐపిఎల్ పునరుద్ధరణ దిశగా బిసిసిఐ!



భారత్, పాకిస్థాన్ల మధ్య ఉద్రిక్తతలకు తెరపడింది. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఇరుదేశాలు శనివారం కాల్పుల విరమణకు అంగీకరించాయి. దాంతో, యుద్ధ వాతావరణం తొలగిపోయి సాధారణ పరిస్థితులు ఏర్పడే అవకాశముంది. ఈ నేపథ్యంలో వారం రోజుల పాటు వాయిదా వేసిన ఐపీఎల్ 18వ సీజన్ పునరుద్ధరణపై బీసీసీఐ దృష్టి సారించనుంది. మిగతా 16 మ్యాచ్‌లను నిర్వహించి లీగ్‌ను విజయవంతం చేయడం కోసం కార్యాచరణ సిద్ధం చేయనుంది. ఉద్రిక్తతల నేపథ్యంలో ధర్మశాల వేదికగా మే 8వ తేదీన ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ మధ్య మ్యాచ్‌ను అర్ధాంతరంగా రద్దు చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత ఫ్రాంచైజీ యజమానులతో, బ్రాడ్‌కాస్టింగ్ సంస్థలతో చర్చలు జరిపిన బీసీసీఐ ఐపీఎల్‌ను వారం రోజులు వాయిదా వేసింది. ఇప్పుడు ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకరించడంతో పరిస్థితులు చక్కబడే అవకాశముంది. దాంతో, తదుపరి 16 మ్యాచ్‌లను హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో నిర్వహించాలనుకున్న బీసీసీఐ.. తన ఆలోచన మార్చుకునేందుకు ఆస్కారముంది. ఇంతకుముందున్న షెడ్యూల్ ప్రకారమే మ్యాచ్‌లు జరిగేందుకు వీలుంది. కొన్ని డబుల్ హెడర్స్ ఆడించడం ఖాయమని అనిపిస్తోంది. అయితే.. షెడ్యూల్ గురించి బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. 'ఆపరేషన్ సిందూర్' తదనంతర పరిణామాలతో సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొనడం.. ఐపీఎల్ వాయిదాకు దారి తీశాయి. దేశం కంటే తమకు ఏదీ ముఖ్యం కాదంటూ బీసీసీఐ లీగ్‌కు బ్రేక్ ఇచ్చింది. ఆటగాళ్ల భద్రతను దృష్టిలో ఉంచుకొని వాయిదాకే మొగ్గు చూపింది ఐపీఎల్ పాలక మండలి. ధర్మశాలలో చిక్కుకుపోయిన ఢిల్లీ, పంజాబ్ కింగ్స్ ఆటగాళ్లు, సిబ్బంది.. మీడియా, కామెంటేటరీ సభ్యులను భారీ భద్రత నడుమ 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్'లో సురక్షితంగా ఢిల్లీకి తరలించింది బీసీసీఐ. అయితే.. భారత్, పాక్‌ల మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో కొందరు విదేశీ క్రికెటర్లు స్వదేశాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు కూడా.



## కోహ్లీ.. టెస్టులకు వీడ్కోలు?

భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ కూడా టెస్టులకు రిటైర్‌మెంట్ తీసుకుంటాడా? అవుననే అంటున్నాయి క్రికెట్ వర్గాలు. ఇటీవల కెప్టెన్ రోహిత్ శర్మ సుదీర్ఘ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే. అతడి బాటలోనే కోహ్లీ టెస్టులకు వీడ్కోలు పలకాలని భావిస్తున్నట్లు క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. ఈ విషయాన్ని బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లినట్లు వార్తలు వస్తున్నాయి. జూన్ నుంచి ఇంగ్లాండ్ పర్యటనకు టీమ్ఇండియా వెళ్లనుంది. ఆలోగానే టెస్టు భవితవ్యంపై కోహ్లీ ప్రకటన చేస్తాడని సమాచారం. తన రిటైర్‌మెంట్ ఆలోచనను పరిగణనలోకి తీసుకోవాలని బీసీసీఐకి కోహ్లీ చెప్పినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కోహ్లీ ఐపీఎల్‌లో ఆడుతున్నాడు. ఇప్పటికే రోహిత్, రవీంద్ర జడేజాతో కలిసి టీ20లకు గుడ్‌బై చెప్పేసిన సంగతి తెలిసిందే.

## లంకతో ఫైనల్..

### టైటిల్‌పై కన్నేసిన భారత అమ్మాయిలు..!



వన్డే వరల్డ్ కప్ ముందు భారత మహిళల జట్టు ముక్కోణపు వన్డే సిరీస్ ఫైనల్లో శ్రీలంకతో తలపడనుంది. టాపార్డర్, మిడిలార్డర్ సమిష్టిగా రాణిస్తుండడం, బౌలర్లు చెలరేగుతుండడంతో టీమిండియాకు విజయావకాశాలు మెరుగ్గానే ఉన్నాయి. అయితే.. చమరి ఆటపట్టు బృందాన్ని తక్కువ అంచనా వేయడానికి లేదు. లీగ్ దశలో ఇరుజట్లు చెరొక మ్యాచ్ గెలుపొందాయి. దాంతో, ఆదివారం ప్రేమదాస స్టేడియంలో జరుగబోయే బిగ్ ఫైట్‌లో విజయం ఎవరిని వరిస్తుంది? ట్రోఫీని ముద్దాడేది ఎవరు? అనేది ఆసక్తికరంగా మారింది. టీ20 వరల్డ్ కప్‌లో దారుణ ప్రదర్శన తర్వాత భారత జట్టు పుంజుకుంది. ముక్కోణపు సిరీస్‌లో సమిష్టిగా రాణిస్తూ శ్రీలంక, దక్షిణాఫ్రికాలకు చెక్ పెట్టింది. ఆరంభ పోరులో ఓపెనర్లు ప్రతీకా రావల్ అర్ధ శతకంతో రెచ్చిపోగా లంకపై 9 వికెట్ల తేడాతో గెలుపొందింది హర్మన్‌ప్రీత్ సేన. ఆ తర్వాత సఫారీలను 15 పరుగుల తేడాతో చిత్తు చేసింది. అయితే.. తదుపరి పోరులో శ్రీలంక 3 వికెట్లతో విజయం సాధించి భారత్‌కు షాకిచ్చింది. ఆ తర్వాత దక్షిణాఫ్రికాను ఓడించిన ఇండియా.. ఫైనల్‌కు దూసుకెళ్లింది. టైటిల్ పోరులో ఆతిథ్య లంకను ఢీ కొట్టేందుకు సిద్ధమైంది. నేడు 4:30 గంటలకు మ్యాచ్ షురూ కానుంది.

## కల సాకారం



ప్రతిష్ఠాత్మక ఆర్చరీ వరల్డ్ కప్‌లో భారత ఆర్చర్ మధుర ధమన్‌గాంకర్ చరిత్ర సృష్టించింది. వరల్డ్ కప్‌లో ఇప్పటికే రెండు పతకాలు గెలిచిన తను.. పసిడితో తన కలను సాకారం చేసుకుంది. మూడేళ్ల విరామం తర్వాత పోటీపడిన ఆమెకు విశ్వవేదికపై ఇదే తొలి స్వర్ణం కావడం విశేషం. శనివారం జరిగిన ఆర్చరీ వరల్డ్ స్టేజ్ 2 ఫైనల్లో మధుర గురి తప్పకుండా బాణాలు సంధించింది. అమెరికాకు చెందిన కార్సన్ క్రాహేను 139–138 పాయింట్లతో ఓడించింది. చైనాలోని షాంఘైలో జరుగుతున్న ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్ 2లో ముంబైకి చెందిన మధుర అదరగొట్టింది. ప్రపంచ స్థాయి క్రీడాకారిణులతో పోటీపడుతూ ఫైనల్‌కు దూసుకెళ్లింది. అమెరికా ఆర్చర్ కార్సన్ క్రాహేకు సవాల్ విసిరిన మధుర.. గురి చూసి లక్ష్యాన్ని చేరుకుంది. మూడో రౌండ్‌లో 81–85తో వెనకబడినప్పటికీ ఒత్తిడికి లోనవ్వలేదు. వరుసగా రెండుసార్లు 10 పాయింట్లు సాధించి ప్రత్యర్థికి షాకిచ్చింది. ఆఖరి రౌండ్‌లో 9 పాయింట్లతో కార్సన్‌ను వెనక్కి నెట్టి.. స్వర్ణ పతకం గెలుచుకుంది. తద్వారా విశ్వ వేదికపై తొలి బంగారు పతకంతో మురిసిపోయిందీ యువ ఆర్చర్. మూడేళ్లుగా అంతర్జాతీయ టోర్నీలో పాల్గొనకపోవడంతో 24 ఏళ్ల మధర అన్ సీడెడ్‌గా ఈ పోటీల్లో బరిలోకి దిగింది. ఈవెంట్‌లో మహిళల టీమ్ ఈవెంట్‌లో వెండి, కాంపౌండ్ మిక్స్‌డ్ విభాగంలో అభిషేక్ వర్మతో కలిసి దేశానికి కాంస్యం అందించింది మధుర.

## ఆపరేషన్ సిందూర్..

### క్షమాపణలు చెప్పిన దర్శకుడు




'ఆపరేషన్ సిందూర్' పేరుతో బాలీవుడ్‌లో ఓ సినిమా సిద్ధం కానుంది. ఇదే విషయాన్ని తెలియజేస్తూ చిత్ర దర్శకుడు ఉత్తమ్ మహేశ్వరీ టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు. దేశ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ సమయం, సందర్భం లేకుండా టైటిల్ రివీల్ చేసినందుకు నెటిజన్ల నుంచి విమర్శలు ఎదురుకావడంతో చివరకు ఆయన క్షమాపణలు చెబుతూ స్టేట్‌మెంట్ విడుదల చేశారు. ఎదుటివ్యక్తుల మనోభావాలను దెబ్బతీసే ఉద్దేశం తనకు లేదని ఆయన స్పష్టం చేశారు. డబ్బు లేదా ఫేమ్ కోసం తాను ఇలాంటి పని చేయలేదని అన్నారు. ''ఆపరేషన్ సిందూర్'పై సినిమా చేస్తున్నట్లు ప్రకటించినందుకు క్షమాపణలు తెలియజేస్తున్నా. ఇతరుల మనోభావాలను గాయపరచడం లేదా రెచ్చగొట్టడం నా ఉద్దేశం కాదు. మన సైనికుల ధైర్య సాహసాలను, త్యాగాన్ని, నాయకత్వాన్ని ఒక పవర్‌ఫుల్ కథగా వెండితెరపైకి తీసుకురావాలని అనుకున్నా. దేశం పట్ల నాకున్న గౌరవాన్ని తెలియజేస్తూ దీనిని రూపొందించాలనుకున్నా. అంతేకానీ, డబ్బు లేదా ఫేమ్ కోసం కాదు. అయితే, సమయం, సున్నితత్వం కొంతమందికి అసౌకర్యం కలిగించి ఉండొచ్చు. అందుకు క్షమాపణలు చెబుతున్నా. ఇది కేవలం సినిమా మాత్రమే కాదు ఇది దేశ ప్రజల ఎమోషన్'' అని ఆయన రాసుకొచ్చారు.

# రీల్

## ఎప్పటికీ క్షమాపణలు చెప్పను..

### సెలీనా జైట్లీ



ఉగ్రవాదానికి తాను ఎప్పుడూ వ్యతిరేకినేనని అన్నారు నటి సెలీనా జైట్లీ. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉంటోన్న ఆమె.. ఇటీవల భారత సాయుధ దళాలను ప్రశంసిస్తూ వరుస పోస్ట్‌లు పెట్టారు. దీంతో కొందరు ఆమెను ట్రోల్స్ చేయడం ప్రారంభించారు. భారత్‌ను ప్రశంసిస్తే తనను అన్‌ఫాలో చేస్తామని బెదిరించారు. తాజాగా ఈ ట్రోల్స్‌పై ఆమె స్పందించారు. తాను ఉగ్రవాదానికి ఎప్పుడూ వ్యతిరేకినేనని తన ధోరణి నచ్చని వాళ్లు అన్‌ఫాలో చేయవచ్చని అన్నారు. ''భారత్ గురించి మాట్లాడితే అన్‌ఫాలో చేస్తామని కొందరు అంటున్నారు. అలా బెదిరించేవారి కోసమే ఈ పోస్ట్ పెడుతున్నాను. నా దేశం కోసం నిలబడినందుకు నేను ఎప్పటికీ క్షమాపణలు చెప్పను. ఉగ్రవాదం పేరుతో అమాయకుల ప్రాణాలు తీస్తున్నా కూడా నేను స్పందించకుండా మౌనంగా ఉండలేను. ఎంతోమంది అమాయకుల ప్రాణాలు తీశారు. హింసను సమర్థిస్తూ.. దాన్ని పోత్సహించే వారివైపు నేను ఎప్పుడూ నిలబడను. భారత్‌పై నాకున్న ప్రేమ మిమ్మల్ని బాధపెడితే.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా వినిపించే నా మాటలు మీరు వినలేకపోతే.. నన్ను అనుసరించడం మానేయండి. నేను శాంతి కోసం మాట్లాడతాను. సత్యం కోసం నిలబడతాను. ఎప్పుడూ నా సైనికుల వెంటే ఉంటాను. ఎందుకంటే నా సైనికులు పేరు, మతం అడగకుండానే రక్షిస్తారు. మీ అందరి ట్రోల్స్, బెదిరింపులు నేను గమనిస్తూనే ఉన్నాను. నేను ఇలాంటి వారిని క్షమించను. జైహింద్'' అని రాసుకొచ్చారు.

## 'జైలర్–2'లో బాలయ్య?

నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా ఇప్పుడు అవైటెడ్ సీక్వెల్ అఖండ–2 చేస్తున్న సంగతి తెలిసిందే. ఇక ఈ సినిమా పక్కన పెడితే బాలయ్య మరో భారీ సీక్వెల్ జైలర్–2లో కూడా గెస్ట్ రోల్‌గా చేయనున్నారు అని టాక్ ఉంది. సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ కలయికలో వచ్చిన జైలర్ చిత్రం బ్లాస్టింగ్ బ్లాక్ బస్టర్ అయ్యింది. మరి ఇప్పుడు సీక్వెల్ లో బాలయ్య కూడా ఉన్నారనే టాక్ మరింత హైప్ తీసుకురాగా ఫైనల్ గా ఓ సాలిడ్ బజ్ వినిపిస్తోంది. బాలయ్య ఏకంగా జైలర్ 2 కోసం 20 రోజులు కాల్షీట్స్ ఇచ్చినట్టు రూమర్స్ వినిపిస్తున్నాయి. అంటే సినిమాలో బాలయ్య ఎంతసేపు కనిపిస్తారో అర్థం చేసుకోవచ్చు. ఇక దీనిలో ఎంతవరకు నిజం ఉందో వేచి చూడాలి.





## 'డ్యూడ్' అంటూ డ్రాగన్ హీరో

తమిళ నటుడు కమ్ డైరెక్టర్ ప్రదీప్ రంగనాథన్‌కు తెలుగులోనూ మంచి ఫాలోయింగ్ ఉంది. ఆయన నటించే సినిమాల్లో యూత్‌ను ఆకట్టుకునే అంశాలు ఉంటాయని ప్రేక్షకులు భావిస్తారు. ఈ క్రమంలోనే ఆయన వరుసగా చిత్రాలను చేస్తున్నాడు. రీసెంట్‌గా 'డ్రాగన్' మూవీతో ప్రదీప్ రంగనాథన్ బాక్సాఫీస్ దగ్గర మంచి విజయాన్ని అందుకున్నాడు. ఇక ఇప్పుడు ఆయన తన తదుపరి చిత్రాన్ని పట్టాలెక్కిస్తున్న సంగతి తెలిసిందే. కీర్తిశ్వరణ్ అనే కొత్త డైరెక్టర్‌తో ప్రదీప్ రంగనాథన్ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాకు 'డ్యూడ్ అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఇక దీనికి సంబంధించి తాజాగా ఓ పోస్టర్‌ను కూడా మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ సినిమాలో మలయాళ బ్యూటీ మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాను పాన్ ఇండియా మూవీగా గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. దీపావళి కానుకగా ఈ సినిమాను రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు.




## దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలి

### భవన నిర్మాణ కార్మిక సంఘాల సదస్సు పిలుపు




**ప్రజాపక్షం / హైదరాబాద్:** కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం1996, వలస కార్మికుల చట్టం1979 పునరుద్ధరణకు ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల సదస్సు పిలుపునిచ్చింది. భవన నిర్మాణ కార్మిక సంఘాల సదస్సు ఎఐటియుసి, సిఐటియు, బిఆర్‌టియు, టియుసిఐ, ఐఎఫ్‌టియు, బిఎన్‌ఆర్‌కెఎస్, ఎస్ఎన్‌ఆర్‌కెఎస్, ఐఎఫ్‌టియు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సదస్సుకు పల్లా దేవేందర్‌రెడ్డి (టిఎస్‌బిసిడబ్ల్యుయు–ఎఐటియుసి), ఆర్.కోటంరాజు (సిఐటియు), పాలడుగుల రమేష్ (బిఆర్ టియు), సాంబశివుడు (టియుసిఐ), గంట నాగయ్య (ఐఎఫ్‌టియు), ఉప్పల సాయికుమార్ (బిఎన్‌ఆర్ఎకెఎస్), జి.చంద్రమౌళి (ఎస్‌బిఎన్ఎస్), విజయ్ (ఐఎఫ్‌టియు)ల అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా ఎఐసిబిసిడబ్ల్యు డిప్యూటీ సెక్రటరీ ఎం.ప్రవీణ్‌కుమార్, సిడబ్ల్యుఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు పాల్గొన్నారు. సదస్సులో ఎం.ప్రవీణ్ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక, బడా వ్యాపార సంస్థల అనుకూల విధానాలతో పాలన కొనసాగిస్తోందని, భవన నిర్మాణ రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానించి విచ్చలవిడిగా యంత్రాల వాడకానికి అనుమతిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో వైపు నిర్మాణాల్లో వాడే ముడి సరుకుల ధరలు పెరిగి సామాన్యుల ఇళ్ల నిర్మాణాలు తగ్గిపోయాయని, ఫలితంగా కార్మికులు చేతినిండా పని దొరక్క అడ్డాల వద్ద పనుల కోసం ఎదురుచూస్తున్న దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వెల్ఫేర్ బోర్డు నిధులు కార్మికుల సంక్షేమం కోసం కాకుండా అక్రమంగా దారి మళ్ళించి దుబారా చేస్తున్నారని, కార్మికులకు ఇవ్వవలసిన నష్టపరిహారాలు కూడా సకాలంలో ఇవ్వడం లేదని విమర్శించారు. వెల్ఫేర్ బోర్డులో పైరవీకారులు, బ్రోకర్ల ప్రభావాన్ని అరికట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎం.సాయిబాబు మాట్లాడుతూ భారత కార్మికవర్గానికి, భవన ఇతర నిర్మాణ కార్మికులకు గొడ్డలిపెట్టు వంటి 4 లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని, వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీ నియమించి, కార్మికుల సంక్షేమం కోసమే నిధులు ఖర్చు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అన్నిరకాల నిర్మాణాల పనుల వద్ద ప్రమాదాలలో గాయపడి, మరణించినా నష్టపరిహారాలు అందుతున్నాయని, లేబర్ కోడ్స్ అమలైతే 12 అడుగుల ఎత్తు లోపు నిర్మాణాల వద్ద, భవనాల్లో రిపేర్లు, మార్పులు, చేర్పుల పనులకు, చమురు, గ్యాస్ సంస్థల నిర్మాణాల్లో పనిచేసే కార్మికులకు ఈ చట్టం వర్తించదని, సెస్ నిధుల వసూళ్ళలో మార్పులు చేస్తూ యజమాని చెప్పిన విధంగానే వసూలు చేయాలని, సెస్సు వసూలు రూ.10 లక్షల నుండి రూ.50 లక్షల పైబడిన నిర్మాణాల నుండే వసూలు చేయాలని మార్పు చేశారని, 10 మందికి పైన పనిచేసే చోట మాత్రమే చట్టం వర్తిస్తుందని వివరించారు.

సదస్సులో కార్మిక సంఘాల నాయకులు పి.నారాయణ (బిఆర్‌టియు), అన్మేష్ (టియుసిఐ), అనూరాధ (ఐఎఫ్‌టియు), కె.ఐలన్న (బిఎన్‌ఆర్‌కెఎస్), ఎస్.కుమార్ (ఎస్‌బిఎస్‌ఆర్‌కెఎస్), ఎ.కృష్ణ (ఐఎఫ్‌టియు), వి.రాములు (బిల్డింగ్ వర్కర్స్ ఫెడరేషన్), జి.రమేష్ (ఎఐటియుసి) తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ సుందరి పోటీలు

### లాంఛనంగా ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియం వేదికగా 72వ ప్రపంచ సుందరి పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రపంచ సుందరి పోటీలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ప్రముఖ కవి అందెశ్రీ రచించిన జయ జయ హే తెలంగాణ రాష్ట్ర గీతం ఆలాపనతో ప్రారంభమైన పోటీలకు ముందు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. మొత్తం 250 మంది కళాకారులతో పేరిణి నృత్య ప్రదర్శనతో సభికులను ఆకట్టుకున్నారు. గుస్సాడీ, కొమ్ము కోయ కళాకారులు తమ ప్రదర్శనతో విదేశీ అతిథులను ఆకర్షించారు. 116 దేశాల సుందరిమణులు తమ దేశాల జాతీయ జెండాలతో వేదికపై సందడి చేశారు. చివరగా భారతదేశ ప్రతినిధిగా పాల్గొంటున్న మిస్ ఇండియా నందిని గుప్తా త్రివర్ణ పతాకంతో వేదిక పైకి రాగానే ఆహ్వానితులతో పాటు సందర్శకులు పెద్దఎత్తున కరతాళ ధ్వనులతో స్వాగతం పలికారు. మిస్ వరల్డ్ ప్రారంభ సమావేశంలో వివిధ దేశాల సుందరీమణులు తమ దేశీయ ఆహార్యంతో పాటు వివిధ దేశాల సంస్కృతి, సాంప్రదాయ వేషదారణలతో ఆలరించారు. సరిహద్దుల్లో దేశ రక్షణ కోసం పోరాడుతున్న సైనికుల ధైర్య సాహసాలకు నిర్వహకులు సెల్యూట్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మిస్ వరల్డ్ లిమిటెడ్ సిఈఓ జూలియా మోర్లీ, మిస్ వరల్డ్–2024 క్రిస్టినా, తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, యువజన అభివృద్ధి, పర్యాటక సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ ప్రపంచ శాంతికి చక్కటి సందేశం ఇచ్చామన్నారు. తెలంగాణ టూరిజాన్ని ప్రమోట్ చేయాలని కంటెస్టెంట్స్‌ను ఆయన కోరారు.



## పాక్ షెల్స్ దాడిలో ఆరుగురు మృతి

(మొదటి పేజీ తరువాయి)

పూంచ్, ఉరిలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. శనివారం తెల్లవారుజామున జరిగిన కాల్పుల్లో ఆరుగురు మృతి చెందారు. కాగా, శనివారం రాజౌరి పట్టణంలోని ఓ అధికారి నివాసంపైకి పాక్ సైన్యం ఫైర్ చేసిన షెల్ దూసుకు వచ్చింది. దాంతో రాజౌరీ అదనపు డిప్యూటీ కమిషనర్ రాజ్ కుమార్ థాపా, ఆయన ఇద్దరు సిబ్బంది గాయపడ్డారని అధికారులు పేర్కొన్నారు. ఇద్దరిని ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిద్దని పరిస్థితి సైతం విషమంగానే ఉందని అధికారులు పేర్కొన్నారు. అదే విధంగా పూంచ్‌లోని కృష్ణ ఘాటి సెక్టార్‌లోని తన పోస్టు సమీపంలో పాక్ సైన్యం షెల్‌ను పేల్చగా హిమమాచల్ ప్రదేశ్ నివాసి అయిన సుబేదార్ మేజర్ పవన్ కుమార్ వీర మరణం పొందినట్లు అధికారులు తెలిపారు. రాజ్‌కుమార్ థాపా, పవన్‌కుమార్ మృతికి జమ్ము కశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా సంతాపం ప్రకటించారు. ఇది విషాదకరమైన వార్త అని.. జమ్ముకశ్మీర్ అడ్మినిస్ట్రేషన్ సర్వీసెస్‌కు చెందిన అంకితభావంతో పనిచేసే అధికారిని తాము కోల్పోయామన్నారు. శుక్రవారం ఆయన డిప్యూటీ సిఎంతో కలిసి జిల్లాలో పర్యటించారని.. తాను అధ్యక్షతన వహించిన ఆన్‌లైన్ సమావేశానికి సైతం హాజరయ్యారని తెలిపారు. శనివారం అధికారి నివాసంపై పాక్ కాల్పులు జరిపారని.. రాజౌరి పట్టణాన్ని లక్ష్యంగా చేసుకొని దాడి చేశారని.. ఈ ఘటనలో రాజ్‌కుమార్ థాపా చనిపోయారన్నారు. ఈ ఘోర ప్రాణనష్టం తనకు షాక్ లాంటిదని.. ఈ ఘటనపై స్పందించేందుకు తనకు మాటలు రావడం లేదన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలంటూ 'ఎక్స్' పోస్ట్‌లో సిఎం అబ్దుల్లా పేర్కొన్నారు. కాగా, పాక్ కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు సిఎం ఒమర్ అబ్దుల్లా తెలిపారు. పాకిస్థాన్ జరుపుతున్న షెల్లింగ్ వల్ల అమాయకులు మృతిచెందడం తీవ్ర బాధను కలిగిస్తున్నదని, ప్రజల సమస్యలను తగ్గించేందుకు వీలైనన్ని చర్యలు తమ ప్రభుత్వం తీసుకుంటోందని సిఎం ఒమర్ అబ్దుల్లా తెలిపారు.

## మధ్యవర్తిత్వం చేసింది? : సిపిఐ

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలను ద్వైపాక్షికంగా పరిష్కరించుకునే పరిణతిని కలిగి ఉన్నాయని తాము విశ్వసిస్తున్నట్లు ఆయన తెలిపారు. అమెరికా చేసిన 'మధ్యవర్తిత్వం' ఏమిటో ప్రధాన మంత్రి మోదీ దేశానికి, మన ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. సిపిఐ, ఇతర ప్రగతిశీల శక్తులతో కలిసి, భారతదేశం, పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణను నిరంతరం సమర్థిస్తూ వస్తోందని, శాంతి, ప్రాంతీయ స్థిరత్వం కేవలం చర్చలు, దౌత్యం ద్వారా మాత్రమే సాధ్యమవుతాయని నొక్కి చెబుతోందన్నారు. పహల్గాంలో జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్ , భారతదేశం, పాకిస్థాన్ మధ్య పెరిగిన సైనిక ఉద్రిక్తతల తరువాత, ప్రజలలో ఆందోళనలు నెలకొన్నాయని, పొరుగు దేశాల మధ్య పూర్తి స్థాయి యుద్ధా న్ని నివారించడానికి తక్షణ కాల్పుల విరమణ ప్రకటన చేయాలని తాము గతంలో డిమాండ్ చేసినట్లు రాజా గుర్తు చేశారు.

### కాల్పుల విరమణ, శాంతి చర్చలను స్వాగతిస్తున్నాం :

**సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ**

భారత్‌పాక్ మధ్య కాల్పుల విరమణ, శాంతి చర్చలను స్వాగతిస్తున్నామని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పేర్కొన్నారు. ఆయన శనివారం ఇక్కడ మీడియాతో మాట్లాడారు. యుద్ధం అనేది ఎప్పటికైనా మానవాళికి వ్యతి రేకమైనది, కోలుకోలేని నష్టం కలిగించేది అన్నారు. ఉగ్రవాదులు ఇంకా ప్రమాదకారులు అన్నారు. టెర్రరిస్టు లను అంతం చేయడానికి కావాల్సిన ఏర్పాట్లు తప్పనిసరిగా చేయాల్సిందే నని ఆయన స్పష్టం చేశారు. రేపు భారత్ పాక్ మధ్య జరుగనున్న ద్వైపాక్షిక చర్చల్లో ఎవరైతే పహల్గామ్ దాడికి పాల్పడ్డారో ఆ ఉగ్రవాదులను వెనక్కి తీసుకొచ్చి తగిన శిక్ష విధించాల్సిందేనని నారాయణ డిమాండ్ చేశారు. ఇంతకుముందు బాంబేలో హోటల్‌పై దాడికి పాల్పడ్డవారిని వెనక్కి తీసుకొచ్చిన మాదిరిగానే పహల్గామ్ దాడికి పాల్పడ్డ ఉగ్రవాదులను వెనక్కి తీసుకొచ్చేలా చర్చల్లో ప్రయత్నించాలని సూచించారు. తాను ఇటీవల ఉగ్రవాదుల మీద దాడి చేయాలని, శాంతిచర్చలు జరిపి యుద్ధాన్ని నివారించాలని అంటే ఆ వ్యాఖ్యలను కొంతమంది బిజెపి నాయకులు, ఇతరులు కొందరు వక్రీకరించి నారాయణను పాకిస్థాన్‌కు పంపించాలని అవాకులు చెవాకులు పేలారని, ఇప్పుడేమి అంటారని, శాంతిచర్చలు కొనసాగించనున్న మోదీని కూడా పాకిస్థాన్‌కు పంపిస్తారా అని నారాయణ ప్రశ్నించారు. పహల్గామ్ ఉగ్రదాడిలో 26మంది మృతిచెందారని, వారి కుటుంబాలకు నష్టపరిహారం ఎవరు ఇస్తారు? వారిని ఆదుకునేందుకు బాధ్యత ఎవరు వహిస్తారు ? అనేది ఆలోచించాలన్నారు.



## తక్షణమే అఖిలపక్షం

(మొదటి పేజీ తరువాయి)

జైరామ్ రమేశ్ ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. 'వాషింగ్టన్ డిసి నుండి వచ్చిన మునుపెన్నడూ లేని రీతిలో ప్రకటన దృష్ట్యా, తక్షణమే ప్రధాన మంత్రి అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించి, రాజకీయ పార్టీలను విశ్వాసంలోకి తీసుకోవాల్సిన అవసరం మునుపటి కంటే ఎక్కువగా ఉంది'' అని ఆయన పేర్కొన్నారు. 'క్రూరమైన పహల్గాం ఉగ్రదాడితో ప్రారంభించి, ముందుకు సాగే మార్గంతో సహా గత 18 రోజుల సంఘటనలపై చర్చించడానికి, సమష్టి సంకల్పాన్ని ప్రదర్శించడానికి పార్లమెంటు ప్రత్యేక సమావేశం కూడా అవసరం' అని ఆయన అన్నారు. కాల్పుల విరమణ ప్రకటన వచ్చిన కొద్దిసేపటిలోనే కాంగ్రెస్ నుంచి ఈ స్పందన వచ్చింది.

## ఉల్లంఘన (మొదటి పేజీ తరువాయి)

ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయి. పాకిస్థాన్ డిజిఎంఒ భారత డిజిఎంఒకు ఫోన్ చేశారు. కాల్పుల విరమణకు ఇరు దేశాల సైనికాధికారులు అంగీకరించారు. సాయంత్రం 5గంటల నుంచి ఇది అమల్లోకి వచ్చింది. భూ, గగన, సముద్రతలాల నుంచి ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతుంది. వీటికి సంబంధించి ఇరుదేశాల సైన్యానికి తగిన ఆదేశాలు వెళ్లాయి. ఈ నెల 12న సాయంత్రం డిజిఎంఒలు మళ్లీ చర్చలు జరుపుతారు' అని విదేశాంగ శాఖ ప్రకటించింది. ఆ తర్వాత కొన్ని గంటలకే పాక్ నుంచి డ్రోన్లు భారత భూ భాగంలోకి దూసుకొచ్చాయి. ఎక్కడికక్కడ డ్రోన్లను సైన్యం నిర్వీర్యం చేస్తోంది. శ్రీనగర్‌లోని 25 కార్ప్స్ ప్రధాన కార్యాలయం వద్ద కనిపించిన అన్ని డ్రోన్లను నిర్వీర్యం చేసినట్టు సైనిక వర్గాలు తెలిపాయి. మరో వైపు శ్రీనగర్‌లో కాల్పుల శబ్దాలు వినిపిస్తున్నాయని సిఎం ఒమర్ అబ్దుల్లా ట్వీట్ చేశారు. గుజరాత్ సహా, శ్రీనగర్, కథువా తదితర ప్రాంతాలలో బ్లాకౌట్ పాటిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అంగీకారం కుదిరిన కొద్ది గంటలకే పాకిస్థాన్ తిరిగి తన బుద్ధిని బయట పెట్టింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com